
ISSN No : 2581-7477


# సాహిత్య ప్రస్థానం

Sahitya Prasthanam

సంపుటి - 3 సంచిక - 10 జులై 2022 కృష్ణా పేజీలు 68 వెల రూ. 20



శీలా వీర్రాజు



గుడిపూడి శ్రీహరి



చిన్నప్ప భారతి

## అక్షర యోధులకు జోహార్లు!

సాహితీస్రవంతి




అరకు వెళ్లే మలుపు దారిలో...

ఫొటో : గేర

సాహిత్య ప్రస్థానం
జులై 2022
సంపుటి : 3 సంచిక : 10

# నిర్బంధాలూ .. నిషేధాలూ ...

దేశంలో భావప్రకటనా స్వేచ్ఛపైన, రచనా స్వాతంత్ర్యంపైన పెరిగిపోతున్న ఆంక్షలు ఆందోళనకరంగా మారాయి. పాలకవర్గాల పోకడలను మతతత్వ రాజకీయాలను విమర్శించే రచయితలనూ, పాత్రికేయులనూ నిర్బంధించడం నిత్యకృత్యంగా మారింది. గుజరాత్ హత్యాకాండకు సంబంధించిన ఒక పిటిషన్ విచారణలో సుప్రీంకోర్టు తీర్పును చూపుతూ మానవ హక్కుల కార్యకర్త తీస్తా సెతల్వాద్ తదితరులను అరెస్టు చేశారు. ఈ అరెస్టులు దేశంలోనే గాక అంతర్జాతీయ వేదికలపైన కూడా నిరసనకు దారి తీశాయి. నిజానికి ఆ మారణహోమాన్ని నాటి రాష్ట్ర ప్రభుత్వ అలసత్వాన్ని అప్పట్లో ఈ పత్రికతో సహా సాహిత్యకారులు వేనోళ్ల ఖండించారు. తెలుగు కవులు గుజరాత్ గాయం కవితా సంకలనం తీసుకొచ్చారు. నాటి నిందితులను బయటపెట్టడంలోనూ, బాధితులకు భరోసా ఇవ్వడంలోనూ ముందు నిలిచిన వ్యక్తి తీస్తా. నరమేధానికి కారణమైన నేరస్తులను శిక్షించే బదులు ఆమెకే దురుద్దేశాలు అంటకట్టి నిర్బంధించడమంటే ధైర్యంగా పోరాడేవారిని హడలగొట్టడమే అవుతుంది. ఇదే సమయంలో సోషల్ మీడియాలో చలామణి అయ్యే కథనాల నిజానిజాలను ఫ్యాక్ట్ చెక్ ప్రక్రియతో ఎండగట్టే ఆల్ట్‌మీడియా వ్యవస్థాపకుడు జుబేద్‌ను కూడా అరెస్టు చేసి ఏవో కొత్త కొత్త కేసులు తెస్తున్నారు. సాహిత్య సినీ మీడియా రంగాల్లో తమతో ఏకీభవించని వారిని పాలకులు వేటాడటం, విమర్శలపై అసహనంతో విరుచుకుపడటం ప్రజాస్వామ్య సూత్రాలకే విరుద్ధం. ఈ ధోరణి తెలుగు రాష్ట్రాల్లోనూ చూస్తున్నాం.

ఇక విరసం నాయకుడు, కవి వరవరరావు కవితాసంపుటి ప్రచురించే పెంగ్విన్ రాండమ్ హౌస్ సంస్థ హిందూత్వ, సంఘపరివార్, కాషాయీకరణ పదాలను తొలగించాలని చెప్పడం ముందస్తు సెన్సారింగ్‌కు నిదర్శనం. భీం కోరగావ్ కేసులో దీర్ఘకాలంగా జైలులో వుంటున్న వయోవృద్ధుడైన వరవరరావును తీవ్ర అనారోగ్య కారణంగా బెయిలుపై విడుదల చేయడానికి కూడా సిద్ధపడటం లేదు. ఆయన ఎప్పుడో రాసిన కవితల ప్రచురణకు కూడా ఇలాటి ఆంక్షల విధింపు వార్తలు నిజమైతే దారుణం. భాషలో వున్న ఈ పదాలను నిషేధించడం రాజ్యాంగ విరుద్ధం. రాజద్రోహం చట్టాన్ని ప్రస్తుతానికి అమలు నిలిపేయాలని సుప్రీం కోర్టు చెప్పిన నేపథ్యంలో ఆ తరహా చర్యలు, ఉత్తర్వులు కూడా తక్షణం నిలిపేయాలి. ఈ నిరంకుశ చట్టాలన్నిటినీ వెంటనే తొలగించాలి. ప్రజాస్వామ్యం, లౌకికతత్వం వర్ధిల్లాలి.

■

ప్రధాన సంపాదకుడు
తెలకపల్లి రవి
వర్కింగ్ ఎడిటర్
సత్యాజీ

సంపాదకవర్గం
కె.సత్యరంజన్ • కెంగార మోహన్ • వొరప్రసాద్
• చీకటి దివాకర్ • గనారా • కుమార స్వామి
మేనేజర్ : కె.లక్ష్మయ్య

బొమ్మలు
తుంబలి శివాజి
చిదంబరం

Owned, Printed and Published by **V. Krishnaiah** 41-9 -16, 1st Floor, F-3, Ramalayam Street, Near Kalpana Prints, Krishna Lanka, Vijayawada (Urban) - 520013, Krishna District. Andhrapradesh. Printed at Sri Chaitanya Offset Printers, 29-7-36, Vishnuvardhan Rao Street, Suryaraopet, Vijayawada - 520 002, Andhrapradesh. Published at 27-30-4, M.B.Vignanakendram, 3rd Floor, Akulavari Veedhi, Governorpet, Vijayawada - 520 001, Andhrapradesh.
Editor : Telakapalli Ravi

## కథలు


బతకాలి ..! : సింహ ప్రసాద్ ............. 5
ఇల్లరికం : చిలుకూరు శ్రీనివాసరావు 19
పద్ధతి.com : పలమనేరు బాలాజీ ...... 32
కట్టని కంత : వి.రెడ్డెప్ప రెడ్డి ............. 46


## కవితలు


ఖరీదైన ఆశ : సాంబమూర్తి లండ ........ 9
మతాంబోతులు : పల్లిపట్టు నాగరాజు ...... 14
బేల చంద్రుడు : గొర్తి వాణీ శ్రీనివాస్ ...... 23
అంకెలు – అక్షరాలు : మల్లారెడ్డి మురళీ మోహన్ 23
ఆఖరి ఆయుధం : కంచరాన భుజంగరావు 26
నేనూ వలసపక్షినే .. : రజిత కొండసాని ........... 26
కర్తవ్యం : గుండాన జోగారావు ...... 29
ఉపశమనం : శ్రీను కుదుపూడి ......... 36
మట్టిని దీవించే ముసురు : చందలూరి నారాయణరావు 36
బతుకు తీరు : దాసరాజు రామారావు .... 41
వెళ్లిపోయాక ... : పద్మావతి రాంభక్త ......... 41
ఎప్పుడూ అదే మోసం : జంధ్యాల రఘుబాబు ..... 44
ఉద్యమ రుతువు : చిత్తలూరి .................. 45
మహాబోధి : సి భవానీ దేవి ............. 49
గుండెల బాంబులు : కళారత్న బిక్కి కృష్ణ ........ 50
చరవాణి వదిలేశాక ... : పుట్టి గిరిధర్ .............. 54
బీటలు వారిన దేహం : స్వయంప్రభ ................57
ఒంటరితనం : పేరిచర్ల సునీత ........... 61
మాతృక : శాంతయోగి యోగానంద 61
బాల్యం గుర్తొస్తోంది! : అడిగోపుల వెంకటరత్నమ్ 62


## వ్యాసాలు


అట్టడుగు వెతలపై ఆలోచన పెంచే కథలు
– వేపకాయల ప్రసాద్ ............... 10
వాస్తవికతా అక్షర శిల్పి చిన్నప్ప భారతి
– తె.ర. .............................. 15
తల్లీ .. నిన్ను తలంచి
– తెలకపల్లి రవి .................... 17
కవిత్వం కంటే కాంతిమంతుడు
– ప్రసాదమూర్తి ..................... 24
అవి విరగ్గాసిన కథావృక్షాలు
– కవిత శ్రీ ........................... 27
సముద్రమంత ... భావోద్వేగం
– డా. ఎం.వెంకట లక్ష్మమ్మ ........ 30
సాహితీ ప్రజ్ఞ .................................................. 37
రాయలసీమ కవిత్వం – ప్రజాభ్యుదయం
– డాక్టర్ బి.నాగశేషు .............. 38
వాస్తవ ప్రతిబింబాలు కాట్రగడ్డ దయానంద్ కథలు
– వి. పూర్ణ చంద్రశేఖర్ రావు ..... 42
తీస్తా సెతల్వాడ్‌పై 'మోడీరాజ్' వేట
– తెలకపల్లి రవి .................... 51
ముఖాముఖి : సాహిత్యకారులకు నిబద్ధత అవసరం
– డా.రాచపాళెం చంద్రశేఖరరెడ్డి 55
మానవ సంబంధాలను స్పృశించిన కవిత్వం
– డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్ ........ 59
డైరీ ........................................................... 63



ISSN No: 2581 - 7477

**సాహిత్య ప్రస్థానం మాసపత్రికను ప్రోత్సహించండి. తెలుగు భాష, సాహిత్య వికాసాలకు మీరూ తోడ్పడండి !**

:: రచనలు, చందాలు, విరాళాలు, మనీ ఆర్డర్లు, చెక్కులు, డిడిలు పంపవలసిన చిరునామా ::

సాహిత్య ప్రస్థానం, ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి - 522501, గుంటూరు జిల్లా. ,
ఫోన్ : 0866-2577248, చందా వివరాలకు : 94900 99057, రచనలకు : 94900 99167
ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com, వెబ్‌సైట్ : www.prasthanam.com

1 సంవత్సర చందా రూ. 240 ◆ 5 సంవత్సరాల చందా రూ.1000 ◆ 10 సంవత్సరాల చందా రూ. 2000

Bank A/c Details: A/c Name: PRASTHANAM, SBI, Governorpet, Vijayawada. A/c No. 52001500585, IFSC: SBIN0020343. చెక్కులు, డిడిలపై prasthanam అని రాయగలరు.

# బతకాలి ..!



- సింహప్రసాద్
98490 61668

"రేపు వేటకెళ్తాం" అన్నాడు సెల్వరాజ్.

ఆ మాటలకు బెంబేలు పడి చూసింది అణ్ణమ్మ. ఆమె కళ్లల్లో భయం సుళ్లు తిరిగింది. అంతలోనే కరోనా లాక్‌డౌన్ వల్ల కుదేలైన కుటుంబం కళ్ల ముందు కదిలింది. తనకు తాను ధైర్యం చెప్పుకుంది. చిన్నగా నిట్టూర్చింది.

అతడేమో గాఢంగా నిట్టూర్చాడు.

క్రితం రోజున జరిగిన ఘోర దుర్ఘటన వారి మనస్సంద్రాన్ని అల్లకల్లోలం చేస్తోంది. వారినే కాదు రామేశ్వరంలోని జాలర్లందర్నీ భయభ్రాంతుల్ని చేస్తోంది. ఆ షాక్ నుండి తేరుకోలేకుండా వున్నారంతా.

మూడ్రోజుల క్రితం ఆ పల్లెగూడెం మత్స్యకారులు మరబోటులో చేపల వేటకెళ్లారు. వారు తమ జలాల్లోకి చొచ్చుకొచ్చారని చెప్పి శ్రీలంక నావికాదళం అడ్డగించింది. నిర్దాక్షిణ్యంగా కాల్పులు జరిపింది. వారక్కడి కక్కడే కుప్పకూలిపోయారు.

వార్త ఆలస్యంగా తెలిసింది. గగ్గోలు పెట్టింది గూడెం.

అరెస్టు తప్పించుకుని పారిపోబోతూ బోటు తిరగబడి చనిపోయారని ఆ ప్రభుత్వం ప్రకటించింది. తమ నావికాదళం తప్పేం లేదని స్పష్టం చేసింది. కొంచెమైనా మానవత్వం ప్రదర్శించి వుండాల్సిందంటూ భారత ప్రభుత్వం నిరసన తెలిపింది.

చనిపోయిన జాలర్లలో డార్విన్ ఒకడు. అతడు పాతికేళ్ల క్రితం జాఫ్నా నుంచి, అక్కడి యుద్ధ పరిస్థితులు తట్టుకోలేక 'బతుకు జీవుడా' అనుకుంటూ వచ్చాడు. మండపం క్యాంప్ ఆదరించింది. బతకడానికి మరో అవకాశం లభించినందుకు సంబరపడ్డాడు. ఏడాది క్రితమే పెళ్లి చేసుకున్నాడు. మూడు వారాల క్రితమే బిడ్డ పుట్టింది. అతడి భార్యాబిడ్డల ఆక్రందన సముద్ర ఘోషలా అందరి గుండెల్లో ప్రతిధ్వనిస్తోంది!

వేదన దిగమింగుతూ, "అలా వెళ్లి నలుగుర్నీ కలుపు కొస్తాను" భార్యకి చెప్పి బయటికి నడిచాడు.

కళ్లల్లో ఆశ, నిరాశ రెండూ దోబూచులాడుతోంటే దిగులుగా చూస్తుండి పోయిందామె. అంతకంటే ఎవరూ చేయగలిగింది ఏమీ లేదని తెలుసు. తరతరాల్నుంచీ చేపలు పట్టడమే వారి వృత్తి. జీవనాధారం! సునామీలో గల్లంతైన పెద్ద కొడుకు కళ్ళ ముందు కదిలాడు. కన్న పేగు మూలిగింది. గుండె రాయి చేసుకుని కళ్ళు తుడుచుకుంది అణ్ణమ్మ.

సెల్వరాజ్ సముద్రం దగ్గరికెళ్లాడు. అవిశ్రాంతిగా లేచిపడుతున్నాయి కెరటాలు. లయబద్ధంగా మనోజ్ఞ సంగీతం విన్పిస్తోంది. పుట్టగానే మొదట చెవిన పడింది ఆ శబ్దమే. బతుకు పొడుగూతా ప్రతి అడుగులోనూ – శుభంలో అశుభంలో అన్నిటా అదే నేపథ్య సంగీతం. అది వినకుండా వుండలేడు. దూరంగా పారిపోనూ లేడు!

సముద్రం అమ్మలా, ఆప్తుడిలా, ఆదరువులా కన్పించింది. 'అన్నం పెట్టినా, అమ్మ రాక్షసిలా మింగేసినా అన్నీ నువ్వే తల్లీ!' అనుకున్నాడు. ఆరాధనగా చూశాడు. కెరటాలు చేతులు చాచి రారమ్మని పిలుస్తున్నాయి.

ఎక్కడ లేని ధైర్యం, ఉత్సాహం, ఉవ్వెత్తున లేచి వచ్చేశాయి.

'వచ్చేస్తాను. నీతోనే మా బతుకు. నీ తోడిదే మా బతుకు!' అనుకున్నాడు.

తోటి జాలర్లని కలిసి సంగతి చెప్పాడు. "వేటకి నా బోటు మీద ఎవరొస్తారు?"

మేం వస్తామంటే మేం వస్తామన్నారో పది మంది.

ఆశ్చర్యపోలేదు. నిన్నటి గాయం అప్పుడే మాను పట్టేసిందని గ్రహించాడు. బతకాలంటే పడవ ముందుకి సాగిపోక తప్పదు!

మేసయ్య, శేషురాజు, సైమన్, ముత్తు, సెంథిల్ మిగతా వారికన్నా ముందు లేచి వచ్చి, "మేం వస్తాం అన్నా" అన్నారు.

"డ్రైవర్తో నలుగురు చాలు. సైమన్ డ్రైవర్. మిగతా వారిలో ఒకరు అవసరం లేదు..."

ముత్తు వంక చూస్తూ అన్నాడు సెల్వరాజ్. అతడ్ని తీసుకెళ్లడం ఇష్టం లేదు. అతడో చోటా నాయకుడు. అన్నిటికీ రూల్సు మాట్లాడుతుంటాడు.

"ముత్తుని తీసుకుందాం. ఏమైనా గొడవొస్తే గట్టిగా నిలబడి సమాధానం చెబుతాడు" సైమన్ అనేసరికి మరి కాదనడానికి అవకాశం లేకపోయింది.

అర్ధరాత్రి దాటేక ఐస్ దిమ్మెలు, డీసిలు డబ్బా, బియ్యం, కాయగూరలు, పాలపొడి, కిరోసిన్ స్టౌ, నీళ్ల క్యాన్ వగైరాలు మరబోటులోకి ఎక్కించారు.

అలవాటుకి భిన్నంగా అణ్ణమ్మ వచ్చి పూజ చేసి కొబ్బరి కాయ కొట్టింది. బోటు ఇంజిన్ స్టార్ట్ చేశాడు సైమన్.

'మేం క్షేమంగా తిరిగొచ్చేట్టు ఆశీర్వదించు దేవుడా!' తమ తమ దేవుళ్లకు మొక్కుకున్నారు అయిదుగురు మత్స్యకారులూ.

"సముద్రం పోటు మీదుంది. చేప ఎగబడుద్ది" శేషురాజు అన్నాడు.

"టూనా చేప దొరికితే మన పంట పండుద్ది" అన్నాడు మేసయ్య.

"కచ్చ దీవి వైపు వుంటాయి" అని సెల్వరాజ్ అంటే, "అక్కడ గోతి కాడి నక్కల్లా శ్రీలంక నేవీ వాళ్లు కాచుక్కూర్చుంటారు" హెచ్చరించాడు ముత్తు.

"అబ్బే వూరికే చెబుతున్నా. ప్రమాదం కొని తెచ్చుకుంటామేంటి" సర్ది చెప్పాడు సెల్వరాజ్.

"లోపలికెళ్లకపోతే నత్తగుల్లలు తప్ప మనకేమీ దొరకవు. సముద్రపు సంపదంతా ట్రాలర్లు వూడ్చేస్తున్నాయి. అవే మన బతుకుల్ని ఆగమాగం చేసేస్తున్నాయి" బాధగా చెప్పాడు మైసయ్య.

"నిజం చెప్పాలంటే మన శత్రువులు శ్రీలంక జాలర్లూ కాదు, అక్కడి ప్రభుత్వమూ కాదు. బాటమ్ ట్రాలింగే అసలు సిసలు శత్రువు. మాములు వలలు కాదు తంగూసివాల్కె వాడతారు. అవి రాక్షస వలలు. కిలో మీటర్ల కొద్దీ సముద్రాన్ని కింది నుంచి సమస్తాన్నీ దేవేస్తాయి. చిన్న చిన్న చేప పిల్లలు, రొయ్య సీడ్, తాబేళ్ళ పిల్లలు దేనినీ వదలవు. సమస్తాన్నీ లాగేసుకుని మన కడుపులు కొడుతున్నాయి. పర్యావరణాన్నీ నాశనం చేస్తున్నాయి" ఆగ్రహంగా అన్నాడు ముత్తు.

"వాటి వల్లే బోట్లని నమ్ముకున్న మన్లాంటి జాలర్ల బతుకులు చితికి పోతున్నాయి. వాటిని నిషేధిస్తే బావుణ్ను" శేషురాజు అంటే, "శ్రీలంక జాలర్ల డిమాండూ అదే. అది చేస్తే వాళ్లకీ మనకీ సయోధ్య కుదిరేది" సాలోచనగా అన్నాడు సెల్వరాజ్.

"కాని చెయ్యరు. చేపల కంపెనీలు చెయ్యనివ్వవు. ఇక్కడి చేపల ఎగుమతి ద్వారా రూ.5000 కోట్లు వస్తున్నాయంటే అందులో అధికభాగం ట్రాలర్ల వాళ్ళదేగా"

ముత్తు మాటలు సెల్వరాజ్కి రుచించలేదు. "అవి చాలా పెద్దవి. కరైకల్ ట్రాలర్స్ అయితే ఇంకా పెద్దగా వుంటాయి. వాటి కెపాసిటీ చాలా ఎక్కువ. వరుసగా 10, 15 రోజుల పాటు వేటాడతారు. వాటి ఖరీదూ, ఖర్చూ ఎక్కువైనప్పుడు ఎక్కువ లాభం రావాలనుకోవడంలో తప్పేముంది"

"లాభనష్టాలు వాళ్ల దృష్టితో కాదు మన జాలర్ల దృష్టితో, పర్యావరణ దృష్టితో లెక్కవేయాలి. అది గ్రహించే ప్రభుత్వం డీప్ సీ ఫిషింగ్ని ప్రోత్సహిస్తోంది. దానికి పెట్టుబడి ఎక్కువ కావాలి గనుక సబ్సిడీ ఇస్తోంది. కానది మన్లాంటి సన్నకారు జాలర్లకు ఉపయోగం లేకుండా వుంది. ప్రభుత్వం దానికి పెట్టుబడి 80 లక్షలని లెక్క కట్టి 70% సబ్సిడీ ఇస్తోంది గాని నిజానికి కోటీ 20 లక్షలవుతుంది! ఇంక మాన్లాంటి వాళ్ళేం కొనగలరు!"

"కబుర్లు కట్టి బెట్టి పని చూడండి. ఇక్కడ చేప బాగానే వున్నట్టుంది. వల వేద్దామా?" సెల్వరాజ్ అన్నాడు.

ప్రశాంతంగా వున్న సముద్రపు నీటి లోతుల్లోకి అంతా కళు విప్పార్చి చూశారు. చెవి ఒగ్గి ఏవో శబ్దాలు విన్నారు. వేద్దామంటే వేద్దాం అనుకుని నలుగురూ సాయం పట్టి పెద్ద వలని సముద్రంలోకి విసిరేశారు. అది మెల్లగా విడివడి పరచుకుంది. సైమన్ బోటు ఇంజిన్ ఆపేశాడు. బోటు చిన్నగా వూగుతూ తేలుతోంది.

"నా చిన్నప్పుడు పాక్ జలసంధిలో ఈ మూల నుంచి ఆ మూలదాకా తిరిగి చేపలు పట్టేవాళ్లం" అన్నాడు సెల్వరాజ్ ఆ రోజుల్ని తలచుకుంటూ.

"అప్పట్లో జాఫ్నా జాలర్లతో మనకు సంబంధ బాంధవ్యా లుండేవంటగా" శేషురాజు అడిగాడు.

"చాలా కలివిడిగా వుండేవాళ్రా. మావా, అల్లుడూ అని వరసలు కలుపుకుని పిలుచుకునేవారు. ఎమ్జీఆర్ కొత్త సినిమా వస్తే చాలు జాఫ్నా జాలర్లంతా వచ్చేసేవారు. సినిమా చూసి మర్నాడు వెళ్లేవారు. మనోళ్లు వాళ్ళకి అంబలి, ఎండు చేపలు, బీడీలు ఇస్తే, వాళ్లు సిగరెట్లు, బిస్కెట్లు ఇచ్చేవారు. ఆ రోజులే వేరు!"

"ఒకప్పుడు మన రామనాథపురం రాజ్యంలో వున్న కచ్చదీవిని ఇందిరాగాంధీ శ్రీలంకకి ఇచ్చేసింది. అదిగో అప్పట్నుంచీ వాళ్లకీ మనకీ గొడవలొచ్చి పడ్డాయి" ముత్తు చెప్పాడు.

'అది చేపలకు కామధేనువు అనీ పూర్వం అక్కడ మనోళు ్ళ బోట్లు నిలిపేవారనీ, వలలు ఆరబెట్టుకునేవారనీ మా అయ్య చెప్పేవాడు. ఇప్పుడు చర్చి తిరునాళ్లప్పుడు తప్ప అక్కడ మనల్ని అడుగుపెట్టనివ్వడమే లేదు. దాన్ని వాళ్ళకి ఇవ్వడమే మనకు శాపమైంది. మళ్లీ దాన్ని వెనక్కి తెచ్చేస్తామని ఎన్నికల్లో ప్రతి పార్టీ వాగ్దానాలు చేస్తోంది గాని మాటలు తప్ప పని అవ్వటం లేదు" పెదవి విరిచాడు మైసయ్య.

"అవి మన జాలర్ల ఓట్లు దండుకోడానికి ఆడుతోన్న నాటకాలు. అది జరిగే పని కాదన్నా. మన కచ్చదీవిని శ్రీలంకకు ఇచ్చేసినందుకు మనకు అన్యాయం జరిగిందని మనం అను కుంటే, తమ బతుక్కి భరోసా చిక్కిందని అక్కడి జాలర్లు అనుకుంటున్నారు. ఈ ఘటనతో  చైనాను నిలువరించామని ఇందిరాగాంధీ అనుకుంటే, తన కీర్తి పెరిగిందని సిరిమావో బండారు నాయకే సంతోషించింది" అన్నాడు ముత్తు.

"ఒక్కొక్కరి దృష్టి ఒక్కో రకం. అయితే ముత్తూ, మనమూ జాఫ్నా జాలర్లూ ఇలా శత్రుత్వంతో కొట్టుకు చావాల్సిందేనా" శేషురాజు అడిగాడు.

"అబ్దుల్ కలాం సారు చక్కని ప్రతిపాదన చేశారు. అటు పాక్ జలసంధిలోనూ, ఇటు మన్నార్ గల్ఫ్‌లోనూ ఒకరోజు శ్రీలంక జాలర్లు, ఒకరోజు మన జాలర్లు చొప్పున వేటాడుకోవా లన్నారు. ఆ పెద్దాయన మాటలెవరు వింటారు! నాయకులకు రాజకీయాలు కావాలి గాని పరిష్కారాలు అక్కర్లేదు. అంచేతది వాళ్లకీ మనకీ అస్తిత్వ సంఘర్షణగానే వుండిపోయింది"

"మొన్న ఎవరో చెప్పిందాని ప్రకారం గత 30 ఏళ్లలో మనోళ్లు 500 మంది దాకా శ్రీలంక కాల్పుల్లో చనిపోయారంట. 3000 మంది వరకూ వికలాంగులయ్యారట. బోలెడు మంది అక్కడి  జైళ్లలో మగ్గుతున్నారట. ఆచూకీ తెలీకుండా పోయిన వాళ్లెందరుంటారో లెక్కా పత్రం లేవంట. ఇక వాళ్లు జప్తు చేసిన బోట్లు చాలానే వుంటాయి. నన్నడిగితే జాఫ్నా జాలర్లు ఎక్కేయడం వల్లే అక్కడి నావికాదళం రెచ్చిపోతోంది. వాళ్ల వల్లే మనకి ముప్పు వస్తోంది" ఉక్రోషపడ్డాడు మైసయ్య.

"అధికాదులేరా.  అక్కడ ఎల్టీటీఈ గొడవల కాడ్నుంచి ఆ ప్రభుత్వ దాష్టీకాలు పెరిగిపోయాయి. మనల్నీ శత్రువులుగా చూస్తోంది" వంతపాడాడు సెల్వరాజ్.

"అన్నీ నిజమే కాని మనం ఒకటి మరచిపోకూడదు. అటు శ్రీలంక లోనూ, ఇటు ఇక్కడా వున్నది తమిళ జాలర్లే. మనందరి సమస్యా ఒకటే. బతుకు తెరువు. అందుకే అది జీవన్మరణ సమస్య అయి కూర్చుంది" ముత్తు మాటలకు ఎవరూ నోరు విప్పలేకపోయారు.

మెల్లగా అంతా సాయం పట్టి వల లాగారు. క్యాచ్ తక్కువగా వుంది. పనికొచ్చే చేప యాభై కేజీలు కూడా వుండదు.

అందర్నీ నిరాశ ఆవరించింది  'ఖర్చు కూడా రాదేంటి ఖర్మ' అనుకున్నాడు సెల్వరాజ్.

"కొంచెం లోపలికెళ్దాం. క్యాచ్ బావుంటుంది. భయ పడకండి. సైమన్, లోపలికి పోనీరా…." సెల్వరాజ్ చెప్పాడు.

ఏ రకానికా రకం చేపల్ని వేరు చేసి గంపల్లో వేస్తున్న వారల్లా ఆ మాటలకు ఉలిక్కిపడి తలెత్తారు.

"జాగ్రత్తొరేయ్. లంక జలాల్లో కెళ్లద్దు" హెచ్చరించాడు ముత్తు.

"అబ్బెబ్బే. ఎందుకెళ్తాం. వెళ్లనే వెళ్ళం" సెల్వరాజ్ హామీ ఇచ్చాడు.

"ఉజ్జాయింపుగా అనుకోవాల్సిందే గాని ఇవి మన నీళ్లు, అవి లంక నీళ్లు అని ఈ మహాసముద్రంలో ఎలా తెలుసు కోగలం!" చప్పరించాడు సైమన్.

"జీపీఎస్ వుంటే ఇంటర్నేషనల్ మెరిటైమ్ బౌండరీ లైన్ స్పష్టంగా కన్పిస్తుంది. అవి ట్రాలర్స్ వారి దగ్గరే వున్నాయి" ముత్తు అన్నాడు.

"తెలిసి వెళ్లినా, తెలీక వెళ్లినా నేవీవోళ్లు వూరుకోరు. హెచ్చరించి వదిలెయ్యరు. ఈ పాట్లన్నీ పొట్టకూటి కోసమే గాని కోట్లు సంపాదించడానిక్కాదని అర్థం చేసుకోరు" శేషురాజు వేదనపడ్డాడు.

"నువ్వు ట్రాలర్ల వాళ్లని మర్చిపోతున్నావు. అసలు దోపిడి దొంగలు వాళ్లు. కోట్లు సంపాదించేది వాళ్లు. మధ్యలో రెండు దేశాల్లోని జాలర్లమూ తిండికి కటకటలాడుతున్నాం..!." ఉ ద్రేకపడ్డాడు ముత్తు.

"పాపం వాళ్లూ బతకాల్లే!" సానుభూతి చూపాడు మేసయ్య. మరబోటుని కొంచెం లోపలికి తీసుకెళ్లి ఆపాడు సైమన్. మళ్లీ వల విసిరారు.

"చేపల కదలిక ఎక్కువగా వుంది. కొంపదీసి కచ్చ దీవుల

దగ్గరికెళ్లి పోలేదుగా" కంగారుగా అరిచాడు శేషురాజు.

"అహహ. అయ్యుండదురా. ఎక్కడా నేవీ వాళ్ల జాడలేదు చూడు" భరోసా ఇచ్చాడు సెల్వరాజ్.

ముత్తు పరిశీలనగా చూశాడు. భారత్ శ్రీలంకల మధ్య సముద్ర విభజనరేఖ దాటినట్టుగా అన్పించలేదు. అలాగని ధైర్యంగా వుండలేకపోయాడు.



"త్వరగా తెములుద్దాం..."

అదుర్తోన్న గుండెల్తో ఉగ్గబట్టి కూర్చున్నారు. కాస్సేపయ్యాక మెల్లగా వల లాగారు. బరువుగా వుంది.

"క్యాచ్ బాగుందన్నా" అరిచాడు మైసయ్య.

అందరి ముఖాలూ వికసించాయి.

వల లోంచి చేపల్ని బోటులో గుమ్మరించారు. కళ్లతోనే లెక్క లేశారు. 'ఫరవాలేదు. కష్టం ఫలించినట్లే, ఖర్చులు పోను ఒక్కొక్కరికీ ఏడెనిమిదొందలస్తాయి' సంబరపడ్డారు.

ఇంతలో శ్రీలంక నావికాదళం బోట్ల శబ్దం విన్పించింది.

అమాంతం అందరి గుండెలూ జారిపోయాయి.

"సైమన్! త్వరగా వెనక్కి తిప్పేయ్!" మూకుమ్మడిగా అరిచారంతా.

"స్పీడుగా పోనియ్యరా" కంగారుగా చెప్పాడు సెల్వరాజ్.

"వాళ్లకి చచ్చినా దొరక్కూడదు. దొరికితే మన పని ఖతం. హెరాయిన్ స్మగ్లింగ్ చేస్తున్నామని చెప్పి జైల్లో పడేస్తే. ఉరి శిక్షే గతి!" ఏడ్చేశాడు శేషురాజు.

"భయపడకు. ఆ నేరస్తుల్ని ఖైదీల మార్పిడిలో చేర్చరు గాని, ఉరి తీయరు. అది బుద్ధుడి భూమి అని చెప్పి అక్కడ ఉరిశిక్షలు అమలు చెయ్యట్లేదులే" భరోసా ఇచ్చాడు ముత్తు.

బోటు వేగంగా వెనక్కి మళ్లి దూసుకుపోతున్నా శ్రీలంక నావికాదళం వేటాడ్డం మానలేదు. రాళ్లు, ఖాళీ మందు బాటిల్సూ విసిరారు. సైమన్ బోటుని జిగ్‌జాగ్‌గా నడుపుతూ లంక సైనికులకు అందకుండా తీసుకుపోయాడు. దొరికే అవకాశం లేదని గ్రహించగానే వాళ్ళు ఆగ్రహంతో కాల్పులు జరిపారు.

ఒక గుండు సెల్వరాజ్ జబ్బలోంచి దూసుకుపోయింది. రక్తం కాల్వలు కట్టింది. మేసయ్య, శేషురాజు బెంబేలెత్తిపోయారు. ముత్తు గుడ్డ తీసుకుని కట్టు కడుతూ, "వాళ్లకింక దొరకంలే. ధైర్యంగా నడుపు" అన్నాడు సైమన్‌తో.

వాళ్లు వెన్నాడటం లేదని నిర్ధారణ చేసుకున్నాక గాని జాలర్ల గుండెలు కుదుటపడలేక పోయాయి. "హమ్మయ్య. గండం గడిచింది" అన్నాడు తేలిగ్గా నిట్టూరుస్తూ మైసయ్య.

"వాళ్ల జలాల్లోకి వెళ్లేమంటావా ముత్తూ" భయంగా అడిగాడు శేషురాజు.

"చెప్పలేం. ఎవరూ చెప్పలేరు. సాక్షుల్లేరుగా. వెళ్లలేదని మనం అంటాం. వచ్చేరని వాళ్లంటారు!'' చిన్నగా నవ్వాడతడు.

"దిన దిన గండంలానే వుంది మన బతుకు!" గొణుక్కున్నాడు శేషురాజు.

"జీవన పోరాటం!"

ముత్తు వంక అయోమయంగా చూశారు మిగతా నలుగురూ.

తెల తెలవారుతోంటే ఒడ్డుకు చేరారు.

"నువ్వు తిన్నగా ఆసుపత్రికి పో అన్నా. చేపల్ని మేం ఒబ్బిడి చేస్తాంలే" సెల్వరాజ్‌తో అన్నారు ముత్తు తదితరులు.

వార్త తెలిసి గూడెం గుండె చెదిరింది. 'మొన్న అలా. ఇవాళ ఇలా! మరి రేపు?'

తల్లడిల్లిపోతూ పరుగు పరుగున వచ్చారంతా.

సెల్వరాజ్‌ని సుడిగాలిలా చుట్టేసి బావురుమంది అణ్ణమ్మ.

''వూరుకోవే పిచ్చిదానా. నాకేం కాలేదే'' ఎవరెంత అనునయించినా ఆమె దు:ఖం కించిత్తూ తగ్గలేదు.

"తుపాకి గుండు జబ్బకి తగిలిందని సంతోషించవే. కొంచెం పక్కకెళ్లి వుంటే?"

ఆ దృశ్యం వూహించుకోడానికే భయమేసి ఘల్లుమంది. అంతా కంపిస్తూనే భయంభయంగా చూశారు.

ఆమె తల నిమురుతూ అన్నాడు సెల్వరాజ్ : "తప్పదే. ఆకలితో, సునామీలతో, బాటమ్ ట్రాలర్లతో, జాఫ్నా జాలర్లతో, శ్రీలంక నావికాదళంతో పోరాడుతూనే వుండాలి. బతకాలంటే తప్పదు!" ■

# ఖరీదైన ఆశ

**ఒ**కప్పుడు ఆమె
ఒక చెట్టులా ఉండి వుంటుంది
నదుల్లాంటి ఆకులతో
పసిపాపల కళ్ళలాంటి పూలతో
వచ్చీ పోయే అతిధి పిట్టలతో
సందడి సందడిగా ఉండుంటుంది

అందరి లాగానే ఆమెక్కూడా
పసుప్పచ్చ కొమ్మలతో ఫ్లోరింగు
అల్లరి పూలతీగలతో పైకప్పూ
ఆకాశాన్ని తెంపి చేతిలో పెట్టే ఓ కిటికీ
సాయంత్రం శిల్పంలా ఒదిగి నిల్చోవడానికి
ఓ గుమ్మమూ ఉండే ఇల్లు వుండే వుంటుంది

చిన్న డబ్బాలోంచి రోజుకో సూరీడిని తీసి
కనుబమ్మల మధ్య సింగారించుకుని
ఆమె తిరుగాడుతుంటే ఆ ఇంట్లో గోడలన్నీ
పొద్దు తిరుగుడు పువ్వులయ్యే వుంటాయి

■■■

ఏ సడీ చప్పుడూ లేకుండా
ఏ హెచ్చరిక జెండానూ ఎగరేయకుండా
విరుచుకుపడ్డ తుపానొకటి
నేలకంటా ఆమెను కూల్చేసింది

తుపాను తర్వాత
కొన్ని రోజుల వరకూ తగ్గని వరద నీరు
ఆమెకు మిగిలిన ఒక్కగానొక్క తీరాన్నీ కోసేసింది

ఆ యేడూ ఆ తర్వాత యేడూ
అటు మీదట .. వరసగా వీచిన గ్రీష్మాలు
వేళ్ళలోని పచ్చదనాన్నీ ఇగిర్చాయి
ఇప్పుడు ఆమె ఒక నీడలు కాయని చెట్టు
జీవం లేని గోడల మధ్య
వేళ్ళ కింత చెమ్మైనా దొరక్కపోతుందా అని
ఎదురుచూసే గాజు దీపం

తలుపులు మూసుకున్న
ఏ ముంజూరు కనబడితే అక్కడ



కాసేపు దేహాన్ని ఆరబెట్టుకునే ఒంటరి పిట్ట

గుమ్మంలోంచి ఎత్తి ఎన్ని సార్లు పారబోస్తున్నా
మళ్ళీ మళ్ళీ ఇంట్లోకి పాక్కుంటూ వచ్చే
రెక్కలు జారిన ఉసులు

రద్దీ రోడ్డు ఒడ్డునున్న నాగరిక నిశ్శబ్దవాగులో
ఎంత చలీ వానా కురుస్తున్నా
జీవితాన్ని చాపలా చుట్టుకుని
మునగదీసుకు పడుకున్న రోకలిబండ

ఎపుడన్నా మీ హడావిడి పేజీల మధ్య
ఒకింత తీరిక వెతుక్కుని
ఆమె కళ్ళలోకి చూస్తే
ఏ సొంతింటి కలా కనబడదు
తన జ్ఞాపకాలను తడపని
చూరొకటి దొరికితే చాలన్న
తీరని ఆశ కనబడుతుంది

ఎవరి జీవితాన్ని వాళ్ళు
రెక్కల మీద కట్టుకుని ఎగిరే
వలస పిట్టల దేశంలో
ఆమెది ఖరీదైన ఆశే కదూ!

**- సాంబమూర్తి లండ**
**96427 32008**






# అట్టడుగు వెతలపై ఆలోచన పెంచే కథలు

- వేపకాయల ప్రసాద్

94907 12967

**"సాధ్యమైనంత వరకు వాళ్లని అజ్ఞానంలో ఉంచి, వాళ్లలో మనం దుర్గుణాల్ని పెంచాలి. ధనదాహం పెంచాలి. ఏదో విధంగా వాళ్ళకి వాళ్ళల్లో కొందరి చేత ద్రోహం చేయించాలి."**

(గోవులొస్తున్నాయి జాగ్రత్త)

తాము నష్టపోతున్నదేమిటో గుర్తించలేని వారిగా, తమలో తామే కలహించుకుని ఎప్పటికీ ఒకమాట మీదికి రాలేని వారుగా, ఎవరో విసిరేసే ఎంగిలి మెతుకులకి ఆశపడి, తమ సొంత వారినే నాశనం చేసుకునే మూర్ఖులుగా మనుషుల్ని తయారుచేసే కుట్ర ఈ మాటల్లో దాగివుంది. మనుషుల్ని కులాలుగా, మతాలుగా, వర్గాలుగా, ప్రాంతాలుగా విడగొట్టి పబ్బం గడుపుకుందామనుకునే వారు ఈనాటికీ అవలంబిస్తున్న ఈ భయంకర విభజన విధానాన్ని 'కిరీటి రావు' అనే విధ్వంసక స్వభావమున్న పాత్ర తన వర్గ శత్రువులపై ప్రయోగిస్తుంది.

మనుషుల్లో ఉన్న ఈ దుష్ట స్వభావాన్ని కళ్లకు కట్టినట్లు చూపించిన మహానుభావుడు రాచకొండ విశ్వనాథ శాస్త్రి. 50 ఏళ్ల కిందట ఒక దుష్ట పాత్ర చేత వారు అనిపించిన ఈ మాటలు ఆచరణ రూపంలో సంఘంలో ఏదో చోట ఈనాటికీ కనబడుతూనే ఉన్నాయి.

స్వార్థపరులైన సంపన్నులు Capitalistలుగా మారి లాభాలకోసం ఎంతటి దుర్మార్గాన్నయినా అవలంబిస్తున్నారు. అడ్డదారిలో కూడబెట్టిన సంపదను కాపాడుకోవడానికి రాజకీయావతారం ఎత్తుతున్నారు. లేదా తెర మరుగున ఉంటూ రాజకీయాలను, ప్రభుత్వాలనూ శాసిస్తున్నారు. అధికారం ఉందన్న ధీమాతోనో, తమ సంపదే తమను కాపాడుతుందన్న నమ్మకంతోనో హత్యలకు, అత్యాచారాలకు, అక్రమాలకు తెగబడుతున్నారు. మనం రూపొందించుకున్న వ్యవస్థల్లోని బలహీనతలు ఇలాంటి వారికి బలమవుతున్నాయి.

తమ సంపదలకు, వ్యాపారాలకు భవిష్యత్తులో కూడా ఏ ఇబ్బందీ లేకుండా ఉండేందుకు ఏదో ఒకదారిలో చట్టసభల్లో దూరాలనుకునే వారిని, అటువంటి వారి అడుగులకు మడుగు లొత్తుతూ అందలమెక్కించడానికి తమవంతు సాయమందించి తరించే వ్యవస్థల, వ్యక్తుల దుర్నీతిని చూస్తూనే ఉన్నా, ఏమీ చేయలేని స్థితిలో ఉన్నాం. ఈ వ్యవస్థలు ఇపుడే ఇలా ఉన్నాయా? గతంలో కూడా ఇంతేనా? అంటే.. గడిచిన 60 ఏళ్లుగా పరిస్థితి ఏమీ మారలేదు అని రా.వి.శాస్త్రి గారి 'ఆరు సారా కథలు' నిరూపిస్తాయి.

బలహీనుల పట్ల బలంగా నిలబడాల్సిన పోలీసు వ్యవస్థ, న్యాయ వ్యవస్థ తమ బాధ్యతను విస్మరించటమే కాక లంచగొండులై దుష్టులను, నేరస్తులను కాపాడుతున్న దుస్థితిని దగ్గరగా చూశారు రా.వి.శాస్త్రి. ఆయా ప్రధాన వ్యవస్థలు అలా తయారవడానికి కారణమైన నాయకుల, సంపన్నుల స్వార్థాన్ని గమనించారు. తన చుట్టూ ఉన్న సమాజం నుంచి, తన వృత్తి జీవితంలో నిత్యం తారసపడే వ్యక్తులు, సంఘటనల నుంచి స్వీకరించిన ఆయా వాస్తవాలను కథలుగా మలచిన మేటి కథకుడు రా.వి. శాస్త్రి. వామపక్ష సిద్ధాంతాలను త్రికరణశుద్ధిగా జీవితంలో పాటించి, తన రచనల ద్వారా సంఘంలో ఆశించిన విలువలకు తానే నిలువెత్తు నిదర్శనమైన వామపక్ష వాది రా.వి.శాస్త్రి. తాను విశ్వసించిన, ఆచరించిన కమ్యూనిస్టు సిద్ధాంత సారాన్ని జీవితంలో ప్రతిబింబింపజేసే సన్నివేశాలను తీసుకుని, నిజజీవితాలనే ఆయన తన రచనల్లో చిత్రించారు.

చాగంటి సోమయాజులు, కాళీపట్నం రామారావు, రాచకొండ విశ్వనాథ శాస్త్రి.. అనే ముగ్గురు సాహితీమూర్తులను ఉత్తరాంధ్ర కథాత్రయంగా చెబుతారు. రా.వి.శాస్త్రి గారి రచనల్లో ఉత్తరాంధ్ర మాండలికం, ప్రధానంగా ఆయన జీవించిన

విశాఖపట్నం, శ్రీకాకుళం సాధారణ ప్రజల మాండలిక భాష, వారి యాస, శ్రమజీవుల గుండె గోస వినిపిస్తుంది. తన రచనల్లో చెబుతున్నది ఒక ప్రాంతపు మాండలికమే అయినా దాన్ని కూడా కవితాత్మకంగా, నిండుగా చెప్పటం, సీరియస్‌గా చెబుతున్న చోట సందర్భవశాత్తూ వర్ణన చేయవలసి వచ్చినపుడు పాఠకుడికి విసుగు కలగకుండా చెప్పటం రా.వి.శాస్త్రి ప్రత్యేకతలు. గురజాడ, శ్రీపాద తరువాత ఒక పరిమిత ప్రాంతపు ప్రజల వాడుకలో ఉండే మాండలిక శైలిని ఆయనంత చక్కగా వాడినవారు మరొకరు లేరని అంటారు. అలా అని రా.వి.శాస్త్రి సాహిత్యం కేవలం ఉత్తరాంధ్రకి పరిమితమైనది కాదు. అది బాధాసర్పదష్టులైన పీడిత వర్గాలందరికీ సంబంధించినది. పాత్రల స్వరూప స్వభావాలను చిత్రించటానికి నవలల్లో ఉన్నంత సావకాశం కథల్లో లేకపోయినప్పటికీ ఉన్న కొద్ది పరిధిలోనే ఆయా దృశ్యాలను, పాత్రలను ఆయన చిత్రించిన తీరు ప్రతి కథలోనూ పాఠకుణ్ణి అబ్బురపరుస్తుంది.

సాహిత్య లోకంలో 'రావి శాస్త్రి'గా సుపరిచితుడైన రాచకొండ విశ్వనాథశాస్త్రి వృత్తిరీత్యా న్యాయవాది. ప్రవృత్తిలో కూడా న్యాయాన్నే ఇముడ్చుకున్న హృదయవాది. 1938లో 'దేవుడే చేశాడు' అనే పేరుతో రాసిన కథతో తెలుగు సాహిత్య లోకంలో అడుగు పెట్టారు. తనపైన పానుగంటి లక్ష్మీ నరసింహారావు, చార్లెస్ డికెన్స్, చెహోవ్, జేమ్స్ జాయిస్, శ్రీశ్రీల ప్రభావం ఉందని చెప్పుకున్నారు. డికెన్స్, రా.వి.శాస్త్రిలలో చాలా విషయాల్లో పోలికలున్నాయంటారు పరిశోధకులు. పేదలపట్ల ఆర్ద్రత, వ్యవస్థ మీద కసి, సమాజం మారాలని కోరుకోవడం వీళ్లిద్దరిలోనూ కనిపిస్తుంది. తమ జీవిత కాలంలో విస్తృత ప్రజాదరణ పొందే సాహితీమూర్తులు కొద్దిమందే ఉంటారు. అలాంటి వారిలో రా.వి.శాస్త్రి ఒకరు.

రా.వి.శాస్త్రి గారి ఆరు సారాకథలకి రాసిన ముందుమాటలో 'రచయితలు 2 రకాలు. మహానుభావులు, మామూలు వాళ్లు. మామూలు విషయాలను వస్తువులుగా స్వీకరిస్తూ, మామూలు మాటల్లోనే తాము చెప్పాలనుకున్న దానిని చెప్పేసి, నాలాంటి మామూలు మనుషులను కూడా ఆకర్షించే మామూలు వాళ్లలో అగ్రశ్రేణి రచయిత రా.వి.శాస్త్రి. ఏకకాలంలో అనేక రసాలను ఉప్పొంగింపజేసే కళాఖండాలు మాత్రమే ఉత్కృష్ట రచనలు. అటువంటి రసానుభూతినే నేను 'రసన' అంటాను. రా.వి.శాస్త్రి రచనలు 'రసన'ను సమృద్ధిగా ఆవిష్కరించగలుగుతున్నాయి' అని మహాకవి శ్రీశ్రీ రా.వి.శాస్త్రిని ప్రశంసించారు.

ప్రజల్ని పీడిస్తూ, అదే ప్రజల పక్షాన పోరాడే వారికి అవార్డులిచ్చే ప్రభుత్వ విధానాలకు నిరసనగా రావి శాస్త్రి 'అవార్డులకి దూరంగాను', ప్రజలకి చాలా దగ్గరగాను, సాధారణ వ్యక్తిగానే బతికారు. పీడితుల తరఫున నిలబడి నందుకు నెలల తరబడి జైలుపాలైనా సాహిత్యంలోనూ, సంఘ జీవనంలోనూ పీడితుల తరఫున వకాల్తా పుచ్చుకోవటం మాత్రం మానలేదు.

1960ల ప్రారంభంలో మద్రాసు ప్రొహిబిషన్ ఆక్టు ప్రకారం ఆంధ్రదేశంలో మద్యపానాన్ని నిషేధించారు. ప్రభుత్వం నిషేధించిందనేటప్పటికీ, సారా దొంగసారా రూపంలో మరింత ఎక్కువగా పారడం మొదలుపెట్టింది. మోటార్‌సైకిలు, రిక్షా చక్రాల ట్యూబుల్లో, ఆడవారి చీరల మాటున సారా ఏరులై ప్రవహించింది. నిషేధాన్ని అమలు చేయాల్సిన వ్యవస్థలన్నిటికీ చేతులూ మూతులూ తడిపి మరీ ఈ దొంగసారా రవాణా జరిగింది. తయారు చేసిన చోటినుంచి చేరాల్సిన ప్రదేశాలకి చేర్చటానికి ఒక ప్రత్యేకమైన వ్యవస్థే ఏర్పడింది. దీనికి నల్లమందు జత కలిసింది. చిన్నాపెద్దా, ఆడామగా అన్న తేడా లేకుండా దొంగ సారాయిని తరలించడానికి చాలామంది తోడ్పడ్డారు.

దొంగసారాని నిర్మూలించాల్సిన పోలీసు యంత్రాంగంలో ఉన్న అవినీతి మద్యపాన నిషేధ చట్టం విఫలం కావడానికి ప్రధాన కారణం అయింది. ('మోసం' కథలో ఈ ప్రస్తావన ఉంటుంది.) ఈ దొంగసారాను తరలించటం కోసం సారా వ్యాపారులు ఏర్పాటు చేసిన కూలీల వ్యవస్థలో దిక్కూమొక్కూ లేని పేదలదే ముఖ్యమైన పాత్ర. పోలీసుల జాడను పసిగట్టి హెచ్చరించగలిగే ఇన్‌ఫార్మర్లుగా, పట్టుబడితే కుటుంబం భవిష్యత్తును అథోగతికి నెట్టివేసుకుని, యజమానికి బదులుగా జైలుకి పోవటానికి సిద్ధపడే నిందితులుగా, తాము నాశనమై పోతూ కూడా తమ యజమానుల సారా వ్యాపారానికి వారు సహకరించారు. ఒకవేళ పోలీసులకి పట్టుబడితే కోర్టు విధించే పెనాల్టీ తామే కడతామని, నెల నెలా కూలీల కుటుంబాలకు గ్రాసంగా 50 రూపాయలిస్తామని చెప్పి ఆ తర్వాత మోసం చేసిన కాంట్రాక్టర్లెందరో! యజమానుల చేతుల్లో మోసపోయి జరిమానా కట్టలేక శిక్ష అనుభవించినవారు, మామూళ్లు ఇవ్వలేదన్న కోపంతో పోలీసులు పెట్టిన అక్రమ కేసులకు బలైన వాళ్లు.. ఇలా రావి శాస్త్రి గారి సహాయం కోరి వచ్చే ఎందరో అభాగ్యుల కన్నీళ్లు ఈ ఆరు సారా కథలు. న్యాయవాదిగా సొంతంగా ప్రాక్టీసు ప్రారంభించిన కొత్తల్లోనే రావి శాస్త్రికి మానవ జీవితంలోని పార్శ్వాలెన్నిటినో ప్రత్యక్షంగా చూడడానికి అవకాశం కలిగింది. లోకాన్ని పరిశీలించేకొద్దీ ఒక రచయితగా తన లక్ష్యమెలా ఉండాలో, తానెవరివైపు నిలబడాలో తెలిసి వచ్చింది. ఆ స్థితిలో వారినుంచి వచ్చిన రచనలు పేదల జీవిత కష్టాలను మరింత స్పష్టంగా ప్రతిబింబించాయి.

కోర్టు గుమ్మం తొక్కేవారిలో, అన్యాయాలకు బలవుతున్న వారిలో, ఆయా నేరాలతో సంబంధం లేని దుర్బలులే ఎక్కువని; నిజమైన నేరస్థులు తమ సంపదతో, అధికారంతో, హోదాతో, పలుకుబడితో తప్పించుకు తిరుగుతూ పెద్దమనుషులుగా చలామణి అవుతూ ఉన్నారని; తమ దుర్మార్గాలకు అడ్డురాకుండా ఉండేందుకు నాయకులకు డబ్బు మేపుతున్నారని అచిరకాలం లోనే ఆయనకి అర్థమైంది. ఇలాంటి పరిస్థితులున్న సంఘంలో పేదవాడికి న్యాయం జరగదని, అన్యాయాన్ని ఎదుర్కొనే శక్తి పేదవాడికి లేదని, రాదని అర్థమయ్యాక ఆయన రచన తీరులో, వస్తువులో మరింత మార్పు వచ్చింది. వెలుగులు చిమ్మే పట్టణా లకు మరో పార్శ్వమైన అథోజగత్తులోని నిర్భాగ్యుల అట్టడుగు జీవితాల విషాదాన్ని, వారి పేదరికాన్ని పట్టి చూపించాయి ఈ సారా కథలు. బాధితులను రక్షించాల్సిన పోలీసు వ్యవస్థలోని అవినీతికి, పెద్దల దాష్టీకానికి బలైపోయిన పేదలు, అసహాయు లు ఈ కథల్లో తారసపడి, మనచేత కన్నీరు పెట్టిస్తారు.

ఆరు సారా కథలు – వరుసగా 'పాపి, మాయ, న్యాయం, మోసం, పుణ్యం, మోక్షం' అనేవి. 'పాపి' కథలో వచ్చే 'శకునిని, గోబెల్స్‌ని తలపించే బుద్ధులున్న కార్యదర్శి' లాంటివారు.. రెండు చిటికెలు వేసి చూపించి 'గతంలో అలా ఇడిపించు కొచ్చినాం. ఈ కోర్టులో నెగ్గకపోతే.. ఇగో ఒంద రూపాయల నోటు.. హాయిదరాబాద్ కోర్టులో రిచ్చాలు ఇడిపించు' అనే రామదాసు లాంటి వారు ఈ రోజుల్లో తరచూ ఏదో ఒకచోట తారసపడుతూనే ఉంటారు. నేరంతో ఏ సంబంధమూ లేకపోయినా నిందితులుగా కోర్టులకు తిరిగి, జీవితాలను కోల్పోయిన అభాగ్యులను, అమాయకులను కాల్చుకుతినే న్యాయవాద వ్యవస్థ పట్ల రావి శాస్త్రికి ఉన్న తిరస్కార ధోరణిని, వ్యవస్థలోని కుళ్లు పట్ల వారి హృదయంలో ఉన్న అసహ్య భావాన్ని 'మాయ' కథలో చూడొచ్చు. ఈ కథలో ముఖ్యపాత్రలు పెద్ద ప్లీడరు, లాయర్ మూర్తి, ముత్తేలమ్మ. కోర్టులు, పోలీసు స్టేషన్లపట్ల ప్రజల్లో నిగూఢంగా, బలవంతంగా అణిగిపోయి ఉన్న వ్యతిరేకతను చూపించిన కథల్లో 'మాయ' ఒకటి.

బ్రిటిష్‌వాడు తన రాజ్యాధికారం కోసం, తన వ్యాపారాన్ని స్థిరపరచుకునేందుకు ఏర్పాటుచేసిన శిక్షాస్మృతి, న్యాయ వ్యవస్థ, స్వాతంత్ర్యం తర్వాత కూడా మనల్ని పీడిస్తూ ఉండడాన్ని గురించి 'మాయ' కథలో పెద్ద ప్లీడరు చిన్న ప్లీడరు మూర్తితో కుండబద్దలు కొట్టినట్లు చెప్పిన మాటలు ఆశ్చర్యాన్ని కలి గిస్తాయి. ఆకుల్ని ప్రజలకి విసిరేసి ఆపిల్ పళ్లను దిగమింగేసే పెద్దల మాయలను, వారి మాటల మాటున ఉన్న అసలు ఉ ద్దేశాలను ఈ పెద్ద ప్లీడరు మాటలు ఆవిష్కరిస్తాయి.

"కోర్టంటే పెద్ద అడవి. అడవిలోకి వచ్చిన వారిది పొరపాటు గాని మనది కాదు కదా. మనకి సాక్ష్యంతోనే కాని సత్యంతో సంబంధం లేదు. కోర్టులో ఉన్నప్పుడు న్యాయం, ధర్మం, సత్యం అని మాటలు పేలించాలి. కానీ అంతా మాయే" అని తెలుసుకో మంటాడు. "కూలోళ్లు ఎదురు తిరిగితే వాళ్లకోసం కోర్టులు, జెయిళ్లు కట్టించాడు బ్రిటీషోడు. తనకి మాత్రం మంచి మంచి బంగాళాలు కట్టించుకున్నాడు. అసలీ కోర్టులు, జెయిళ్లు లేకపోతే ఇంగ్లిష్ వాడి రాజ్యమే లేదు"

"మన ఉప్పు మనకే అమ్మి– నా ఉప్పు తిన్నావు, విశ్వాసంగా ఉండవా?" అనగలిగిన మాయగాడు ఇంగ్లిష్‌వాడు."

"రేపెపుడైనా ఆ కూలివాడు ఎదురుతిరిగితే అసలుకే మోసం వస్తుందని సాటి షావుకార్లకి రాజ్యం అప్పజెప్పి, చల్లగా తెర వెనక్కి జారుకున్నాడు. లాభం ఇంగ్లిష్ వాడిది. రొష్టు మన వెధవల్ది" అంటాడు పెద్ద ప్లీడరు.

ఈ మాటల్ని కాస్త జాగ్రత్తగా పరిశీలిస్తే.. ఇప్పటికీ వ్యవస్థలో జరుగుతున్న తంతు ఇదే కదా అనిపిస్తుంది. మాయ కథలో పెద్ద ప్లీడరు అన్నట్టు మన శిక్షాస్మృతి విధానమంతా బ్రిటిష్‌వాడు మనకి అంటించిపోయిందే. మనం పైపైన ఏవో కొన్ని మార్పులు చేసాం. అంతే!

నెలనెలా ఇవ్వాల్సిన పోలీస్ మామూలు ముట్టలేదన్న కోపంతో హెడ్‌కానిస్టేబుల్ పెట్టించిన తప్పుడు కేసులో అరెస్టయి, జామీను కోసం లాయర్ మూర్తి దగ్గరికి వస్తుంది ముత్తేలమ్మ.

"మానవ సమాజం ఇంత అభివృద్ధి చెందటానికి కారణం మనిషిలో ఉండే ప్రశ్నించే తత్త్వం. కానీ, స్వార్థపరులైన దుర్మార్గ రాజకీయ నాయకుల వల్ల ఇపుడు ఆ ప్రశ్నే ప్రమాదంలో పడింది. దేనినైనా ప్రశ్నిస్తే అది ద్రోహం. అంగీకరించి నోర్మూసుకుని పోతే భక్తిగా పరిణమించిన చిత్రాన్ని ఈ మధ్య ఎక్కువగా చూస్తూ ఉన్నాం. రోజూ తన ఇంటికి వచ్చి తనను ఇబ్బంది పెడుతున్న హెడ్డును ప్రశ్నించి, తప్పుడు కేసులో ఇరుక్కున్నది ముత్తేలమ్మ.

ఈ పాత్రచేత రావి శాస్త్రి చెప్పించిన మాటలు చూడండి.. : "పీడరు బాబూ.. సెప్తున్నాను ఇను! నువ్వేకాదు, ఈ బాబేకాదు, ఏ మనిసి మంచోడని ఒవురు సెప్పినా నాను నమ్మను. ఈ నోకంల డబ్బూ యాపారం తప్ప మరేటీ్నేదు. పశువులూ, నోర్లేని సొమ్ములు. ఆటికి నీతుంది కానీ మనకి నేదు. సదువులేందాన్ని నాకూ నేదు.. సదువుకున్నాడివి నీకూ నేదు. డబ్బుకోసం నోకం. నోకమంతా పడుచుకుంటోంది. డబ్బుకు నాను సారా అమ్ము తున్నాను, డబ్బుకి సదువుకున్న సదువంతా నువ్వమ్ముతున్నావు. డబ్బుకి పోలిసోళ్లు నాయ్యేన్నమ్ముతున్నారు. వోట్లస్తే.. పీడరు బాబూ వోట్లస్తే నువ్వూ, నానూ, ఈ బాబూ, అందరం అమ్ముడయిపోతున్నాం. అమ్మకం! అమ్మకం! అమ్మకం! అమ్మకం తప్ప మరేటీ్నేదీ లోకంలో."

సమాజంలో డబ్బుది ఎంత ముఖ్యపాత్రో ముత్తేలమ్మ మాటల్లో రావి శాస్త్రి సూటిగా చెప్పారు. బడిలో చదువు, గుడిలో దైవం, పోలీసు స్టేషన్‌లో చట్టం, ఎలక్షన్‌లో ఓటు– ఇలా ప్రతిదీ ఎలా అమ్ముడైపోతున్నాయో ఆమె నోట పలికించారు. చివరికి ఈ కథలో హెడ్ కానిస్టేబుల్ ముత్తేలమ్మ ఇచ్చిన లంచం డబ్బులకి అమ్ముడైపోతాడు.

శిశుపాలుడి పరిపాలనను తన్ని పరిపాలించిన బ్రిటిష్‌వాడి పాలనలోనే అంతా 'హేపీగా' ఉందని, మనకి పాలకుడుగా ఓ 'డిక్టేటర్' ఉండాలని విసుక్కునే హెడ్డు కానిస్టేబుల్ పాత్ర ద్వారా బలహీనులపై బలవంతంగా బ్రిటిష్ శిక్షాస్మృతిని అమలుపరుస్తూ పెద్దల కొమ్ముకాసే అధికార వ్యవస్థ తీరుకు అద్దంపట్టారు ఇదే 'న్యాయం' కథలో.

సారా అమ్ముకుని ఊరికి మొగుళ్ళవుతున్న షావుకార్ల నుంచి మామూళ్లు దండుకుని ధనికులకి గులాములుగా, కూలీల పాలిట యములాళ్లుగా అవుతున్నారని పోలీసుల్ని.. సారా నుంచి వదుక్కుంటున్న ఫీజులతో దుక్కబలుస్తున్నారని ప్లీడర్లని, తినమరిగి పోతరిస్తున్నారని గుమాస్తాలని పదునైన మాటలతో సూటిగా విమర్శించినప్పటికీ, పోలీసుల విధి నిర్వహణలో దాగివున్న బాధను, వారి నిస్సహాయ స్థితిని దృష్టిలో ఉంచుకొని సహానుభూతి కనబరిచారు శాస్త్రి. సంఘరక్షణ కోసం పని చేయాల్సిన పోలీసులపై రోజువారీ విధులే కాకుండా రాజకీయ నాయకుల బందోబస్తులు, ఇతర బాధ్యతల భారం మోపటం వల్ల కుటుంబ జీవితాన్ని, ఆరోగ్యాన్ని కోల్పోతున్న వాస్తవాన్ని పోలీసుల దుస్థితిని మోసం కథలో చెప్పారు. ఈ కథలో గురవయ్యకి జపాన్ అలియాస్ రాకెట్ అప్పారావుకి మధ్య జరిగిన సంభాషణ ఎప్పటికీ కాలదోషం పట్టని వాస్తవాల సమాహారం అనిపిస్తుంది.

"నువ్వేకాదు.. నోకంల యెవరు ఈ రోజుల్లో బావుపడాలన్నా డబ్బుండాల, మాయుండాల, దబాయింపు సెక్సనుండాల. బోధపడిందా? డబ్బులో దేవుడున్నాడు. లచ్చితల్లికి జాతిభేదం నేదు. ఆ యమ్మ అన్నేయంల వుంది గాని నాయెంల లేదు."

"గవర్నమెంటంటే ఓట్లు, నోట్లు, పోలీసోడు; గవర్నమెంటంటే పల్లెటూళ్ళంట మున్సీబు కర్నాలు; పైకెల్తే తాసీల్దారు, కలెక్రు, ఇంకా పైకెల్లి గవర్నమెంటేటని జూస్తే ఎమ్మెల్యే నెంబరు, ఆడి పైని మినిస్ట్రు !" "ఈళ్ళందరూ గవర్నమెంటు. అంచేత ఆళ్ళ అడ్డు మనకి నేకుండ ఉండాలంటే ఆళ్ళని మనమే డబ్బెట్టి నిలబెట్టాల. లేకపోతే ఆళ్ళని కొనాల! అంటే డబ్బున్న పెద్ద పెద్ద మాయగోళ్ళే అసలు గవర్నమెంటు. ఆళ్ళు ఈళ్ళందర్నీ కొనుక్కుని నిలబెట్టుకున్నారు. అందుకేరా గురూ డబ్బుండాల, మాయుండాల, దబాయింపు సెక్సనుండాల".. ఇవి అప్పారావు ద్వారా రావిశాస్త్రి పలికించిన మాటలు. అరాచక శక్తులకు, స్వార్థ రాజకీయ నాయకులకు కూడా ఆదర్శప్రాయంగా నిలిచే పాత్ర ఈ అప్పారావు. లాభనష్టాలే కాని పాపపుణ్యాలు లేని ఈ లోకంలో, దేవుడికి పెట్టే దణ్ణంలోనూ, కొట్టే కొబ్బరికాయలోనూ లాభాన్నే చూసుకునే స్వార్థ ప్రవృత్తి ఉందని 'పుణ్యం' కథలో చెప్పారు.

పోలీసు వ్యవస్థ వైఫల్యం వల్ల, రాజ్యంలోని అవకతవకల వల్ల ఒక్క ఏడాదిలో 6 వేల సారా కేసుల్లో కోర్టుకు తేబడిన నిరపరాధులకు జరిమానాలు, జైలుశిక్ష వేసి తాను పాపం మూట కట్టుకున్నానన్న అపరాధ భావనలో తన వృత్తికీ, అంతరంగ ప్రవృత్తికీ మధ్య ఏర్పడిన సంఘర్షణలో ఏది న్యాయమో తేల్చుకోలేని స్థితిలోకి నెట్టివేయబడిన జడ్జి పిచ్చివాడిగా మారిపోయిన వైనాన్ని మేజిస్ట్రేటు రావు పాత్ర ద్వారా చూపారు శాస్త్రి గారు ఆరవది, చివరిది అయిన 'మోక్షం' కథలో.


'ముందుమాట'లో శ్రీశ్రీ ఒకచోట.."ఈ కథలు చదువుతుంటే అపుడపుడూ నవ్వొచ్చింది. అలా అని అది హాస్యరసం కాదు" అన్నారు. మొదటి 5 కథల్లోను పలు సందర్భాల్లో హృదయాన్ని ద్రవింపజేసి, కనులను చెమర్చేలా చేసిన రా.వి.శాస్త్రి చివరి కథలో సీనియర్ జడ్జి గారితో పాటు పాఠకుడినీ సంఘర్షణకు గురిచేసి, తల తిరిగేలా చేశారనిపించింది. ఆ తల తిరుగుడు తగ్గకముందే ఆ ఘట్టంలోనే నవ్వూ పుట్టించారు. హాస్యమో మరొకటో తెలియని ఆ స్థితికి పరాకాష్ఠగా ఆ కథ చివరి వాక్యాలిలా ఉంటాయి : "ఓహోహో! మర్చేపోయాను. గవర్నమెంటుకి పాపం పిచ్చెక్కింది కదూ.. ఎలా ఉందో ఏమిటో.. పదండి చూద్దాం.."

చట్టాలు, వాటిని తయారు చేసేవారు, అమలు పరిచేవారు; బలహీనులను, అణగారిన వర్గాలను కాల్చుకు తినడాన్ని 'ఆరు సారా కథలు'లో రా.వి.శాస్త్రి పాఠకుల కనులకు కట్టారు. సహృదయుల హృదయాలను తట్టారు. కానీ బలహీనులకి బలవంతుల నుంచి ఈ పీడన, ఈ దుఃఖం ఇంకా ఎంతకాలం?

రావి శాస్త్రి సంఘంలోని దుర్మార్గం నశించి, మార్పు ఎలా రాగలదో 'పుణ్యం' కథలో, పోలమ్మ పాత్ర గురించి ప్లీడర్లు పలికే సంభాషణల ద్వారా సూచించారని పరిశోధకులు భావించారు. 1922 జులై 30న శ్రీకాకుళంలో పుట్టిన ఈ తెలుగు డికెన్స్ 1993 నవంబర్ 10న తెరమరుగుకు వెళ్లిపోయాడు. కాళీపట్నం రామారావు (కారా) గారు అన్నట్టు.. 'రావిశాస్త్రి వ్యక్తిగత జీవితం కన్నా ఆయన సాహిత్యం గొప్పది. ఆయన సాహిత్యం కన్నా ఆయన ఎంచుకున్న మార్గం ఇంకా గొప్పది'. ■

# మతాంబోతులు

- పల్లిపట్టు నాగరాజు
99894 00881



**యీ** మాదిరైతే ఎట్టా..!

■■■

అందరం
మనిషి పుట్టకకే కదా పుట్టింది
అందరం
అమ్మల పాలుతాగే గదా పెరిగింది
నీళ్లు తాగి
కూడు తినే కదా కాలమెల్లదీస్తావుండేది.!

మద్దెలో
ఈ మతం గబ్బు ఎవుడు తినిపిస్తావున్నాడు
ఈ మతం సాడు ఎవుడు తాగిస్తావుండాడు
ముక్కలికాడికి తాగి
నోటికొచ్చింది వాగే తాగుబోతుల్లాగా
మతాంబోతులై ఇట్టా ఊగుతూ
మనిషితనానికి పాడెకడతా ఉన్నారే..?

మతమొక ముదనష్టపు నిప్పై
బతుకులెలాఎలా కాల్చుకు తింటావుందో
దేవుడొక గొబ్బునాకొడుకై
ఎన్నెన్ని దుర్మార్గపు ముండ్లకంపలు నాటుతున్నాడో
చూస్తూ గూడా
యీ కత్తులు నూరే కారుకూతలేంది.!

పూటకొకతూరి పూటుగా మతాన్ని మింగి
మసీదులు ముందో
మందిరాలు ముందో
మదమెక్కిన ఆంబోతుల్లా
మతమెక్కిన కుమ్ములాటలేంది?

పోయిన పానాన్ని
ఏ దేముడన్నా తిరిగిస్తాడా?
కూలిన కాపురాన్ని ఏ భక్తుడైన నిలబెడతాడా!?
నువ్వు పట్టించుకోకపోతే
పట్టించుకునే నాథుడేలేని మతం గురించి
నువ్వు మొక్కకపోతే
ఏ దిక్కునా వునికే లేని దేవుడి గురించి
తన్నులాడుకోవడం
తలలు తెగనరుక్కోవడం
ఎంత సిగ్గుమాలిన పనో నీకెప్పుడు తెలుస్తుంది?

నీ నెత్తిమీద మతంగుడ్డ కప్పి
మీ మెళ్ళో భక్తి బిల్లలు కట్టి
నీ చెవుల్లో మతాన్ని వూది వూది
నిన్నో మతంపాతరగా పేల్చి
జాతిని సర్వనాశనం చేసే కూటాల కుట్రల్లో
కీలుబొమ్మగా మారడానికేనా
విద్వేషపు పామై విషం చిమ్ముతూ
మనుషుల్ని కాటేయడానికేనా
నువ్వీ మనిషి పుట్టుక పుట్టింది?

అన్నీ తెలిసీ అగ్గేనంలో బడితే ఎట్టా?

మతాన్నో దేమున్నో ఎరగా వేసి
ఎదిగేవోడు ఎదుగుతానే ఉండాడు
అందినకాడికి దోచుకొని
పబ్బం గడుపుకునేటోడు గడుపుకుంటుండాడు

మనమే
మోసకారి కోలాటంలో
భక్తిపాటలకు పూనకమొచ్చి ఊగిపోతున్నాం

మనుషులం కదా
మనయి పిల్లాపాపలతో బతికే కుటుంబాలం గదా
కుటుంబాలు కూలిపోతే ఎట్టా?
కుటుంబాల దేశం భక్తిమంటల్లో కాలిపోతే ఎట్టా?

■■■

కళ్ళముందు కాలం
యీ మాయనైతే ఎట్టా..!
యీ మాదిరైతే ఎట్టా? ఎట్టా...? ■



# వాస్తవికతా అక్షరశిల్పి చిన్నప్ప భారతి

- తె.ర.

ప్రగతిశీల తమిళ రచయిత కె.చిన్నప్ప భారతి మే 13వ తేదీన కన్నుమూశారు. ఆయన వయసు 88 సంవత్సరాలు. తన నవలల, అనువాదాల ద్వారా తెలుగు సాహిత్యలోకానికీ, పాఠకులకూ సుపరిచితమైన చిన్నప్ప భారతి రచనలు వాస్తవికతకు అద్దం పట్టాయి. ఎందరికో ఉత్తేజమిచ్చాయి. రచనలు చేయడమే గాక రచయితలను ప్రోత్సహించడంలోనూ, సాహిత్య సమ్మేళనాలు నిర్వహించడంలోనూ ఆయన గొప్ప కృషి చేశారు. 1935లో సేలం జిల్లా నమ్మక్కల్‌లో చిన్న రైతు కుటుంబంలో పుట్టిన చిన్నప్ప పొలం పనులు చేస్తూ తల్లిదండ్రులకు చేదోడుగా ఉండేవారు. ఆ సందర్భంలో వ్యవసాయ కార్మికుల పట్ల, దళితుల పట్ల తల్లి చూపే ఆదరణ ఆయనను ఆకట్టుకుంది. ప్రభుత్వ ఇంజనీర్‌గా పనిచేసిన నామూ నాయర్ హాస్టల్‌లో చిన్నప్పతో కలసి ఉండేవారు. ఫ్రెంచి విప్లవం, అక్టోబర్ విప్లవం వంటి వాటి గురించి ఆయనే చెప్పారు. పుస్తకాలిచ్చి చదివించారు. తల్లి ద్వారానే తనకు మానవతాదృష్టి పట్టుబడిందనీ, బళ్లో నానూ నాయర్ తనను మార్క్సిజం వైపు తిప్పారని చిన్నప్ప చెబుతుండేవారు. దేశంలో సాగుతున్న స్వాతంత్ర్య పోరాటం సహజంగానే ఆయనపైనా ప్రభావం చూపింది.

### ఉద్యమాలతో అధ్యయనం

చిన్న వయసులోనే చిన్నప్పను సుబ్రహ్మణ్య భారతి రచనలు, ముఖ్యంగా కవితలు విశేషంగా ఆకర్షించాయి. ఆ ప్రభావంతో తనూ కవితలు రాయడం మొదలెట్టారు. 1950లలో తొలి కవితా సంపుటం ప్రచురించారు. గౌరవసూచకంగా పేరు చివర భారతి పేరు పెట్టుకున్నారు. ప్రముఖ నవలా రచయిత డా.ఎం.వరదరాజన్ (మా.వ) రచనలు కూడా బాగా ఇష్టపడేవారు. నైతిక విలువలు ఆసక్తికర కథనాలకు పేరొందిన మా.వ. రచనలు పాఠకులలో అమితాదరణ వుండేది. ఆయన చెన్నై పచ్చయప్ప కాలేజీలో ప్రొఫెసర్. సేలంలో దగ్గరే కాలేజీ వున్నా ఆ కారణంగానే చిన్నప్ప అక్కడికి వెళ్లి చేరారు. బళ్లో ఉన్నప్పుడే విద్యార్థి ఫెడరేషన్‌కు దగ్గరై కార్యక్రమాలు నిర్వహించిన ఆయన.. కాలేజీలో చదివేటప్పుడు కమ్యూనిస్టుగా మారారు. ఇంకా పై చదువులకు వెళ్లే బదులు రాజకీయ రంగంలో పనిచేయాలని, రచనలు కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నారు. 1956లో మాస్కోలో జరిగిన యువజనోత్సవాలకు హాజరయ్యారు. ఇండోనేషియాలోని బాండుంగ్‌లో జరిగిన ప్రపంచ శాంతి సభల్లోనూ పాల్గొన్నారు.

కాలేజీ నుంచి బయటకు రాగానే *దైవమాగి నింద్రన్* అనే తొలి వచనాత్మక నవల ప్రచురించారు. కోయంబత్తూరు నుంచి మద్రాసు వరకూ జరిగిన రైతుయాత్రలో పాల్గొన్నారు. ఆ సందర్భంగా రోజూ జరిగిన రాజకీయ క్లాసుల్లో కమ్యూనిస్టు నాయకుడు బి.శ్రీనివాసరావు చెప్పిన విషయాలు బాగా నచ్చి... తాను ఉద్యమానికి అంకితం కావాలని నిర్ణయించుకున్నారు. రాజకీయ కార్యకలాపాలతో పాటు చిన్నప్ప భారతి దేశ విదేశీ సాహిత్యం శ్రద్ధగా చదివారు. టాల్‌స్టాయ్, మిహాయిల్ షోలకోవ్, మాగ్జింగోర్కిలను ఆదర్శంగా పెట్టుకున్నారు. పాబ్లో నెరూడా, షెల్లీ, బైరన్, మయకోవసీ, ప్రేమ్‌చంద్, కిషన్‌చందర్, ముల్క్‌రాజ్ ఆనంద్, తజగి శివశంకరపిళ్లె, హరీంద్రనాథ చటోపాధ్యాయ వంటి

వారి రచనలు చదివి ఉత్తేజితులయ్యారు. తమిళంలో భారతీ దాసన్, తమిళ ఓలి, జయకాంతన్‌లను బాగా ఇష్టపడేవారు.

**సంఘం, దాహం**

తమ ఊరికి దగ్గర్లోనే వుండే కొల్లికొండల్లో గిరిజనులలో పనిచేసే బాధ్యత ఆయనకు అప్పగించబడింది. ఆ క్రమంలోనే వారి పేదరికం, స్థితిగతులు, సంప్రదాయాలను దగ్గరగా తెలుసుకోగలిగారు. ఈ అనుభవంతోనే సంగం రాశారు. తన రచనలన్నిటిలో ఇదే ఆయనకు ప్రసిద్ధి తెచ్చిపెట్టింది. ఇళక్కి చింతామణి అవార్డు కూడా వచ్చింది. ఈ నవల కోసం చిన్నప్ప అయిదేళ్లు శ్రమపడ్డారు. పేరులో వున్నట్టే అమాయకులైన గిరిజనులపై దోపిడీ పీడనలు, వారు సంఘటితపడి పోరాటం సాగించడం ఈ నవలలో చూస్తాం. సన్నిహిత పరిశీలన కారణంగా వాస్తవికతకు దర్పణంగా పేరొందింది. తిరుమని, తిరుమి కుటుంబం కేంద్రంగా నవల నడుస్తుంది. ధర్మకర్త పేరిట ఇచ్చే నిరంకుశ తీర్పులు వారిని ఎన్ని కష్టాలపాలు చేస్తాయి. అమానవీయమైన ఆ శిక్షలను గిరిజనులు మౌనంగా నిస్సహాయంగా భరిస్తుంటారు. మోట్టియన్ ఆధ్వర్యంలో దళారులు, అక్రమ వ్యాపారులు వారిని పీల్చిపిప్పిచేస్తారు. సిలోన్ శ్రీరంగన్ వారిలో చైతన్యం తీసుకొస్తాడు. అతన్ని జైలులో వేసినపుడు కుమార్ అనే కమ్యూనిస్టు పరిచయమవుతాడు. వారి అటవీ ఉత్పత్తులు కొండపైనేకొనే ఏర్పాటు కోసం పోరాడి సాధిస్తాడు.

తర్వాతి నవల దాహం. చిన్నప్ప నవలలన్నిటిలో మహిళల సమస్యలు కూడా ప్రధాన భాగం ఆక్రమిస్తాయి. దాహంలో కూడా మారప్ప కుమార్తెను అత్తింటివారు కట్నం కోసం పెట్టే బాధలు వేధింపులు చిత్రించారు. మారప్పన్ కుమారుడైన కందన్ చైతన్యవంతుడై సహచరుడు సంబంధన్‌తో కలసి జమీందారు సేనాపతి గౌండర్ పెత్తనాన్ని ప్రతిఘటించడం ఇతివృత్తం. ఆర్థిక దోపిడీతో పాటు కుల వివక్ష సంకెళ్లను కూడా ఆధిపత్య శక్తులు ఎలా ప్రయోగిస్తారో ఈ నవల చెబుతుంది. ఈ నవల డా.శివరామకారంత్ రాసిన చోమనదప్పు (చోమనదుడి పేర చిత్రంగా వచ్చింది)ను తలపిస్తుందని విమర్శకులు చెబుతారు. ప్రతి నవలలోనూ మహిళల పాత్రలు సజీవంగా శక్తివంతంగా రూపొందించే భారతి ప్రత్యేకంగా మహిళల సమస్యలపై పావళాయి అనే నవల రాశారు. సొరంగం నవలలో బెంగాల్, జార్ఖండ్‌లలోని గని కార్మికుల పరిస్థితిని అక్షరీకరించారు. పాలై వన రోజా, తలై ముఱై మాత్రం (తరాల మార్పు) ఆయన ఇతర రచనలు.


**తెలుగులో విశేషాదరణ**

మాతృభాష తమిళంతోపాటు తెలుగు, హిందీ బాగా తెలిసిన కీ.శే.ఎజి యతిరాజులు మొదటి రెండు నవలలను గొప్పగా అనువదించారు. దాంతో అవి మూలాన్ని తలపించేలా ఆకట్టుకున్నాయి. సంఘం పునర్ముద్రణ పొందింది. మూడవ నవలగా చక్కెరలో ఫ్యాక్టరీ కార్మికుల కష్టనష్టాలు, యాజమాన్యం కుయుక్తులను చిత్రిస్తారు. ఈ నవలను తెలుగులోకి సీనియర్ జర్నలిస్టు కీ.శే.పిఎస్ రావు ఇంగ్లీషు నుంచి అనువదించారు. ప్రజాశక్తిలో సీరియల్‌గా వచ్చింది. గని నవల కూడా ప్రజాశక్తిలో సీరియల్‌గా ప్రచురితమైంది. దానిని ఉప్పలదడియం వెంకటేశ్వర తెలుగులోకి అనువదించారు. తెలుగులో వీటిని ప్రచురించడంపై చిన్నప్ప భారతి ఎంతో సంతోషించేవారు. ఆయన ప్రత్యేకంగా ప్రజాశక్తి కార్యాలయాన్ని సందర్శించారు. ఇక్కడ రచయితలతో మాట్లాడారు.

**సాహిత్యకారులకు ప్రోత్సాహం**

చిన్నప్ప భారతి నమ్మక్కల్‌లో తాను ఏటా నిర్వహించే సాహిత్య సమ్మేళనాలకు తెలుగు రచయితలను ఆహ్వానించేవారు. ఓల్గా వంటివారు అలా వెళ్లి వచ్చారు. తమిళ సాహిత్య సంస్థలు ఆయనను ఎన్నో సార్లు అవార్డులతో సత్కరించాయి. తనకు అవార్డుగా వచ్చిన రూ.5 లక్షల మొత్తాన్ని కేటాయించి ఏటా ఒక భాషా రచయితకు రూ. 50 వేలు ఇస్తూ వచ్చారు. ఆ క్రమంలోనే ఆయన సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో 2011లో అద్దేపల్లి రామమోహనరావు పొగచూరిన ఆకాశంకు పురస్కారం అందించారు. వెంకటేశ్వర యూనివర్సిటీ సెనేట్ హాల్లో జరిగిన ఆ కార్యక్రమంలో అవార్డు ప్రదానంతో పాటు భారతికి కూడా సత్కారం చేశాము. ఇండియన్ లిటరేచర్ అనే పత్రికను ఆయన ఇంగ్లీషులో కొంతకాలం నడిపారు. ఆరోగ్యం బాగున్నంతవరకూ సాహిత్య సభలకు వస్తూనే వున్నారు. గత నాలుగేళ్లుగా అనారోగ్యంతో పెనుగులాడుతూ కన్నుమూశారు. ఆయన భార్య చెల్లమ్మ భర్తతో పాటు ఈ సభలకు వస్తుండేవారు. వారికి ఇద్దరు అమ్మాయిలు సంతానం.

మొత్తం ఏడు నవలలు రాసిన చిన్నప్ప భారతి రచనలు ఇంగ్లీషు, స్పానిష్, మలయా, ఫ్రెంచి, డానిష్ వంటి విదేశీ భాషలతో సైతం మొత్తం 13 భాషల్లో అనువదించబడ్డాయి. ప్రజా సాహిత్య మూర్తి చిన్నప్ప భారతికి సాహితీ స్రవంతి, ప్రజాశక్తి సంస్థలు నివాళులర్పిస్తున్నాయి. ■




# తల్లీ నిన్ను దలంచి ...

**- తెలకపల్లి రవి**

***అమ్మల గన్న యమ్మ ముగురమ్మల మూలపుటమ్మ..***
***సురారులమ్మ కడుపారడి బుచ్చిన యమ్మ...***

**అ**మ్మల పరంపరకు పోతన చిత్రణ ఇది. సురాసుర వైరం మీదనే రాయబడ్డ మన పురాణాల్లో దుర్గమ్మను వర్ణిస్తూ, రాక్షసుల తల్లి కూడా బిడ్డల కోసం విలపిస్తుందని చెబుతున్నాడు. తిక్కన ఇలాగే చెప్పాడు. ఉప పాండవులను ప్రతీకారంతో హతమార్చిన అశ్వత్థామ ముందు తన బాధ వెళ్లగక్కాక త్వరగా విడిచిపెట్టండి, నాలాగే మరో తల్లి ఏడ్చే పరిస్థితి తీసుకురాకండి అంటుంది.

ఇవన్నీ పురాణాలనుకుంటే ఆధునిక చరిత్రలోనూ మహా వీరులు నేతలూ యోధులూ కవులూ కళాకోవిదులూ అమ్మ మలచిన శిల్పాలే. వారందరికీ తొలి గురువు అమ్మే. ధైర్యం అమ్మే. మహా కవులూ, రచయితలూ అక్షరాలతో ఆ అమ్మ బొమ్మకట్టిన వారే. గురజాడ కన్యాశుల్కంలోనూ, పూర్ణమ్మలోనూ కూడా అమ్మలే బిడ్డ తరపున ధైర్యంగా నిలబడతారు.

'నా జనని గర్భంలో ఆకారం లేకుండా నిద్రిస్తున్న నా అహంకారానికి ఆశలు కొల్పిన నాడో' అంటాడు శ్రీశ్రీ. కవిత్వాన్ని 'జననీ' అని సంబోధిస్తాడు. 'వైద్యశాలలో అపుడే ప్రసవించిన శిశువు నెడద నిడుకొని రుచిర స్వప్నాలను కాంచే జవరాలి మనఃప్రపంచపుటావర్తం' చూపిస్తాడు. పల్లెటూళ్లో తల్లికేదో పాడు కలలో పేగు కదిలింది అని బాటసారిని వర్ణిస్తాడు. ఎన్ని చోట్ల అమ్మ గురించి రాసినా తృప్తి తీరక 'పుడమితల్లికి పురిటి నొప్పులు కొత్త సృష్టిని స్ఫురింపించాయి' అంటాడు. మాగ్జీం గోర్కి ఏకంగా అమ్మ పేరిటే నవల రాశాడు. తన బిడ్డ పావెల్ కొత్త చైతన్యం పెంచుకుని రహస్యోద్యమం నిర్మిస్తుంటే మొదట సందేహించి తర్వాత గాభరా పడి ఆ తర్వాత తనే అరుణ కిరణమవుతుంది. ఈ పయనాన్ని న్యాయస్థానంలో వివశంగా ఆవేశంగా వినిపిస్తుంది.

ఇంతటితో తృప్తి తీరని గోర్కి ఏకంగా ఒక ప్రసవాన్ని వర్ణిస్తాడు. తన దృష్టిలో పాత సమాజం అమ్మ. ఇది దేశమేదైనా కాలమేదైనా ఒక విధంగా ఇంటింటా జరిగేది. తల్లి వేరు నుంచే మొక్క మాను రావాలి. పుట్టకముందే తల్లితో మొదలవుతుంది జీవుల సంబంధం. మానవ మహానుబంధం. బిడ్డను ప్రోత్స హించడం, ఓదార్చడం తన తొలి చర్య. దినచర్య. చాలామంది తల్లులకు పిల్లలు తప్ప వేరే ప్రపంచం ఉండదు. విజయంలోనూ విచారంలోనూ అమ్మ ఉన్నట్లే అనుకుంటారు. బిడ్డలు విజ్ఞులైతే అమ్మ అభినందిస్తుంది. విజయమైతే ఆనందిస్తుంది, విచారాలు వివాదాల్లో సాంత్వననిస్తుంది. తనకెన్ని బాధలున్నా సరే, బిడ్డలు పెరిగి తమకంటూ తమ ప్రపంచం సృష్టించుకున్నాకా అందులో ఆమె ప్రత్యేక స్థానంలో ఉంటుంది. పెద్ద చదువులు చదివిన, పెద్ద పదవులు నెరిపిన వారి తల్లుల్లో చాలామంది అమా యకంగా అనామకంగా ఉంటారు. కుటుంబాన్ని లోకాన్ని కూడా ఎదిరించి శ్రమచేసి చదివిస్తారు. ఉరుకులూ పరుగుల ఉ ద్యోగినులనుంచి, బిడ్డల ఫీజుల కోసమే ఇళ్లలో పనిచేసే వారి వరకూ; రైతమ్మల నుంచి నాట్లు వేసే కూలీల వరకూ ఈ వరసలో ఉంటారు.

భర్త తాగి వచ్చి కొడుతున్నా బతిమాలి బామాలి పోరాడి పిల్లలను కాపాడుకుంటారు. ఎందరో అమ్మలు ప్రసవంలోనే కన్ను మూసినా బిడ్డలను లోకానికి అప్పగించిపోతారు. వారిని ఎవరో ఒకరు స్వంత బిడ్డల్లానే పెంచుతారు. ఆ విధంగా చూస్తే కన్నతల్లులే గాక ప్రేమమూర్తులైన మహిళలందరూ అమ్మలే. అమ్మ నాన్న బాధ్యతలు రెండూ నిర్వహించే ప్రేమమూర్తులకూ ఇది మరింత వర్తిస్తుంది.

గోర్కి నవలలో అమ్మలాగే బిడ్డలు కొత్త బాట తొక్కినపుడు అర్థం చేసుకునే వరకూ ఆందోళన చెందుతారు. అవగాహన పెరిగాక తామూ అదే బాట నడుస్తారు. బిడ్డల పక్కన నిలుస్తారు. పేద తల్లులు సయితం బిడ్డలను సేవాధర్మం వైపు నడిచేందుకు ప్రేరణనిస్తారు. పెద్ద కుటుంబాల్లోనైతే భర్తలకు తెలియకుండా కూడా మంచి పనులకు, ఉద్యమాలకూ సహాయపడతారు. సేవలో నిమగ్నమైన వారందరినీ బిడ్డలుగానే చూస్తారు. అందరికీ అమ్మలవుతారు. ఏ ఉద్యమంలోనైనా, విప్లవంలోనైనా, కార్యక్రమంలోనైనా ప్రేమగా ఆదరించి ముద్దపెట్టే అమ్మ కనిపిస్తే ఆ స్పందనే వేరు.

ఈ సంకలనం మన చేతుల్లోకి రావడానికి కారణమైన అమ్మ గున్నమ్మ గారు అలాటివారే. ఆమె పెద్ద కొడుకు, మా చిరకాల మిత్రుడు చీకటి దివాకర్ వినూత్న యోచనకు రూపం ఈ సంకలనం. ఆ నేపథ్యం తనే మరోచోట విశదంగా తెలియ జేశారు. దివాకర్ తండ్రి గంగాధరరావు గారు విద్యాధికులూ, ఒకింత హేతువాద బీజాలు గల వ్యక్తి అయినా ఉద్యోగం చేయ లేదు. అమ్మ గున్నమ్మ అవకాశాలున్నా ఆనాటి సంప్రదాయ సమాజంలో చదువుకోలేదు. అయినా తను ఉద్యమజీవిగా మారి పనిచేస్తుంటే ఆమె ఎలా సహకరించిందీ దివాకర్ చెప్పారు. ప్రజాసైన్సు ఉద్యమంలో తన హేతువాద భావాలను గున్నమ్మ గారు ఆశీర్వదించారు. తన కోడలు, దివాకర్ శ్రీమతి చంద్రికారాణి కూడా క్రమేణా సామ్యవాద భావాలను ఆకళింపు చేసుకోగలిగింది. భర్త మరణానంతరం వారిద్దరి కోరిక మేరకు గున్నమ్మ గారు కొందరికి నచ్చకపోయినా నూతన గృహం ప్రారంభోత్సవం చేశారు. పిల్లల సాహసానికి సంతోషించారు. అంతకుముందూ, తర్వాత కూడా దివాకర్ ఇల్లు సాహితీ మిత్రులతో, సామాజిక శక్తులతో కళకళలాడుతుంది. గురజాడ వారసత్వం అన్నట్టు విజయనగరంలో సాహితీస్రవంతి నిరంత రాయంగా పనిచేస్తుందంటే ఈ కుటుంబం ఆదరణ, స్నేహశీలత ఒక ముఖ్య దోహదకారి. అలా వెళ్లినపుడు నేను అమ్మను ఒకటి రెండుసార్లు కలిశాను.

అస్వస్థతతో పోరాడుతున్న గున్నమ్మ గారు దివాకర్ ప్రేరణతోనే చరమదశలో అవయవ దానానికీ, తన భౌతిక



కాయాన్ని పరిశోధనల నిమిత్తం ఇవ్వడానికి సిద్ధపడ్డారు.. ఇలాటి విషయాల్లో విస్తృత కుటుంబాల్లో ఏకాభిప్రాయం రావడం కష్టం. కొన్ని సందర్భాల్లో భౌతికకాయం పరిస్థితి మరో సమస్య. ఏమైనా దివాకర్ చిత్తశద్ధితో అందుకు ప్రయత్నించడం, గున్నమ్మ గారు అంగీకరించడం గొప్ప విషయం.

దివాకర్ ఈ పుస్తక ప్రచురణ ద్వారా అమ్మ తన అపూర్వ నివాళిని అర్పిస్తున్నాడు. తను ముభావంగా వుంటాననీ, వ్యక్తీకరణ శక్తి తక్కువని రాసుకున్నాడు గాని నిజానికి ఇంత కన్నా ఉద్వేగభరిత వ్యక్తీకరణవుంటుందా? అందుకే ఇదో మంచి వరవడి. ఇందులో అమ్మపై వచ్చిన ప్రసిద్ధ కవితలతోపాటు కొత్తగానూ రాయించి గున్నమ్మ గారి ద్వాదశావహస్సు నాటికే (ఈనెల 29న) ఆవిష్కరిస్తున్నాడు. ఈ సంకలనంలో సి.నారాయణరెడ్డి నుంచి పాయల మురళీకృష్ణ, గవిడి శ్రీనివాస్‌ల వరకూ అమ్మల గురించి రాసిన కవితలున్నాయి. ఎవరికివారు అమ్మ ఆర్ద్రంగా కళ్లు చెమ్మగిల్లేలా రాశారు. అనేకులు కవిత్వభాషలో వర్ణించారు. చాలామంది వారి మాతృమూర్తుల మరణానంతరం మననంలా రాశారు. ఎక్కువగా ఆరాధనా భావం, ఒకింత పశ్చాత్తాపం, ఒప్పుకోలు వంటివి కూడా చూస్తాం.

సంపాదకులు గంటేడ గౌరునాయుడు అన్నట్టు అమ్మ గురించి రాయని కవి ఎవరూ వుండరు. ఇటీవల ఇది పెరిగిందంటే అందుకు కారణం అస్తిత్వ ఆత్మిక ఆర్థిక సంక్షోభాలే. కాలికి దెబ్బ తగలగానే అమ్మా అని అరిచినట్టే ఈ సంక్షోభాల సుడిగుండంలో సంఘర్షణలో చిక్కిన కవి, రచయిత అమ్మను గుర్తుచేసుకుంటున్నాడు. ఆమె ఇచ్చిన మూలశక్తిని వెతుక్కుంటున్నాడు. వైద్యరంగంలో ఇప్పుడు బిడ్డ బడ్డుతాడు భద్రపరచడం మనకు తెలుసు. ఎవరికైనా సరే అమ్మనుంచి వచ్చిన మూలశక్తి తొలి చైతన్యం. అందుకే అమ్మ అంటే సెంటిమెంటు కాదు, కమిట్‌మెంట్. ఆమెను తలుచుకోవడం ఒక కంటెంట్‌మెంట్. కమాండ్‌మెంట్. అమ్మా.. ది గ్రేట్ అని గతంలో రాసింది ఇక్కడ గుర్తు వస్తోంది. ఈ ముందుమాట రాసినంతసేపు మా అమ్మ, సమరశీల టి.సి. లక్ష్మమ్మ పక్కనే కూచుని రాయిస్తున్నట్టుంది. ఆమెను లక్ష్మమ్మ అంటే ఎంత సంతోషించిందో! ఒకరికి లక్ష్మమ్మ మరొకరికి గున్నమ్మ.. తల్లులందరినీ తలంచి.. అభినందనలు.

('పేగుబంధం' పుస్తకానికి ముందు మాట)

■



# ఇల్లరికం

- చిలుకూరు శ్రీనివాసరావు
89859 45506

**త**న సంసారాన్ని మూటా ముల్లుగా సర్దుకుని, ఎడ్ల బండి మీద ఊరొదిలి వెళుతున్న రాంబాబుకి మనసేమీ బాగుండలేదు. దారి పొడుగునా ఎదురవుతున్న పొలాలు, దూడ, దుక్కు చూస్తుంటే తమ అనుబంధాలను వేటినో తెంచేసుకుంటున్నట్టు అనిపిస్తోంది. చిన్నప్పటి నుంచి ఆ ఊరితో, పరిసరాలతో పెనవేసుకున్న స్మ ృతులన్నీ కళ్ళల్లో కదలాడుతున్నాయి. వఅర్ధాప్యం ఆవరిస్తున్న కన్నోళ్ళని, పెంచి పెద్ద చేసిన ఇంటిని వదలి వెళ్ళడం తనకు అస్సలు ఇష్టం లేదు. పొంగుకొస్తున్న దు:ఖం నీటి చారికై కంటి గుడ్డుని కప్పేసింది. ముందుకు సాగుతున్న బండిని అతని దేహమే తోలుతోంది. మనసు మాత్రం పరిపరి విధాల పాత జ్ఞాపకాలు వైపు వెనక్కి పరుగు తీస్తోంది. తన సుదీర్ఘ ప్రయత్నం నెరవేరుతున్నందుకు భార్య సుజాతకి చెప్పలేనంత ఆనందం పొంగుకొస్తున్నా.. భర్త పరిస్థితి గమనించి తన సంతోషాన్ని లోలోపలే అదిమేసుకుంటుంది. దారిలో ఎదురయ్యే ప్రతిదీ తేరిపార చూస్తూ తెగ సంబ్రపడిపోతున్నారు పిల్లలు. కుటుంబమంతా ఒకే బండిలో కలిసి ప్రయాణిస్తున్నప్పటికీ ఎవరి ఆలోచనలతో వాళ్ళు ముందుకు సాగుతున్నారు.

♦ ♦ ♦

ఊళ్లో సొంతిల్లు, ఆరెకరాల పొలం, సమృద్ధిగా పాడి. చీకూచింతా లేకుండా గడుస్తున్న మధ్య తరగతి కుటుంబం రాంబాబుది. పదో తరగతితో చదువుకి స్వస్తి పలికి తండ్రి సీతాపతికి చేదోడుగా వ్యవసాయ బాట పట్టాడు. మరో నాలుగెకరాలు కౌలుకు తీసుకుని చేతి నిండా సేద్యం చేస్తున్నాడు. అనుకున్నదే తడవుగా రాంబాబుకి పెళ్లి కూడా జరిగిపోయింది. తనూ, తల్లిదండ్రులు, భార్య, ఇద్దరు పిల్లలతో సంసారం హాయిగా ముందుకు నడుస్తోంది. ఒకరికొకరు తోడుగా తండ్రీ కొడుకులు కలిసి వ్యవసాయం చేస్తుంటే .. ఊరంతా ముచ్చట పడుతోంది. వాళ్ళు వేసిన పంటలు కూడా అలాగే పండుతున్నాయి. నిత్యం, పాలు, కూరగాయలు, పండ్లూ, ఫలాలతో ఇల్లంతా ఒకటే సందడి. తాతయ్య, నాయనమ్మల మమతల్లో ఊయలూగుతున్నారు పిల్లలు. ఆరేళ్లు దాటినా.. ఆ అత్తాకోడళ్ళ అనుబంధం ఎక్కడా బీటలు వారలేదు. సరదా సరదాగా సాగిపోతున్న ఆ ఇంటి ఆనందాలకు అనుకోని బ్రేకులు పడ్డాయి. ఉన్నట్టుండి చెరకు పంటని రెడ్ లైట్ రాట్ (ఎర్ర కుళ్లు తెగులు) ఆశించింది. వరి పంటను కూడా తెల్ల దోమ అలిమేసింది. పంటను కాపాడుకోవడానికి ఆ తండ్రీ కొడుకు చేయని ప్రయత్నం లేదు. ఎవరు ఏ సలహా చెపితే ఆ క్రిమిసంహారక మందులు పిచికారి చేశారు. ఐనా ఫలితం దక్కలేదు. పంట నష్టం ఒక ఎత్తయితే.. అధిక మోతాదులో వాడిన రసాయిన మందుల ధరాఘాతం మరో గుదిబండైంది.

"పండినా, పండక పోయినా నా శిస్తు నాకు చెల్లించాల్సిందే!" అని కౌలుచేను ఆసామి పట్టుబట్టాడు. అన్నీ కలిసి నష్టం తడిసి మోపెడయింది. దీంతో కుటుంబంలో ఆర్థిక ఆటుపోట్లు

తలెత్తాయి. పరిస్థితి తలకిందులయింది.

ఎన్ని గడ్డు పరిస్థితులు ఎదురైనా చిట్టచివరి వరకూ ఆశావాదంతో ముందుకెళ్ళడం రైతు నైజం. ఈ పంటనష్టాన్ని మరో పంటతో పూడ్చుకుందామని తండ్రి కొడుకులు తరువాత సేద్యానికి తలకట్టు బిగించారు. ఈసారి పొలమంతా ఏకంగా వరినాట్లే వేశారు. నెమ్మదిగా చేను మూల నిలదొక్కుకుంది. మలి ఆకులు లేచి మడులన్నీ ఆకుపచ్చని కిసలయ విన్యాసంతో రెపరెపలాడుతున్నాయి. రాంబాబు, వాళ్ళ నాన్నలో ఆశలు పండుతున్నాయి. ఈ పంటలోనైనా అప్పులు తీరి నాలుగు డబ్బులు మిగులుతాయన్న ఆశ వాళ్లది. ఊరించిన తొలకరి వాన చివరికి ఉసూరుమనిపించింది. అరచేతిని కళ్ళకాన్చి ఆకాశం వైపు ఎన్నిరోజులు చూసినా.. వరుణుడు కరుణించ లేదు. నీటి ఎద్దడి చేలో వరి దుబ్బుల్ని మాడ్చేసింది. మిగిలున్న కాసిన్ని పిలకలను మోటార్ నీటితోనో, కన్నీటితోనో ఆ తండ్రి కొడుకులు రాత్రింబవళ్ళు కష్టపడి కాపాడుకుంటూ వచ్చారు. అనుకున్నంత కాకపోయినా నాలుగింజలు పండాయి. "లాభాల మాట దేవుడెరుగు, పెట్టుబడికి ముప్పుండదులే!" అని సరిపెట్టుకున్నారు. మరో వారం రోజుల్లో పంట చేతికందనుంది. అకస్మాత్తుగా సముద్రంలో రేగిన సుడిగుండం వాయుగుండమయింది. తుపానుగా చెలరేగి పొలాలన్నిటిని తుడిచి పెట్టేసింది. చివరికి రాంబాబుకి చేలో గడ్డిపరకలు, చేత మట్టి మరకలు మిగిలాయి. ఫలితంగా కుటుంబం పీకల్లోతు అప్పుల్లోకి వెళ్ళిపోయింది. ఇంట్లో పాడి పశువులతో పాటు, నగానట్రా అమ్మేయక తప్పలేదు. ఈసారి కూడా కౌలు పొలం యజమానికి శిస్తు ముట్టజెప్పాల్సి వచ్చింది. వాళ్ళ చేను వాళ్ల చేతుల్లో పెట్టేసి కౌలు వ్యవసాయానికి ఓ దణ్ణం పెట్టేశాడు రాంబాబు. 'ఒప్పుకున్న పెళ్లికి వాయించి తీరాలన్నట్టు' 'రైతై పుట్టేక కష్టమో, నష్టమో చేను దుక్కు దున్నాల్సిందే!' అనుకుంటూ మరోసారి సాగుకు తుండుని నడుం కట్టాడు రాంబాబు.

ఆర్థిక అలజడి ఇంట్లో తరచూ కలతలు సృష్టిస్తోంది. "ఇక్కడ వ్యవసాయం చేసి అప్పులవడం దేనికి? మా పుట్టింటికి వెళ్ళిపోదామని" సుజాత పట్టు. "చావైనా, బతుకైనా ఇక్కడే! అత్తారింటికి ససేమిరా కుదరదంటూ" రాంబాబు బెట్టు. ఒకరోజు అప్పిచ్చిన ఆసామి ఇంటికొచ్చి గట్టిగా కేకలేశాడు. ఆ సమయంలో రాంబాబు ఇంటి దగ్గర లేదు. సుజాత మనసు చాలా నొచ్చుకుంది. ఆ కాసేపటికే రాంబాబు ఇంటికొచ్చాడు. 'ఇక నేను ఈ అవమానాలు భరించలేను. నా పిల్లల్ని తీసుకుని పుట్టింటికెళ్ళిపోతాన'ని గొడవ పడింది సుజాత. మధ్యలో అత్తయ్య రత్నం జోక్యం చేసుకుని "అసలే పంటలు పండక వాడు సమస్యలతో బాధపడుతున్నాడు. ప్రతిసారి నువ్వు పుట్టింటికంటూ వాడికి మనశ్శాంతి లేకుండా చేస్తున్నావ్! మొగుణ్ని ఎప్పుడు కొంగుకి ముడేసుకు పోదామాని, పెళ్లయినప్పటి నుంచీ ఎదురు చూస్తున్నావ్. మీయమ్మిలాగే! మీ నాన్నని ఇల్లరికం లాక్కొచ్చేసింది. ఇల్లరికానికి వెళ్లడం మా ఇంటా వంటా లేద'ని కోడలితో తరకానికి దిగింది. వాళ్లని వారించడానికి సీతాపతి కలగజేసుకోక తప్పలేదు.

"అమ్మా! మేము తరతరాలుగా ఈ భూమినే నమ్ముకుని బతుకుతున్నాం. ఎప్పుడూ ఇలాంటి కష్టాలెరగం. ఇవాళ ఏదో పరిస్థితులు కలిసి రాక భూమి పండలేదు. అలాని అన్ని వదులుకొని ఎక్కడికో పోదామంటే ఎలాగమ్మా? గేదె వట్టి పోయిందని కసాయోడికి అమ్మేయలేం! కదమ్మా" అన్నాడు కోడలితో.

"అది కాదు.. మావయ్యగారూ.. మనందరం బాగుండాలనే నా కోరిక. వ్యవసాయం కలిసిరాక మీరంతా ఎంత క్షోభ పడుతున్నారో! నాకు తెలియదాండి! మనం వెళ్లే దారిలో అడ్డంకులుంటే కొత్త తోవ ఎదుక్కోవడంలో తప్పులేదు కదా! కాస్త చదువుకున్నదానిగా నా అభిప్రాయం చెప్తున్నాను. అంతేగాని, మీ అందర్నీ చుట్టబెట్టుకుని మా ఊరికి తీసుకెళ్లి పోవాలనేది మాత్రం నా తాపత్రయం కాదండి." అని గద్గద గళంతో చెప్పేసి వంటింట్లోకి వెళ్ళిపోయింది సుజాత.

ఆ రాత్రంతా రాంబాబుకి నిద్ర పట్లేదు. తుండు భుజానేసుకుని పొద్దున్నే పొలం వెళ్ళాడు. రాత్రికి రాత్రే చేనుకి అగ్గి తెగులు సోకి, అప్పుడే పొడుస్తున్న పొద్దు కిరణాల్లో మాడిపోయిన చిగుళ్లు లీలగా కనిపిస్తున్నాయి. నిజమా? భ్రమా? అని కళ్ళు నులుముకొని మరోసారి చూశాడు. తన కళ్ళు చూస్తున్నది నిజమే! అనుకున్నాడు. ఒక క్షణం కూడా ఆలోచించకుండా ఎకాఎకీన మోటారు షెడ్లోకి వెళ్ళాడు. అప్రయత్నంగానే చేయి గూట్లో ఉన్న కలుపు మందు మీదకి వెళ్ళింది. మూత తీసి గడగడా తాగేయాలన్న ఆలోచన. తువ్వాలుతో కన్నీళ్లు ఒత్తుకుంటూ అయ్య సీతాపతి గుర్తొచ్చాడు. కుటుంబం దిక్కులేనిదయిపోతుందనుకున్నాడు. కాస్త ఆలోచించాడు. పొలం నుంచే నేరుగా వ్యవసాయ కార్యాలయానికి వెళ్ళాడు. కుర్చీలో ఠీవీగా కూర్చున్న ఆఫీసర్ ముఖంలో మొఖం పెట్టి ఆవేశంగా మాట్లాడాడు రాంబాబు. "రైతులు వరుసగా పంట తర్వాత పంట నష్ట పోతుంటే... ఏం చేయాలో పాలిపోక ఆత్మహత్యలు చేసుకుంటుంటే... చూస్తూ ఇక్కడ హాయిగా కూర్చోడానికా? ఈ అధికారులు, ఈ యంత్రాంగం" అంటూ ఊగిపోయాడు. ఆఫీసర్ రాంబాబు స్థితిని గమనించాడు. పరిస్థితిని అర్థం చేసుకున్నాడు. పక్కనే

ఉన్న కుర్చీ లాగి "ముందు మీరు కూర్చుని మాట్లాడండని" తనని సముదాయించి కూర్చోబెట్టాడు. గుమస్తా చేత ఓ గ్లాసుడు మంచినీళ్లు తెప్పించి తాగమన్నాడు. రాంబాబు శాంతించాక ఆఫీసర్ మాట్లాడటం మొదలెట్టాడు.

"చూడు రాంబాబు.. ఇప్పుడు నీకొచ్చిన వేదే రైతులందరికీ రావాలి. రైతులకే కాదు, మనుషులందరిలో రావాలి! లేకపోతే పంటలే కాదు! భవిష్యత్తులో మనంకూడా నాశనమయిపోతాం" అన్నాడు.

రాంబాబుకి ఆయన ఏం మాట్లాడుతున్నాడో అర్థం కాలేదు.

"ఔనయ్యా రాంబాబు! నేను చెప్పింది, నువ్వు విన్నది కరెక్టే" అన్నాడు ఆఫీసరు. రాంబాబు మౌనం వహించాడు. "ఎన్నిసార్లు మొత్తుకున్నా వినకుండా అధిక దిగుబడి కోసం విచ్చలవిడిగా రసాయన ఎరువులు వాడేస్తున్నారు. మితిమీరి కలుపు మందులు, ఇష్టారాజ్యంగా క్రిమిసంహారక మందులు వేసేసి రసాయన కాలుష్యాన్ని పెంచేస్తున్నారు. పర్యావరణ సమతుల్యానికి తూట్లు పొడిచేస్తున్నారు. ఇబ్బడిముబ్బడిగా వాడేసి పరిసరాలను ప్లాస్టిక్ మయం చేస్తున్నారు. మన దుర్మార్గానికి భూమి, నీరు, వాయువు ఇలా సర్వం కలుషితమై పోతున్నాయి. కాలుష్యంతో భూతాపం పెరిగిపోయి వాతావరణంలో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇక కురవాల్సిన సమయంలో వానలు పడక, అవసరం లేనప్పుడు అకాల వర్షాలు సంభవిస్తూనే ఉంటాయి. ఇకనైనా మనం మారకపోతే భవిష్యత్ అంతా ప్రమాదమే!" అంటూ ముగించాడు ఆఫీసర్.

"ఇప్పుడు నేనేం చేయాలి సూటిగా చెప్పండ"న్నాడు రాంబాబు." "ప్రకఅతి వ్యవసాయం చేయాల"న్నాడు ఆఫీసర్. "నా ఒక్కడితోనే అంతా మారిపోతుందా?" అన్నాడు రాంబాబు. "రాజుగారి గంగాళంలో పాలకు బదులు అందరూ నీళ్లే పోసినట్టు, ప్రతి ఒక్కరూ నేనొక్కడినే అనుకుంటే పరిస్థితి ఇలాగే చేయి జారిపోద్ది. ఎప్పుడో ఒకప్పుడు... ఎక్కడో కక్కడ... నీలాంటి వాళ్ళ ద్వారా మార్పు మొదలు కావాలి" అన్నాడు ఆఫీసర్.

ఒక సందిగ్ధ స్థితిలో ఇంటికొచ్చేశాడు రాంబాబు. మంచం మీదున్నా అతనికి నిద్ర రావడం లేదు. మనసంతా అల్లకల్లోలం. దీంతో రాత్రంతా జ్వరం కమ్మేసింది. ఉదయాన్నే మూర్తి డాక్టర్ వచ్చి ఇంజక్షన్ చేసి మందులిచ్చాడు. రెస్ట్ అవసరమని సలహా చెప్పాడు. మూర్తి డాక్టర్ ఆ ఇంటి నాడి తెలిసిన కుటుంబ వైద్యుడు. కుటుంబమంతా ఆయనతో కష్టసుఖాలు పాలుపంచుకుంటున్నారు. "మా బాధలు మాకుంటే కోడలు పిల్లేమో అస్తమానూ వాళ్ళూరికి కాపురం వచ్చేయమని, మా వాడికి ఒకటే నసండి. అసలు సమస్య కంటే మాకు ఇది పెద్ద బాదయిపోయిందండి డాక్టర్ గారు" అంది రత్నం. రాంబాబు అందుకుని "ఊరు వదిలి అత్తారింటికి వెళ్ళడమంటే నాకు కుదరదండి! 'ఇల్లరికం వెళ్ళిన అల్లుడు – చేలోని పాలేరోడు పరిస్థితి ఒకటే!" అన్నాడు రాంబాబు.

"పెళ్లయి ఇన్నేళ్లయింది. ఇన్నాళ్ళలో నేనెప్పుడైనా మా ఊరెళ్ళి పోదామన్నానా? ప్రస్తుతం ఇక్కడ పరిస్థితులు బాగోలేదు కదా! మా ఊళ్లో అందరికీ చేతినిండా పని ఉంటుంది. ఉపాధి బాగుంటుంది. ఎంతోమంది ఆ ఊరు వలసొచ్చి బతుకుతున్నారు. కొన్నాళ్ళు అక్కడుండి పరిస్థితులు చక్కబడ్డాక తిరిగి వచ్చేద్దామంటున్నాను. ఇదేమైనా తప్పా? డాక్టర్ గారు మీరే చెప్పండి!" అంది సుజాత.

మూర్తి డాక్టర్ నిర్లిప్తంగా నవ్వుతూ రాంబాబు వైపు తిరిగి ఇలా అన్నాడు : "చూడు! రాంబాబు ఇవాళ ఉపాధి కోసం మహాసముద్రాలు దాటి ఇతర ఖండాలకు వెళుతున్నారు. హాయిగా బతుకుతున్నారు. ఈ నేలను వదిలి వెళ్ళనంటున్నావు. ఎక్కడైనా భూమి ఒకటే!" అన్నాడు డాక్టర్.

"చదువుకున్నోళ్ళు, నోట్లో అక్షరం ముక్కున్నోళ్ళు బతకాలంటే ఎక్కడికైనా వెళ్లక తప్పదు! కానీ మేము పొలం దున్నుకునే వాళ్ళం. ఎక్కడపడితే అక్కడకి చేను పట్టుకుని పోలేం కదండీ!" అన్నాడు రాంబాబు.

"కూపస్థ మండూకం లాగా ఇదే నా స్వర్గం అనుకుంటే కుదరదు. ఎవ్వరైనా ఎక్కడ ఉపాధి దొరికితే... అక్కడికి పోవాల్సిందే! ఇది ఆధునిక బతుకు తంత్రం. ఇప్పటికే అప్పుల్లో... కూరుకుపోయారు. ఇంకా ఇలానే కొనసాగితే మీరు కూడా మిగలరు." అని తనకున్న చనువుతో గట్టిగానే చెప్పాడు డాక్టర్. కాస్త మెత్తబడ్డ రాంబాబు. "కానీ... డాక్టర్ గారూ" అని ఏదో చెప్పబోయాడు.

"ఇక నువ్వేం చెప్పకు రాంబాబు. అమ్మాయి పదేపదే అడుగుతోంది కదా! కొన్నాళ్ళు వెళ్ళచ్చుగా! తప్పేముంది? బాగోపోతే అప్పుడే తిరిగి వచ్చేద్దురు. నాది మాత్రం! ఈ ఊరా! ఏంటీ? ఏదో చుట్టపుచూపుగా వచ్చాను. ఊరు ఆదరించింది. ఇప్పుడు మీలో ఒకణ్ణైపోలా?" అన్నాడు డాక్టర్.

ఆయన వెళ్ళాక కాసేపటికి మెల్లగా నోరిప్పాడు సీతాపతి. "ఒరే నాయనా! మీరు కొన్నాళ్లు ఊరెళ్ళడం మంచిదని నాక్కూడా అనిపిస్తుంది. అమ్మ, నేను ఇక్కడ ఏదోలా కాలం గడుపుతాం! పొలం ఎవరికైనా కౌలుకిద్దాం." అన్నాడు.

"అయ్యా.. మిమ్మల్ని వదిలి నేనెలా?" అని ఏదో చెప్పబోయాడు రాంబాబు.

"ఇక నువ్వేం మాట్లాడకు. ఈసారికి నా మాటిను!" అని అజమాయిషీలాగే చెప్పాడు తండ్రి. పితృవాక్ పాలకుడై తన సంసారం రథాన్ని అత్తారింటి వైపు దారికి మళ్లించాడు

రాంబాబు.

♦ ♦ ♦

అత్తోరూరికి మకాం చేరిన రాంబాబు ఇరుగుపొరుగుతో కలిసి పూలతోటల్లోకి పనికెళుతున్నాడు. ఇన్నాళ్ళు ఒక రైతులా బతికి ఇపవిడెవరి పొలంలోనో పనిచేస్తున్నానన్న న్యూనతా భావం అతనికి మొదట్లో ఉన్నా కొద్ది రోజులకే దూరమైంది. పెద్దా చిన్నా, ఆడ మగ, ధనిక పేద బేధమన్నది లేకుండా అందరూ కలిసి కష్టపడే తత్వం రాంబాబుకి ఎంతగానో నచ్చింది. కర్షక, కార్మిక శ్రమ జీవన సౌందర్యంతో వికసిస్తున్న విరి సోయగాలు గాయపడ్డ అతని హృదయానికి లేపనాలు పూస్తున్నాయి. ఎకరాలున్న ఆసామైనా, సామాన్య కూలీయైనా చేలో దిగి అంతరాలు లేకుండా కలిసి పనిచేయటం, అవసరాన్ని బట్టి ఒకరి పొలానికి మరొకరు బదలాయింపు పనులకు వెళ్ళి సహాయం చేసుకోవటం వంటి ఊరి పడికట్లు రాంబాబుని చాలా ఆకట్టుకుంటున్నాయి. ఏ ఇంట చూసినా బంతి, చామంతి, గులాబీ, కనకాంబరం, మల్లి జాజులు వంటి రంగురంగుల పూల గుట్టలు, వాటి చుట్టూ మండి కట్టి మాలలల్లే మహిళల మనోహర దృశ్యం అతని మనసుని ముచ్చట గొలుపుతోంది. అతివల నవ్వులే పువ్వులై విరుస్తున్నాయా? లేక పువ్వులే వారి ముఖాల్లో నవ్వులై కురుస్తున్నాయా? అనిపించేలా ఆ దృశ్యాలు రాంబాబు కళ్ళని కట్టిపడేస్తున్నాయి. మహిళలు మునివేళ్ళు చకచకా కదిలిస్తూంటే క్షణాల్లో మూరలు, బారలు పూలమాలలు ప్రత్యక్షమవుతున్నాయి. వారి హస్తలాఘవ నైపుణ్యానికి ఫిదా అయిపోతున్నాడు రాంబాబు. సుజాత కూడా ఈ పనులన్నిటిలో ఆరితేరిన ఆ ఊరి పిల్లే కదా! తనూ ఇంటి దగ్గర ఇరుగుపొరుగునేసుకుని పూలు కడుతూ చేతినిండా సంపాదిస్తోంది. సహజంగా పనివంతుడైన రాంబాబు అప్పులు తీర్చాలని కసితో రాత్రి పగలు కష్టపడుతున్నాడు. కష్టానికి తగిన ప్రతిఫలం దక్కుతోంది. తోటల్లో పనితో పాటు కోసిన పూలను, గుచ్చిన దండల్ని మార్కెట్‌కి తరలిస్తూ క్షణం తీరిక లేకుండా బిజీ అయిపోయాడు. నాలుగు నెలలకే రాంబాబు ఊరంతా అల్లుకు పోయాడు. రెండెకరాల భూమిని శిస్తుకి తీసుకుని సొంతంగా పూలసాగు మొదలులెట్టాడు. ఆసరా కోసం అమ్మానాన్నల్ని ఈ ఊరికి తీసుకొచ్చేశాడు. ఇటు తోటల సాగు, అటు పూల వ్యాపారం రెండు చేతులా సంపాదనే. రోజూ మరో పది మందికి పని కల్పిస్తున్నాడు. ఇప్పుడాయిల్లు ఆనందాల హరివిల్లు. ఆ కుటుంబం మళ్లీ చిగురిస్తున్న మమతల కదంబం. చేలో పని ముగించుకుని రోజూలాగే రాంబాబు పువ్వులు తీసుకుని మార్కెట్‌కి వెళ్ళాడు. షావుకారు నెల రోజుల పట్టి లెక్కకట్టి మొత్తం రాంబాబు చేతిలో పెట్టాడు. లగ్గసరి సీజన్



కావడంతో పూల ధర ఎక్కువే పలికింది. రాంబాబు ఊహించిన దానికంటే చాలా పెద్ద మొత్తంలో డబ్బులు ముట్టాయి. కష్టం కురిపించిన కాసులు జేబులు నిండి తిరిగి ఇంటికి వస్తున్న అతని ఆనందానికి అవధుల్లేవు. ఆలోచనల్లో అతనికి గతం కళ్ళల్లో కదలాడింది. పుట్టినూరికెళదామన్న సుజాతపై తాను కోప్పడ్డ సన్నివేశాలన్నీ పదేపదే గుర్తొస్తున్నాయి. భార్యని సరిగ్గా అర్థం చేసుకోలేకపోయానన్న భావన అతని గుండెల్లో బరువెక్కిపోయింది. ఇంటికెళ్లగానే ఆమెకు క్షమాపణతో భారం దించుకోవాలనుకున్నాడు. ఇంటికి చేరేసరికి ఆ రాత్రి కాస్త పొద్దుపోయింది. అమ్మా, నాన్న, పిల్లలిద్దరూ గదిలో హాయిగా నిద్రపోతున్నారు. తన చూపుల్ని చేతిలో ఉన్న సూదికి అనుసంధానించేసి, మనసు దారానికి అన్ని, పక్క అలికిడి కూడా పసిగట్టలేనంత ఏకాగ్రతతో ఆ పడిమీద పూలల్లికలో నిమగ్నమైపోయింది సుజాత. ఆమెను చూసి రాంబాబు కళ్ల చెమర్చాయి. “ఇల్లరికం అంటే కొంగు పెత్తనమనుకున్నా. ఇంటావిడ కొండంత త్యాగమా?!” అనుకున్నాడు. నెమ్మదిగా ఆమె దగ్గరకి అడుగులు వేశాడు. డబ్బు కట్టలు తీసి ఆమె కడుతున్న పూలబుట్టలో ఉంచాడు. రెండు భుజాలు పట్టి ఆమెను సుతారంగా పైకి లేవదీశాడు. గంపలో గులాబీ దండను ఆమె మెడలో వేసి ఆసాంతం గట్టిగా దగ్గరికి తీసుకున్నాడు. అతని ఎద చెప్తున్న మూగభాషేదో ఆమెకు చేరింది. ■

# 'బేల'చంద్రుడు

**వా**డు సగం తడుస్తూ సగం వెలుస్తూ
రాత్రి వెన్నెల్లో ... వేదనా నిశీధినేలే
చుక్కల ప్రశ్నల శూన్యం కన్నుల్లో

అమ్మ చెంగులాంటి కుప్పతొట్టి పక్కనే
కునుకు'పాట్లు'తో..
ఎలా వుంటారో తెలియని
అమ్మానాన్నల ఒడిలో
కలల ఊయలూగుతూ..
కన్నవాళ్లతో నిండిన ప్రేమగూళ్ల ముందు
దిగులు తోరణమై

రేపటి పయనం
నిన్నకి ప్రతిరూపమా అనే
బాధల సెగ చిమ్ముతూ ...
తన ఉనికిని గుర్తించని సమాజ చిత్రంపై
కోపాన్ని నమిలి ఉమ్ముతూ ...
వనాన్ని వరించిన వసంతంలా
మంచితనమొకటి గుండె తలుపులు తెరిచి
సేదతీరమన్నప్పుడు

గుమ్మానికి తలవంచి
గొంతు పగిలేలా అరచి
వీధంతా వినేలా చెబుతాడు
ఓ మనిషి చేసిన మకిలి
మరో మనిషి తుడుస్తాడని
మానవత్వమై గెలుస్తాడని!

**- గొర్తి వాణిశ్రీనివాస్**
**94413 45651**





# అంకెలు - అక్షరాలు

**అం**కెలు, అక్షరాలు...
అంకెలు – జీవనానికి,
అక్షరాలు – జీవితానికి.

మదినీ, మతినీ
కలుపుతూ కట్టిన వంతెనలా
బతుకు బండికి
వలపల దాపలా
ఊపిరి గట్టుకి
ఇవతల అవతల,
ఉనికి నాణేనికి
ఇటుగా అటుగా
కొన్ని అంకెలు
మరికొన్ని అక్షరాలు

అక్షరాలు కడుపు నింపలేక
అంకెలు ఆత్మని వెలిగించలేక ...
అంకెల్ని తరుముతూ, తడుముతూ
దిగులు పగళ్లు, పగులు దిగుళ్లు...
అక్షరాల అర్ణవంలో కలియదిరుగుతూ
కలలు నిండిన రాత్రులు, రాత్రి నిండా కలలు.

**- మల్లారెడ్డి మురళీ మోహన్**
**88611 84899**



# కవిత్వం కన్నా కాంతిమంతుడు

- ప్రసాదమూర్తి
84998 66699

**క**వులూ కళాకారుల్లోనూ ఇంత అమాయకులు ఉంటారన్న మాట. ఇది శీలా వీర్రాజు గారిని నేను మొదటిసారి చూసినప్పుడు అనుకున్న మొదటి మాట. దాదాపు పది కథా సంపుటాలు, పది కవితా సంపుటాలు, నాలుగైదు నవలలు ప్రచురించిన తెలుగు వారి ఇష్టమైన చిత్రకారుడు. అంతే కాదు, కవిత్వంలో కథలు, ఆత్మకథలు, నవలలు రాసిన తొలి ప్రయోగశీలి (బహుశ చివరి కూడా) శీలావీ. మరి ఆయనెంత ఆర్భాటం పోవాలి? తల ఆకాశం వైపు తప్ప భూమ్మీద దాని నీడ కూడా పడకుండా ఎంత గర్వపోవాలి? అబ్బే ఆయనేం నేర్చుకోలేదల్లే ఉందిక్కడ. ఇది నా రెండో ఇంప్రెషన్. వచన కవితా పితామహుడు కుందుర్తి పేరు మీద ఇచ్చే అత్యంత ప్రతిష్టాకరమైన ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డు ఆయన చేతుల్లోనే ఉంది. సాహిత్య అకాడెమీ అవార్డు దాని ముందు గాడిద గుడ్డు అని కవులంతా అనుకునే రోజులున్నాయి. మరలాంటి మంత్ర దీపంలాంటిది తన అధీనంలో పెట్టుకుని ఎన్ని మంత్రాంగాలు సాగించవచ్చు? కానీ ఈయనేం చేశాడు? ఆ పురస్కార నిర్ణయాన్ని న్యాయంగా న్యాయమూర్తులకు వదిలేసి కేవలం అవార్డు మెమెంటో మీద అందంగా తన చేత్తో పురస్కార గ్రహీత నామాన్ని చెక్కే పని మాత్రమే తన చేతుల్లో ఉంచుకున్నారు. ఆ తర్వాత సభాకార్యక్రమ తంతునంతా నడిపించే బస్తాల భారాన్ని తన నెత్తికి ఎత్తుకున్నాడు. తలుచుకుంటే కవిలోకాన్ని తానుంటున్న వీధినంతా ఊడ్చమంటే ఎంచక్కా ఊడ్చి పెట్టే వారే. అబ్బే అంత తెలివి లేదు. ఇది ఆయన మీద నా మూడో కామెంట్. కవుల్ని ఇంత లోకువ చేసి మాట్లాడుతున్నానని నా మీద ఆగ్రహించకండి సుమా! కొందరెప్పుడూ మినహాయింపే కదా. సాధారణీకరించినప్పుడు అసాధారణ వ్యక్తులు అందులో చేరరు.

నా మూడో కవితా సంపుటి నాన్నచెట్టుకు నూతలపాటి గంగాధరం అవార్డు వచ్చింది. అప్పుడు గానీ కవిత్వానికి అవార్డులిస్తారని, అవి అందుకుంటే వచ్చే కిక్కు ప్రపంచంలో ఏ పురాతన ఫ్రెంచి మద్యానికీ సాధ్యం కాదని అర్థం కాలేదు. అదేదో ముందే తెలిస్తే అసలు పుట్టకముందే ఫ్రీవర్స్ ఫ్రంట్‌కి అర్జీ పెట్టుకునేవాడిని. అన్యాపదేశంగా నా మనసులోని మాట ఆయనకు అందే వుంటుంది. ఏ పుణ్యాత్ముడో న్యాయమూర్తిగా ఆయనకు నా పేరు చెప్పి పుణ్యం కట్టుకున్నాడు. అందుకే నా నాలుగో కవితా సంపుటి పూలండోయ్ పూలు ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డుకి ఎంపికైంది. శీలా వీర్రాజు గారు కథల కోసం కలం ఝుళిపించిన కాలానికి నేను కన్ను కూడా తెరవలేదు. ఆయన మొదటి కథాసంపుటి వచ్చిన ఏడాదే నేను ఈ భూమ్మీదకు రావడం జరిగింది. కానీ నేను పుట్టి ఏభయ్యేళ్ళు అయిన తర్వాత మొదటిసారి ఆయన్ని చూశాను. ఇది దుర్మార్గం. నిజంగా ఆయన్ని ఇంతకాలం నేను చూడలేకపోవడం దుర్మార్గం.

బీహారులో ఉద్యోగం కారణంగా చాలామంది గొప్ప కవులూ రచయితలూ కళాకారులూ పేర్ల ద్వారానే నాకు పరిచయం కానీ, వారిని దర్శించుకునే భాగ్యం నాకు దక్కలేదు. ఒకసారి శివారెడ్డి గారు తీసుకు వెళ్ళి ఆయనకు పరిచయం చేశారు. అప్పుడు నేను హైదరాబాద్‌లో టీవీ మీడియాలో ఉన్నాను. అప్పటికి నేను నాలుగు కవితా సంపుటాలు తీసుకు వచ్చాను. ఆయన్ని, ఆయన సహచరి సుభద్రాదేవి గారిని చూశాను. బీహార్‌లో ఉండగా నలందా వెళ్ళినప్పుడు, బుద్ధ విగ్రహాలను చూసినప్పుడు కలిగినంత మానసిక నైర్మల్యం కలిగింది. పుణ్య దంపతులంటే వీరే కాబోలు అని అనుకున్నాను. సుభద్ర గారిని అక్కా అని పిలవాలనుండేది. కానీ అంత ధైర్యం చేయలేదు. అందుకు నాకు అర్హత కూడా

కావాలి కదా. తర్వాత ఎప్పుడో నేను వాళ్ళింటికి టెన్ టీవీలో ఇంటర్వ్యూ కోసం కెమెరా హంగూ ఆర్భాటంతో వెళ్ళాను. వారితో మాట్లాడుతున్నంత సేపూ ఏ దేవతా మూర్తులతోనో ముచ్చటిస్తున్నట్టు లోపలేదో భయం అణకువ మర్యాద గౌరవం భక్తి. ఆ తర్వాత కొన్నిసార్లే వారింటికి వెళ్లాను. మధ్య మధ్యలో ఫోన్లు ఎలానూ ఉన్నాయి కదా.

2019 ఆగస్టు 1న నా అరవయ్యో పుట్టినరోజు నా సాహితీ మిత్రుల సమక్షంలో సెలబ్రేట్ చేసుకోవాలనుకున్నాను. నా సెలెక్టెడ్ పోయెమ్స్ పుస్తకం, నా తొలి కథా సంపుటి, నా మీద సాహితీ మిత్రులు రాసిన వ్యాసాల పుస్తకం ఆరోజే విడుదల చేయాలనుకున్నాను. ట్రెడిషనల్ ఆవిష్కరణ కాకుండా ఏ ఉపన్యాసాలూ లేకుండా పెద్దల చేతుల మీదుగా వాటిని విడుదల చేయాలనుకున్నాను. ఇంటికి వెళ్ళి ఆ ఆదర్శ దంపతుల్ని ఆహ్వానించాను. వీర్రాజు గారు కష్టపడి వచ్చి వేదిక మీద కూర్చుని రెండు ముక్కలు నా పుట్టిన రోజు అభినందనలు చెప్పి ఇది సిక్స్టీ పూర్తి అని చమత్కరించి నన్ను నిండు మనసుతో ఆశీర్వదించారు. ఆ తర్వాత రెండేళ్ళు కరోనా కల్లోలం ఎవరికి ఎవరులే అన్నంత వైరాగ్యం సృష్టించింది. ఆ సమయంలోనూ నేను అప్పుడప్పుడూ ఎక్కువగా సుభద్రగారికే ఫోను చేసి వారి ఆరోగ్యం ఆరా తీసేవాడిని. చూడ్డానికి వెళ్ళలేదు. అది నా దౌర్భాగ్యం.

నాకు తెలిసి తెలుగులో బుచ్చిబాబు, గోపీచంద్ సరసన నిలబెట్టాల్సిన రచయిత, కవి శీలావీ. వాస్తవంగా ఆయన ఆ స్థానాన్ని పొందారా? అది పరిశోధకులే తేల్చాలి. చిత్రకారుడిగా అనేక వేల పుస్తకాల ముఖచిత్రాల్లోనే ఆయన మిగిలిపోయారా లేక ఇంకెక్కడో ఉండాల్సిన కళాకారుడు అక్కడ లేకుండా పోయాడా? ఇదీ భావితరాలు తేల్చాలి. అన్నింటికంటే ఆయన వ్యక్తిత్వమే ఆయన పేరు ప్రఖ్యాతులకు అడ్డంకిగా మారిందా అన్న సందేహం కూడా కొంచెం లేకపోలేదు. వ్యక్తిత్వం అంటే కీర్తి ప్రతిష్టల కోసం పాకులాడే దిగజారుడుతనం లేని వ్యక్తిత్వం. ఏ కాలంలో ఉన్నామో ఆ కాలజ్ఞానాన్ని అకాల జ్ఞానం అనుకునే అమాయకత్వం. కళకు కళే పురస్కారం అని నమ్మే కళాతత్వం. అతి నిరాడంబరత్వం.

అతి చిన్నతనంలోనే అతి సామాన్య కుటుంబంలో పుట్టి పొట్ట పట్టుకొని భాగ్యనగరానికి వచ్చి అతను రాసిందాని కంటే అతను చూసిందే అనంతమై వుంటుంది. ఏ రంగుల్ని చూశాడో అవి తన బొమ్మల్లో ఒదిగాయో లేదో. ఏ చీకట్లలో వెలుగుల్ని.. ఏ వెలుగుల్లో చీకట్లనీ చూశాడో అవి తన రచనల్లో ప్రతిఫలించాయో లేదో. మనుషుల మధ్య మృగాలనీ, మృగాల మధ్య మనుషుల్నీ.. ఏ నీడల గోడల మీద తారాడిన సత్యాసత్య దోబూచులాటల్నీ చూశాడో.. అవన్నీ తన రాతల్లో ప్రత్యక్షమయ్యాయో లేదో. అంత చిన్నప్పుడే మైనా లాంటి అంత గొప్ప నవల రాసినందుకైనా కొంతైనా ఈ సాహితీలోకం గౌరవించుకుందా? ఎప్పుడూ సత్యం వైపే, ఎప్పుడూ ప్రజల వైపే, ఎప్పుడూ మంచీ మానవత్వాల వైపే నిలబడ్డ ఒక గొప్ప నిబద్ధత గల ఆజీవన సాహితీ మూర్తిని ఈ లోకం తన నెత్తి మీద పెట్టుకుందా? ప్రశ్నలు ఎవరి మీదా వేయలేం. అయినా పురస్కారాలు కొలమానాలు కాదని నమ్మే నిప్పులాంటి కళాకారుడి గురించి ఇప్పుడీ చప్పుళ్ళు అనవసరం. బుచ్చిబాబు గారు శీలావీ రంగుటద్దాలు కథల సంపుటికి రాసిన ముందు మాట (1963)లో చెప్పిన మాటలు ఎప్పటికీ ఆయన వ్యక్తిత్వాన్ని పట్టిస్తాయి. అరవై ఏళ్ళ క్రితం రాసిన మాటలు ఆయన అంతిమ ఘడియల దాకా సజీవంగానే ఆయన్ని అంటిపెట్టుకుని ఉన్నాయి. అవి ఎప్పటికీ శీలావీని బతికిస్తాయి.

'ఆదర్శం పట్ల ఉద్రేకం రేకెత్తించగల కథకుడు వీర్రాజు. ఆ ఉద్రేకంలో తను కొట్టుకుపోడు. గట్టున నిలబడి కొట్టుకుపోతున్న ప్రవాహాన్ని కారుణ్యంతో తిలకించగలడు. తెలుసుకున్న దాన్ని అందంగా చెప్పగలడు. ఎవర్నీ ఉద్ధరించాలన్న ఉబలాటం లేదు. తనకి నచ్చని వాటిని నరుకుదామని కత్తికి పదును పెడుతూ కూర్చోడు. ఒక్క కథతో సంఘాన్ని మరమ్మతు చెయ్యాలన్న దురుద్దేశం లేదు. కోపగించుకోడు. బాధపడతాడు.' అదీ వీర్రాజు వ్యక్తిత్వం. చూస్తాడు.. తెలుసుకుంటాడు.. బాధపడతాడు.. చెప్తాడు. మళ్ళీ చూస్తాడు తెలుసుకుంటాడు.. బాధపడతాడు.. చెప్తాడు. అదీ స్థితప్రజ్ఞత అంటే. బుద్ధుడు చెప్పిన శీలం.. సమాధి.. ప్రజ్ఞ అంటే మన ఆధునిక కాలంలో ఆ మూడు లక్షణాలకు ప్రతిరూపంగా శీలావీని చూపించవచ్చు. ఆయన చనిపోయిన రోజున నేను ఫేస్‌బుక్‌లో పోస్టు చేసిన నాలుగు లైన్లు ఇక్కడ గుర్తు చేసుకుంటూ ఆయనకు నా నివాళి అర్పిస్తాను.

మనలాగే ఉంటాడు గానీ మౌనిలాంటి వాడు
కవే గానీ కవిత్వం కంటే కాంతిమంతుడు
కథకుడే గానీ కథలను దాటిన పథికుడు
చిత్రకారుడే గానీ ఏ రంగులూ తనకు అంటనివ్వని ఆదిమ కళాకారుడు
మంచితనం పర్యాయపదాలన్నింటి పరమార్థంలాంటి వాడు
కాలం కాని కాలంలో పుట్టి కాలాన్ని నివ్వెరపరచినవాడు
వెళ్ళిపోయాడు మరో కాలంలోకి మౌనంగా
మన మంచి మిత్రుడు.. సచ్చరిత్రుడు
శీలా వీర్రాజు
నివాళులు తండ్రీ.. ■



## ఆఖరి ఆయుధం!

**క**న్నీటిలో కుంచెను ముంచి
గుండె గోడ మీద
కిటికీ రెక్కల్ని గీశాను
యుద్ధం ముగిసిందో లేదోనని
మెల్లగా ఓ రెక్కను తెరిచి చూశాను

లోపలికి చూస్తే పారుతున్న నెత్తుటేర్లు!
వెలుపలికి చూస్తే కాలుతున్న పూల తలలు!

యుద్ధం ముగియలేదు

నేలకూలే బుగ్గి పొగలా
స్వప్న శిథిలాలు..
నింగి బాధలా జేగురుగా
నిప్పు కన్నీళ్లు..
నీటి దుఃఖంలా తడి తడిగా
మృత్యువు..

యుద్ధాన్ని ముగించే
ఆఖరు ఆయుధం మృత్యువేనా?

– కంచరాన భుజంగరావు
94415 89602

## నేనూ వలస పక్షినే ...


**ప**క్షికి భూమి మొత్తం దాని ఇల్లే
ఆకాశం మొత్తం ఆట స్థలమే
భూమ్యాకాశాల వ్యత్యాసం చూడని
విలాస స్వేచ్ఛా జీవితం దాని స్వంతం
పక్షికి మనసంతా దాని రెక్కల్లోనే వుంటుంది
ఎగరడం దాని మాతృభాష.. గాలి దాని ప్రియ నేస్తం!

మనుషుల్లో తెల్లోళ్లు నల్లోళ్లు గోధుమ వన్నెలోళ్లున్నట్లు
పక్షుల్లోనూ ప్రకృతి తీర్చిదిద్దిన జాతులుంటాయే కానీ
మనంత నీచంగా కుల మత వర్ణ హింసల్లేవు
అందుకే నాకు పక్షి ఆదర్శం!

పక్షిని చూసే మనిషి వలసలు నేర్చుకొని వుంటాడు
మనిషి వలసలన్నీ
అతని పొట్టలోనే పురుడు పోసుకుంటాయి
ఎడారులూ నదీ నదాలు సముద్రాలు లోయలు అడవులు
దాటుకొనే మనిషి నాగరికుడయ్యాడు
కానీ పక్షంత ఉన్నతంగా మనిషి లేడుగా!
మనిషి నాగరికతలో పక్షి స్వేచ్ఛ లేదుగా మరి
స్వేచ్ఛ లేని తావులో శాంతి ఎక్కడుంటుంది?
అందుకే మనిషి సరిహద్దులు గీసుకున్నాడు
దేశాలకే కాదు మనిషికీ మనిషికీ మధ్యన కూడా!

జీవితం మీద ప్రేమతో
విశాలంగా జీవించాలన్న కాంక్షతో
ఖండాలన్నీ దాటుతున్నప్పుడు మూరెడు పక్షికి
భూగోళం మొత్తం
తను పొదిగే గుడ్డులా కనబడుతుంది
మనుషుల కుట్రలు, యుద్ధాలు, ఘోరాలు,
విధ్వంసాలు, రక్తపాతాలూ తెలియని
పక్షి హృదయమే నాది కూడా
నన్ను గాయపరిచే మనుషుల్నుండి
నేనూ వలస పోతుంటాను
ఓ అందమైన గూటి అన్వేషణలో
నా హృదయానికి ఉన్న రెక్కలు
నా శరీరానికి లేవు!

**- రజిత కొండసాని**
99492 95459




# విరగ్గాసిన కథావృక్షాలు

- కవితశ్రీ
94946 96990

కరువుగడ్డ అనంతపురం జిల్లా రచయిత్రులంతా సాహసం చేసి 'ముంగారు మొలకలు' అనే పేరుతో ఒక కథాసంపుటి తీసుకువచ్చారు. ఉమ్మడి అనంతపురం జిల్లా ముక్కలు కాక మునుపే పుస్తకం తేవాలన్న తమ ఆకాంక్షని కూడా నెరవేర్చు కున్నారు. డా.యం.ప్రగతి, జి.నిర్మలారాణి, బి.హేమమాలినిల సంపాదకత్వంలో ఈ పుస్తకం వెలువడింది. ప్రగతి ఇటీవలే పదోన్నతి పొంది హిందూపురం మహిళా డిగ్రీ కళాశాలల్లో ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వారు ప్రగతిశీలవాది కావడంతో తల్లిదండ్రులు పెట్టిన పేరు సార్థకమైంది. ఈ రచయిత్రులు తమ పుస్తకానికి 'మొలకెత్తుతున్నాం' అని ముందు మాట రాసుకుని 'ముంగారు మొలకలు' అని పేరు పెట్టడానికి కారణాల్ని చెప్పుకున్నప్పటికీ అవి అన్నీ ముంగారు మొలకలు కావు. కథనంపరంగా చూసినా, శైలిపరంగా చూసినా అధికభాగం కోతకొచ్చిన పంటచేలు. కాన్సెప్ట్‌పరంగా చూస్తే కొమ్మలు నేలకు వంగేలా బాగా విరగ్గాసిన వృక్షాలు. ఋతువు కొచ్చిన పళ్ళు. ఒకరిద్దరు కొత్తవాళ్ళైనప్పటికీ 'ముంగారు మొలకలు' కథకులందరూ బాగా చెయ్యితిరిగిన రచయితలే.

ముంగారు మొలకల్లో మొదటి కథ అమళ్ళదిన్నె పద్మజ గారి 'ముసుగు తీసిన హేతువు' వాస్తుని, వాస్తు చుట్టూ అల్లుకున్న మూఢ విశ్వాసాలనీ ఒక బలమైన కారణంతో పటాపంచలు చేసింది. 'పరిణీత' సి.ఎం.అనురాధ రాసిన కథ. ఈ కథ మానవ సంబంధాల పట్ల మనసు గజిబిజిగా ఉండే టీనేజీ పిల్లలకి దురుసుగా కాకుండా నెమ్మదిగా విడమర్చి చెప్పడంవల్ల వాళ్ళు తప్పటడుగులు వెయ్యకుండా జీవితాల్ని దిద్దుకునేలా చెయ్యొచ్చని చెబుతుంది. భాస్కర బాలభారతి రాసిన 'మెరవణి', హెచ్.కె.ఫైరోజా బాను రాసిన 'బతుకుపోరు' నిజంగానే ముంగారు మొలకలు. ఐనా వాళ్ళ వాక్యాల్లో స్పార్క్ ఉంది. రచయితలుగా మంచి భవిష్యత్తుంది.

చేలూరి రమాదేవి రాసిన 'ఊర్కుండి ఎల్లగొడదాం' కథ, కథనం, సైద్ధాంతిక బలం ఉన్న కథ. ఈ కథ సారా, సారాతో నడిచే ఎన్నికలు, సారా తోడి ఎన్నికల రాజకీయాలతో బుగ్గి పాలయ్యే బంగారు బతుకులను చక్కగా కథనం చేసి పరిష్కారం చూపింది. బతుక్కీ ప్రకృతికీ ఉన్న బంధాన్ని ప్రతీకాత్మకంగా, మానవ సంబంధాల్ని ఉద్వేగభరితంగా వర్ణించడం ఈ కథకున్న అదనపు బలం. ఆచార్య దేవకి గారి కథ 'సంపూర్ణక్క – తవుసుమాను' 'మంత్రాలకు సింతకాయిలు రాలవు' అని నిరూపించింది. మాధ్యమాల పుణ్యమా అని కనుమరుగైపోతున్న గ్రామీణ మాండలిక (చిత్తూరు) భాషని రికార్డు చెయ్యడం ఈ కథ చేసిన గొప్ప పని. కాకి అరుణ కథ 'సాబువ్వ' కూడా ఒక నలభైయేళ్ళ నాటి గ్రామీణ మాండలిక (అనంతపురం–కర్నూలు) భాషని రికార్డు చేసింది. అన్నపానీయాలతోడి ఆ నాటి బతుక్కీ ఈ నాటి బతుక్కీ తేడాని వర్ణించింది. పి.షహనాజ్ రాసిన 'అమ్మకో గూడు' కథ వయసు మీద పడి ఇంటిలో అనాదరణకు గురైన ఒక తల్లి స్వతంత్రేక్షని, ఆమె తన ఉ నికిని కాపాడుకున్న తీరుని చక్కగా వర్ణించింది.

ఉన్నమట్ల స్వర్ణకుమారి 'బతుకుబరువు' కూడా ఇలాంటిదే. పోరాల శారద కథ 'నారాయణమ్మవ్వా' కూడా ఆ కోవలోనిదే ఐనా ఇందులో నారాయణమ్మవ్వ తన కాళ్ళపై నిలబడి తాను బతకడమే కాకుండా ఆస్తి కాజెయ్యడానికి కాచుక్కూచున్న దాయాదుల్ని ఎదురించి పదిమందికి అండగా నిలుస్తుంది. ఈ కథ తాడిపర్తి మాండలికాన్ని ప్రతిభావంతంగా రికార్డు చేసింది. జి.నిర్మలా రాణి గారి కథ 'పల్లెవెలుగు' సమాజంలో జరుగుతున్న

అన్యాయాల పట్ల పల్లెటూరి జనం కూడా పట్టించుకోకుండా ఉదాసీనంగా తయారైనందుకు నొచ్చుకుంటుంది.

ఆలూరి లక్ష్మీదేవి గారి కథ 'మనసున మనసై' పురుషుడి అనుమాన దౌర్బల్యానికి బలైన ఒక స్త్రీమూర్తి కుంగిపోకుండా జీవితంలో నిలదొక్కుకున్న వైనాన్ని వర్ణిస్తుంది. అనుమానాలు లేకుండా భార్య చుట్టూ భర్త మనసు తిరగడమే నిజమైన ప్రేమ అని నిరూపిస్తుంది. హేమమాలిని కథ 'ధైర్యం' మహిళా కళాశాలలో విద్యార్థినుల జీవితాలను పాడు చేస్తున్న ఒక కామాంధుడైన అధ్యాపకుని కళాశాల్లోని మహిళలు అందరూ కలసి పథకం ప్రకారం ఇంటికి పంపించిన వైనాన్ని వర్ణిస్తుంది. మహిళలు విజయం సాధించిన క్రమాన్ని రచయిత్రి వర్ణించిన విధానం చాలా బాగుంది. ఈ కథకు కథలోనే అన్నట్టు 'ఆపరేషన్ రావణ' అనే పేరు పెట్టుంటే ఇంకా బాగా నప్పేది. ఇక ప్రగతి గారి కథ 'రైటింగ్ కౌచ్' రచనారంగంలోని లొసుగుల్ని, అవార్డులు రివార్డుల పేరిట కొంతమంది కామాంధులు ప్రారంభ స్థాయి రచయిత్రుల్ని మొదట మాయమాటలతో, ఆపై బెదిరింపులతో లోబర్చుకునే వైనాన్ని, ఆ మాయలో పడి యువ రచయిత్రులు తమ కెరీర్ని పాడుచేసుకుంటున్న తీరుని ప్రతిభావంతంగా వర్ణించి కళ్ళు తెరిపిస్తున్నది. ఈ మూడు కథలు పక్కా స్త్రీవాద ధోరణితో రాసినవి. స్త్రీలను చైతన్యపరచే ఈ కథలు రాయడంవల్ల లక్ష్మి గారు స్త్రీశిశుసంక్షేమశాఖలో, హేమమాలిని గారు కాలేజీల్లో, ప్రగతి గారు అటు కాలేజీల్లో, ఇటు రచనారంగంలో గడించిన అనుభవాలు సద్వినియోగం అయ్యాయి.

కె. సుభాషిణి కథ 'ధృతరాష్ట్రుని కౌగిలి' సీమ అస్తిత్వవాద కథ. పూర్వం నుంచి కూడా సీమ నాయకుల అవకాశవాదం వల్ల సీమ వనరులు, అవకాశాలు ఏ విధంగా కోస్తాంధ్రకు తరలిపోయాయో కళ్ళకి కడుతుంది. మంచి కల్పన. కొండసాని రజిత కథ 'బహుమతి' ర్యాంకుల చక్రాలపై పరిగెత్తించే కార్పొరేటు చదువుల ఒత్తిళ్ళ నుండి పిల్లలకి విముక్తి కలిగించడమే పెద్ద బహుమతి అని రుజువు చేస్తుంది. పిల్లల హోంసిక్కునీ, రజస్వలైనప్పుడు మూఢనమ్మకాలతో అది మరింత బాధపెట్టడాన్ని ఉద్వేగంగా వర్ణిస్తుంది. చిలుకూరి దేవపుత్ర సతీమణి కుడాల లక్ష్మి గారి 'అపరాధం' కథ తమిళనాడులో స్థిరపడ్డ తెలుగువాళ్ళకు తమ మాతృభాష పరిరక్షణ పట్ల ఉన్న కమిట్మెంటుని గాఢంగా చెబుతుంది. అనంతపురం జిల్లాకు కరువులతో, గిట్టుబాటుగాని ధరలతో, అప్పులతో, అప్పుల విచిత్రాలతో చితికిపోయిన అక్కడి గ్రామీణ రైతు జీవితానికి అచ్చంగా ప్రాతినిధ్యం వహించిన కథ ఆవుల జయప్రద గారి 'ఋణచిత్రం'. ఐతే వసంతరాయుడు చనిపోడానికి జీవితం పొడవునా ఓపిన్ని కారణాలున్నా అతన్ని ఒక ఆకస్మిక కారణం చేత చంపడం, అతని ఆత్మని సర్వసాక్షిని చేసి కథ చెప్పించడం అనే సాంకేతిక లోపాలు ఈ కథ గొప్పతనానికి కొంచెం అడ్డు వస్తున్నాయి.

జయలక్ష్మీరాజు గారి కథ 'వరాహమూర్తి' అనంతపురం పురపాలనను, అక్కడి రాజకీయ వాగ్దానాలను సున్నితమైన హాస్యంతో వర్ణించింది. ఇలాంటిదే మంచి కథ, కాన్సెప్ట్ ఉన్న కథ ఆర్.శశికళ గారి 'అమ్మమ్మ మనసు'. ఈ కథ పౌరహక్కుల నేతలూ, సదరు నేతృత్వం వల్ల వాళ్ళ కుటుంబాల్లో కలిగే భయంతోడి కుదుపులను కలుపుకొని అనంతపురం పట్టణంలోని భూపోరాటాన్ని వర్ణిస్తుంది. డా.పుట్టపర్తి నాగపద్మిని గారి 'భూల్ భులైయ్యా', సింగాడి శోభామణి గారి 'కాకి', బి.బిజిలి గారి 'పేరేందబ్బా', మాదుగుల సులోచనాదేవి గారి 'రానిక నీ కోసం' కథల్లో మంచి జీవిత పరిశీలన, లోతైన మానవ సంబంధాల విశ్లేషణా కనబడతాయి.

సంపుటిలో రెండవదైన చిలుకూరి దీవెన రాసిన 'ఆటపట్టు' కథని గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఈ కథ ఆటల్లో ఆటగాళ్ళ రంగుని, ఒడ్డుపొడుగుల్ని కాకుండా వాళ్ళలోని ప్రతిభని చూడాలని సున్నితంగా చెబుతూనే దేశంలోని జాతి కుల వివక్షని చర్చకు పెట్టింది. ఒకప్పుడు జాతివివక్ష ఉన్నప్పటికీ అమెరికా, ఇంగ్లండ్ లాంటి దేశాలు క్రీడల్లో నల్లజాతివాళ్ళ ప్రతిభని గుర్తించి ప్రోత్సహించాయని, తద్వారా మంచి ఫలితాలు పొందాయని సోదాహరణంగా వివరించింది. అలాంటిది మన దేశంలో జరగలేదని బాధపడింది. దేశంలో ఎంతోమంది కాంబ్లీలు జాతివివక్షకు బలైపోయారు. క్రీడల్లో క్రికెట్, కళల్లో సంగీతం ఇప్పటికీ ఒక సామాజికవర్గం చేతుల్లోనే బందీలుగా ఉన్నాయి. కండరశక్తి అవసరమైన టీట్వంటీ క్రికెట్ పుణ్యమా అని కొంతమంది శూద్రులు, కొందరు అన్యమతస్తులు బ్యాటు మొహం, బంతి మొహం చూడగలిగారు గాని, పేర్ల వెనుక సామాజికత కనిపించినా కనిపించకుండా దాక్కున్నా ఇప్పటికీ రావులు, శర్మలు, వర్మలు, వేదులు, ఠాగూర్లూ మాత్రమే క్రికెట్ని శాసిస్తున్నారు. ఐనా పూర్వం సంతల్లో బానిసల్ని అమ్మిన దానికంటే అనాగరికంగా క్రీడాకారుల్ని బహిరంగ వేదికలపై వేలం వేస్తూ, క్రీడాస్ఫూర్తిని కోల్పోయి కార్పొరేట్ వ్యాపారంగా మారిపోయిన సదరు క్రీడ గురించి మాట్లాడుకోడం సమయాన్ని వృథా చేసుకోవడమే అవుతుంది. దీవెన గారి ప్రతిపాదనలో ఇంకొంచెం ముందుకుపోయి చూస్తే జాతి వివక్ష మూలాలు నదీలోయ నాగరికతల కాలంలో ఉన్నాయి. ఆఫ్రికా నుంచి బయలుదేరి వచ్చిన ద్రవిడజాతి సింధులోయలో పట్టణ వ్యవసాయక నాగరికతని నిర్మించుకుని శాంతియుతంగా

జీవిస్తున్న కాలం నాటికి ఎగువ ప్రాంతంలో ఆర్యజాతి ఇంకా వేట జీవనవృత్తిగా సంచారజాతిగా ఉంది. అప్పటికీ వేటాడే ఆయుధాలు చేతుల్లోనే ఉన్న ఆర్యజాతి శాంతికాముకమైన ద్రవిడజాతిని సులభంగానే ఓడించి మట్టుపెట్టింది. మిగిలిన ద్రవిడజాతిని వింధ్యపర్వత శ్రేణులకు దక్షిణం వైపుకి తరిమేసింది.

అప్పటికీ మిగిలిన ద్రవిడుల్ని తమ వద్ద దాసులు (దస్యులు)గా చేసుకుని వాళ్ళని ఊరి పొలిమేరల్లోకి తరిమేసి వాళ్ళ శ్రమని దోచుకోడం మొదలుపెట్టింది. వాళ్ళ దేవుడు పశుపతి రూపాంతరమైన శివున్ని శ్మశానంలో నిలిపింది. వాళ్ళ దేవత అమ్మతల్లి రూపాంతరమైన పార్వతిని పెద్దమ్మని, పేదమ్మని (దళితుల్ని పేదల్ని చేసి, ఊరి పొలిమేరలకు పరిమితం చెయ్యడం వెనుక ఉన్న సంకేతం ఇదే) చేసింది. ద్రవిడ సంస్కృతిని రూపుమాపి వాళ్ళపై ఆర్షధర్మస్థాపనం పేరుతో ఆర్య సంస్కృతిని రుద్దడానికి రాజకీయంగా, సాంఘికంగా చేస్తున్న ఆగడాలే కాకుండా పౌరాణిక గాథల్ని, రామాయణం లాంటి కావ్యాల్ని రాసి ద్రవిడజాతిని చెడ్డవాళ్ళుగా చిత్రీకరించింది. ఆర్యజాతికి చెందిన పౌరాణిక, చారిత్రక పురుషులు ఎన్ని ఆగడాలు చేసినా వాళ్ళని అవతార పురుషుల్ని, ఆరాధ్య దైవాల్ని చేసింది. ద్రవిడజాతివాళ్ళు ఎంత మంచివాళ్ళైనా వాళ్ళని దుర్మార్గుల్ని, రాక్షసుల్నీ చేసింది. రాజుల కాలంలో శైవ వైష్ణవ రాజుల మధ్య చోటుచేసుకున్న ఘర్షణలకు, యుద్ధాలకు, జరిగిన రక్తపాతానికీ మూలకారణం జనాల గుండెల్లో గూడుకట్టుకున్న ఈ జాతివైరమే గాని మతపరమైన కారణాలు కావు. అవి పైపైవి మాత్రమే. ఈ కలహాలకు మతం రంగు పూయడం దేనికంటే... శైవులంటే ద్రవిడులనీ, వైష్ణవులంటే ఆర్యులనీ గుట్టు బయటపడకుండా రహస్యంగా కప్పి ఉంచడానికి మాత్రమే. అలా కప్పిపుచ్చడం అనేది మేలే చేసింది. కాలం చేసిన మాయలో ప్రజలు శైవవైష్ణవ కలహాలని మతపరమైన ఘర్షణలుగా అర్థం చేసుకున్నారే గాని అవి జాతివైరాలని గుర్తించలేకపోయారు. ఇప్పుడు సగటు పౌరుడు ఇది ద్రవిడజాతి, ఇది ఆర్యజాతి అని గుర్తించడానికి వీలులేనంతగా ఈ రెండు జాతులు మిళితమైపోయాయి.

ఈ సత్యం, ఈ తెలివిడి అందరి అవగాహనలోకి వస్తే కొన్ని వర్గాలు రెచ్చగొడుతున్న కులం, మతం, సంస్కృతి (అలవాట్లు, ఆహారం, దుస్తులు వగైరా) పరమైన సంకుచిత భావాలు తొలగిపోయి విశ్వమానవ సౌభ్రాతృత్వం వెల్లివిరిస్తుంది. ఇలాంటి చర్చని తెచ్చిన దీవెనని మెచ్చుకోవాలి. చిలుకూరి మొలక మరి. స్త్రీవాదుల రచనలు వెలువడ్డం ఇదే ప్రథమం కానప్పటికీ ఆ దిశలో అక్షరగంధం కొరవడ్డ అనంతపురం కరువుగడ్డ నుంచి ప్రగతి అండ్ టీం చేసిన ప్రయత్నం మరో మైలురాయి. ■

## కర్తవ్యం

ఎన్ని రోజులుగా
సాహిత్య లోకంలో జీవిస్తేనేం...
నీకంటూ ఒక ఉనికిని
చాటుకుని సంచలించనిదే
నిన్నెవరూ గుర్తించరు...
మహా మహా అయితే పెద్దాయన అని
పెద్దరికాన్ని ఆపాదిస్తారు
నిన్నో శ్రోతగానో ప్రేక్షకునిగానో
సభలకూ సమావేశాలకూ
క్రమం తప్పకుండా ఆహ్వానిస్తారు
ఒక కుర్చీ కేటాయిస్తారు
మందిలో ఒకనిలా
చప్పట్లకే పరిమితం కావొచ్చు
మహా అయితే హఠాత్తుగా
వేదికపై ఆసీనులైనవారికి
స్వాగతిస్తూ గౌరవిస్తూ
నీ చేతుల మీదుగా ఓ పుష్ప గుచ్ఛం ఇప్పించవచ్చు
నాలుగు దశాబ్దాలుగా చెవుల్ని
సాహిత్య ప్రాంగణాలకు అప్పజెప్పిన నువ్వు
కళ్ళను సద్వినియోగం
చేసుకోవడంలో విఫలమయ్యావు కదా...
గ్రంథాలయాల్లో సుగంధాల్నీ
మస్తక భాండాగారంలో
పుస్తక పరిమళాల్నీ ఆస్వాదిస్తూ
నయనాల్ని ప్రఫుల్లితం
చేయడంలో అలసత్వం చూపావే...
ఒక్కసారి నిన్ను నీవు సమీక్షించుకో...
కాళ్ళ సత్తువ తగ్గినా
కళ్ళకు అద్దుకున్న సులోచనాలతో
రెండు పూటలా నిండుగా
అక్షరాలతో ముచ్చటించు...
ఓ నూతనోత్తేజంతో వినూత్నంగా వ్రాయి...
నానీ గానో... హైకూ గానో
ఏక వాక్య కవిత గానో...
వ్రాయడం నీ ముందున్న తక్షణ కర్తవ్యం...
చక్కగా ...చిక్కగా !

**- గుండాన జోగారావు**
63027 18715






# సముద్రమంత ... భావోద్వేగం

- డాక్టర్ ఎం.వెంకట లక్ష్మమ్మ

70323 54572

**క**ర్నూలు జిల్లా ఆదోని మండలం పెద్దతుంళం గ్రామానికి చెందిన కెంగార మోహన్ ... క్రిష్ణగిరి మండలం తొగర్చేడులో ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు పాఠశాల సహాయకులుగా పనిచేస్తున్నారు. గతంలో విన్యాసం (2012), కవనసేద్యం (2016) కవితా సంపుటులు అందించారు. రాయలసీమ ప్రచురణల ద్వారా వెలువడిన నీళ్ళింకని నేల (2019) కథల సంకలనానికి, మేము సైతం అనే కవితా సంకలనానికి సహ-సంపాదకులుగా వ్యవహరించారు. వీరు రాసిన 'సముద్రమంత' కవితాసంపుటి అనేక భావోద్వేగాలకు దర్పణం. 'అన్వేషణ' అనే కవితలో ...

మనసు విప్పి మాట్లాడాలని ఉంది
గుండెచప్పుడు వినిపించాలని ఉంది.
కనుపాపల్లో రూపం దాగుందని చెప్పాలని ఉంది
ఏ సుడిగాలికో కొట్టుకుపోయినట్టు
ఏ సునామీ విధ్వంసానికో కనుమరుగైనట్టు
అమాంతంగా అనుభూతులు
కరిగిపోయారని మది రోదిస్తుంటే..
జారిపడ్డ కన్నీటి బిందువుల్లో
నీ ప్రతిబింబం కనిపించింది
నీ రూపం మనోనేత్రంలో భద్రంగా నిక్షిప్తమయ్యింది

ఈ అన్వేషణ భార్యకోసమా, ప్రేయసికోసమా, ప్రాణ స్నేహితుని కోసమా, కృష్ణశాస్త్రి, బాపిరాజు గారు భావకవిత్వం అద్భుతంగా రాసినట్లే వీరూ ప్రకృతిలో లీనమై ఎక్కడో తన ప్రేయసిని మిస్సవుతున్నాడేమో అనిపించేంత బలంగా ఈ కవిత్వం వుంది. ఒక ఎడబాటన్నది లేదు అంటూనే 'కమ్మని జ్ఞాపకం'లో .. మహాసముద్రం శాంతించినట్లు/

వెన్నెల జడివానలా కురిసినట్లు
కాంతివనంలో మల్లెలు పూసినట్లు
అమాంతంగా తారలన్నీ పట్టపగలు

మిలమిలా మెరుస్తున్నట్లు/ మేఘాల నడుమ నవ్వుతూ నడిచొస్తున్నట్లు అంటారు. ఇది ఆత్మాశ్రయ కవిత్వం. కవి తనలోతాను లీనమై ఎంతో మధురాతి మధురంగా, వెన్నలంత అందంగా, అమ్మ చేతిగోరుముద్దలా, తేనీయలా తన భావాలు మనముందు పరిచారు. అవి చదువుతూ వుంటే మనసులో పలికించే భావాలు ఎన్నెన్నో. 'కొన్ని మాటలు - ఒొక సందర్భం' అనే కవితలో' అనే కవితలో ...

అనుభూతులకు, జ్ఞాపకాలకు ఎప్పటికీ అంతర్యుద్ధమే అనే సత్యాన్ని చెబుతూనే.. ముఖకవళికల తేజస్సును చిత్రించేందు కిప్పుడు/ ఏ రవివర్మో అక్కర్లే / ఒొక్క నీ మాట చాలు అంటారు.

**'నువ్వూ నేనూ... ఒొక మహాకావ్యం'లో**

కుంచెకందని నీ వదనాన్ని
హృదిలో ఆవిష్కరించుకున్నా
చెక్కిలిపై జారిపడుతున్న
కురులను సవరించే మునివేళ్ళు

ఈ కవితలో పంచ మహాకావ్యాలకు తోడుగా ఆరో కావ్యాన్ని లిఖిద్దాం అంటారు. ఒకటి రెండు లైన్లు తీసుకొని రాద్దామంటే కుదరలేదు. ఎందుకంటే అన్ని లైన్లు దేనికవే అనుభూతులను పెనవేసుకున్నవి.

మౌనంలోంచి... మరిచిపోవడానికి
జ్ఞాపకానివో అనుభూతివో కాదు, ప్రాణానివి.

ప్రేమ విత్తనం ఇక్కడ కనిపిస్తుంది. సముద్రమంత ప్రేమ కనిపిస్తుందంటారు. ముందు కవితలో కాలం ఎగరేసినా నాణెంలో అంటే చిరునవ్వుతో అంటే ఇక్కడ నాణానికి ఇరువైపులా మనమే వున్నాం అంటారు. తన ప్రేయసిని

వెతుకుతున్నట్లు జ్ఞాపకానివి అనుభూతినో కాదు, ప్రాణానివి అంటాడు. ముఖ వర్చసునై నాట్యం చేసే ఆకారాలను తప్పించి చూడు కనిపిస్తాను అంటారు. ఇక్కడ చూసినట్లైతే ప్రేమలో బాగా వున్న వ్యక్తులకు ఇలాంటి భావాలు బాగా తెలుసు అనిపిస్తుంది. **'మౌనం** మహావిధ్వంసం' కవితలో

ఎన్ని కలల్ని పోగేశామో
ఎన్ని అనుభూతుల్ని
మదిలో పేర్చుకున్నామో
కన్నుగుట్టిన కాలం
ఈర్ష్యతో, ఈసడింపుగా
ఉప్పెనలా విరచుకుపడ్డప్పుడు
చెరో భాగమై చెరో దేహమై
చెరో తీరంలో విసరేయబడ్డపుడు .. అని వియోగాన్ని అక్షరీకరించారు. లోతైన భావవ్యక్తీకరణ ఇది. ఈనాటి సమాజంలో ప్రేమికులను ఈర్ష్యతో ఈసడింపుతో విడదీస్తే చెరో దేహమై, చెరో భాగమై చెరో తీరంలో తపిస్తూ జీవిస్తారు. 'హృదయపు వాకిళ్ళు తెరచి' కవితలో

ఆహ్వానం పలకాలని వుంది కానీ నువ్వు రావు

ఇసుక రేణువులపై/ చరణాల మువ్వల సవ్వడితో నడిచొస్తావు/ నీకై ఎదురు చూస్తాను... అంటారు. ఇసుక రేణువులపై చరణాల మువ్వల సవ్వడితో నడిచి రావడం గొప్ప ఊహ.

అడుగులో అడుగేసి నడుస్తున్న ప్రతిసారి చరణమువ్వల సవ్వడులు/ సప్త స్వరాలను పలికిస్తాయి/ తుమ్మెదలా ఎదపై వాలినప్పుడు రెండు గుండెల చప్పుడు/ ఏకశబ్దమై వినిపిస్తుంది.

గుండెల చప్పుడు, చరణమువ్వల చప్పుడు, సముద్రాల అయి ఆశల గుళ్ళు అయ్యి **'నిజంగా నువ్వే'** అనే కవితలో చెబుతారు. కాలం వారించినా జలపాతంలా నువ్వు నాలో ప్రవహించాలి/ నేను నీలో సెలయేరవ్వాలి/ అని తదాత్మ్యం చెందుతారు కవి.

'ఉప్పెన' అనే కవితలో
కాలాన్ని తెడ్డుగా చేసుకుని
మది జలధిని ఎదురీదాను అంటారు.

ఎంత గొప్పపోలిక! రేఖాచిత్రమై జీవన ముఖచిత్రమై, హృదిలో గీసుకున్న రంగుల చిత్రాన్ని ఇలా చూపించారు. ఇంకా

ఇద్దరి మధ్య నిశ్శబ్దం..
ఈ శూన్యం భరించడం మహాకష్టం....
నిప్పుల మీద నడుస్తున్నట్టుంటుంది
నిజం చెప్పు నేస్తం...

కోపం అనంతప్రేమే కదూ... అనటం పతాకస్థాయి ప్రేమ వ్యక్తీకరణ. కోపం అనంత ప్రేమే కదా! గొప్ప వైరుధ్య ఉక్తి. కోప్పడడడానికి కొన్ని అడ్డంకులు వుంటాయి. మనవాళ్ళు మనకు అతి దగ్గరనడంలో మనసుకు దగ్గర్లో వున్నవారి మీదే కోపం వస్తుంది. ఒక ప్రాణమిత్రుడు దగ్గర్లో వుండి మాట్లాడకపోతే ఏవిధంగా వుంటుందో ఈ కవితలో కనిపిస్తుంది. 'నిప్పు' అనే కవితలో నేత్రాలెదురు చూస్తున్నాయి. నిరీక్షణ వలపు ఊయలలో పలవరిస్తుందా../ నిరంతరం పడే తపన నీ కోసమేగా.. అంటారు

రాయప్రోలు సుబ్బారావు గారు భావకవిత్వంలో 'అమలిన శృంగారం' అనే నిర్వచనం చెప్పారు. ప్రేమ, ఆరాధన, ఆత్మీయమైన స్నేహభావం ఈ కవితల నిండా పరిమళిస్తాయి. 'జీవన పుట' కవితలో 'ఏమని చెప్పను. ఏమని రాయను మాటల తుటాలు, వాక్యాలు ఉరితాళ్ళు, జ్ఞాపకాల చిత్రవధలు అనుభూతుల అలలు, కన్నీళ్ళ అక్షరాలు' అనటం ద్వారా విస్తారమైన జీవితాన్ని కళ్లముందు పరిచారు.

ఈ భావాలకు భిన్నంగా మరొక కవితలో తన కర్తవ్య దీక్షను వెల్లడించారు కవి.

అప్పటికప్పుడు కురుక్షేత్ర సంగ్రామానికి
సిద్ధమయ్యే సైనికుడిలా
కలకవచం ధరించి కవనరంగంలో
ముందుకురుకుతాను
కాలానికి చైతన్య నివార్యయైన
ప్రతిచోట నేనక్షరమై ఆదుకుంటాను

కవి విస్తారమైన పరిశీలనా శక్తిని, సామాజిక కర్తవ్యాన్ని వ్యక్తపరిచారు. ఒక సైనికుడి మాదిరిగా కవి నిత్యం సమాజాన్ని పహారా కాయడం, అక్రమం, అణచివేతా కనిపిస్తే తక్షణం స్పందించటం నిజమే కదా!

మనస్సనేది... వ్యక్తిగా నిలిచేందుకు
వైరుధ్యతోనూ, వైఖరులతోనూ
అనివార్య యుద్ధం చేయాలి
హృదివారలో దాచిన
రెండంచుల ఖడ్గాన్ని
బయటకు తీయాలి అంటూ మనస్సనేది కవితలో చెప్పారు. 'గరిమనాభి'లో

గతితప్పే గమనానికి
గరిమనాభి మనసే.. అంటూ

కొత్త పదాలను, సరికొత్త భావాలను, నూతన వ్యక్తీకరణలను ఈ కవత్వం ద్వారా పరిచయం చేశారు మోహన్. ■



# పద్ధతి.com

- పలమనేరు బాలాజీ
94409 95010

**"చే**త్తో ఇంత మన్ను పిసకనోడికి, రెండు చేతుల్తో పారా, గడ్డపార పట్టనోడికి, బురద నేలలో రెండు కాళ్ళతో అడుగుపెట్టనోడికి, చేతి వేళ్లకి తడీ, రుచి తేలీకుండా స్పూన్‌తో తినేవాడికి, మట్టి విలువా, రైతు విలువా ఏం తెలస్తాయి చెపప్పు?" క్షణం ఆగి అంటున్నాడు రమణ.

"మనం ఏం మాట్లాడినా పక్కోడికి కూడా వినపడకూడదని అనుకుంటాం. మనం ఏం మాట్లాడినా ఢిల్లీకి వినిపించేలా ఎప్పుడు మాట్లాడతామో అప్పుడే మనకు విముక్తి" గట్టిగా అంటున్నాడు రమణ.

బస్సు రణగొణధ్వనుల మధ్య తీవ్రంగా వినవచ్చింది అతడి కంఠ స్వరం. ఆ మాటతో ఉన్నట్లుండి భయం కలిగింది నాకు. కంగారుగా చుట్టూచూసాను. హమ్మయ్య! ఎవరి లోకంలో వాళ్ళు వున్నారు. రమణ మాటల్ని ఎవరూ పట్టించుకున్నట్లు లేదు. ఎవరైనా దేన్నయినా పట్టించుకుంటేనే కదా సమస్య. పట్టించుకోనంత కాలం అంతా మామూలుగానే ఉంటుంది.

బస్సు దిగినాకే మాట్లాడదాం అన్నాను, కానీ అతడు వినిపించుకుంటే కదా? నాలాగా కాదు.. అతడికి బరువు బాధ్యతలు లేవు, సంసారం లేదు, పిల్లలు లేరు, సొంత ఇల్లు, ఆస్తి లాంటివి ఏవీ లేవు. నలభయ్యేళ్ళు అయినా ఉంటాయో ఉండవో, అంతకు పదేళ్ళు పెద్దవాడిలా అనిపిస్తాడు. అతడి మొహంలో కోపం, ఉక్రోషం కనిపించదు. ఎప్పుడూ చాలా ప్రశాంతంగా ఉన్నవాడిలా ఉంటుంది అతని మొహం. అతడి గొంతులో మాత్రం అలజడి స్పష్టంగా తెలుస్తూనే వుంది. తెగించిన వాడిలా దూకుడు పైన ఉన్నాడు. కానీ, అతడి మొహం మాత్రం ప్రసన్నంగానే వుంది. ఆ చామన చాయ మొహంలో ఏదో కాంతి నిజంగా వుందో లేదో కానీ, ఏదో వెలుతురు కనపడుతోంది. బలంగా నమ్మిన దాని గురించి ఆచరణాత్మకంగా వుండే వాళ్ళ మొహాలు అట్లాగే వుంటాయేమో!

ఆర్టీసి బస్సు దూకుడు గానే అయినా, ఆగి ఆగి వెడుతోంది. బస్సు చేస్తున్న శబ్దాలతో బస్సు లోపలి మనుషుల మాటలు పోటీ పడుతున్నాయి. ఆ ధ్వనుల మధ్య రమణ కీచుగొంతు బిగ్గరగానే వినిపిస్తోంది. అయినా ఎవరి ఆలోచనల్లో, మాటల్లో, లోకాల్లో ప్రయాణికులు వుండిపోయారు కాబట్టి సరిపోయింది.

నా మొహంలో భయాన్ని గమనించినట్లు "ఎందుకు సార్.. అంతగా భయపడతారు, ఎప్పుడూ. అయినా అన్నిటికీ భయమేనా సార్? ఏం సార్... నిజాలు మాట్లాడితే కాల్చి పారేస్తారా?'' అంటున్నాడు, అంతే పెద్ద గొంతుతో. మొహమాటపడి, బిడియపడి, సంకోచంగా తల పైకి ఎత్తి చూసాను. బస్సులో ఏమైనా సిసి కెమరాలు పెట్టినారేమో అని. తల తిప్పి కిటికీ లోంచి బయటకు చూస్తుండిపోయాను.

ఉన్నట్లుండి బ్రేక్ వేశాడు డ్రైవర్. రాంగ్ రూట్‌లో ఇసుక లారీ వేగంగా దూసుకు వచ్చేసింది. రోడ్డు మధ్యలో ట్రాఫిక్ ఆగిపోయింది. డ్రైవర్లు ఇద్దరూ బూతులు మాట్లాడుకోవడం, ఆ మాటలు తీవ్రస్థాయిలోకి వెళ్లి, ఇద్దరు వాహనాలు దిగి కొట్టుకునే స్థితికి చేరేటప్పటికి గానీ బస్సులో జనం కదలలేదు. కొందరు బస్సు దిగి బస్సు డ్రైవర్‌కు సహాయంగా వెళ్లి లారీ డ్రైవర్‌తో గొడవకు దిగిన తర్వాతా మాత్రమే అవతల పక్షం కొంచెం తగ్గింది. ఏదో రాజకీయ నాయకుడి తాలుకా కాబట్టే దొంగతనంగా ఇసుక రవాణా చేస్తున్నా అంత పొగరు వాడికి అని, అనుకుంటూ జనం బస్సు ఎక్కేసారు.

"చెత్త నా కొడుకు. ఎప్పుడూ ఇంతే. చేసేది దొంగ

వ్యాపారం. దొర మాదిరి ఆ దర్జా చూడు, ఆ నా కొడుకుది. రోడ్డంతా వాడి అబ్బ సొత్తు అనుకుంటా వుండాడు. నంబర్ ప్లేట్ మార్చి దినామ్మూ దొంగ లోడ్లు తోలతా వుంటే, ఒకడైనా అడిగే వాడు వుండాడేమో చెప్పండి. ఆర్టీసీ అని చెప్పినా మమ్మల్ని మాత్రం ఏం చిన్న తప్పు చేసినా పురుగుల్ని చూసినట్లు చూస్తారు ఆ పోలీసోళ్ళు. చెప్పు... బూటూ.. అని అమ్మ నా బూతులు మాట్లాడతారే.. ఈ నా కొడుకులు ఇట్లా రోడ్డుకు అడ్డం పడి బండి నడిపినా, మాట్లాడే ధైర్యం ఒకడికీ లే." కోపంగా ఆ మాట అంటూనే బీడీ అంటించుకున్నాడు డ్రైవర్.

కాలితో యాక్సిలేటర్ తొక్కి పట్టి, స్టీరింగ్‌ను అవసరానికి మించి అటూ ఇటూ తిప్పుతూ బీడీ కారణంగా దగ్గు తెరల మధ్య ఆయాసం వల్ల రొప్పుతూ, తల అడ్డంగా అదే పనిగా ఆడిస్తూ తన కోపాన్ని మాటల్లో మాత్రం ప్రదర్శిస్తూ ఉన్నాడు. కోపంగా, ఆవేశంగా మాట్లాడుతున్నాడు, కానీ అతడి మొహంలో ఎలాంటి మార్పు లేదు, మొహం మాత్రం ప్రశాంతంగానే వుంది.

రమణ ఒక్క ఉదుటున నేను వారిస్తున్నా వినకుండా గభాలున సీట్‌లోంచి లేచి, డ్రైవర్ వద్దకు దూసుకుపోయి నిలబడి దూకుడుగా అన్నాడు : "ఏం తమ్ముడూ.. నువ్వు ఏమన్నా పెద్ద సాచానా? బస్సులో బీడీ తాగకూడదని తెలీదా నీకు? ముందా బీడీ పారేసి మళ్లీ నడుపు బస్సు. అందరూ చెప్పేవాళ్ళే, ఎదుటి వాన్ని మాత్రం కామెంట్ చేస్తారు ఈజీగా."

"బీడీ ఆపేయాలి .. డ్రైవర్ .. స్టాప్ ద బస్. స్టాప్ స్మోకింగ్" అంటూ ఎవరో ఇద్దరు ముగ్గురు ఆడవాళ్ళు అరిచారు. కొందరు మగవాళ్ళు అలా అరచిన ఆడవాళ్ళ వైపు విచిత్రంగా చూస్తే, కొందరు ఆడవాళ్ళు మాత్రం "అవునవును కరెక్టే.. రూలంటే రూలే. బీడీ పడేసే బస్సు డ్రైవ్ చెయ్యాలి" అని అరిచారు.

"నా బస్సు నా ఇష్టం. ఇప్పుడు బీడీ పారేయను. నీ వల్ల ఏమైతే అది చేసుకోబో సారూ.." విసురుగానే అయినా చాలా నిర్లక్ష్యంగా జవాబు ఇచ్చాడు డ్రైవర్. గట్టిగ దమ్ము పట్టి తల పైకి ఎత్తి లాగి పొగను వదులుతూ... ఈసారి మాత్రం అతడి మొహంనిండా పొగరు, చికాకు.

రమణ వెంటనే సెల్ ఫోన్ చేతిలోకి తీసుకుని, ఎవరికో రింగ్ ఇచ్చి ఏదో చెప్పి పెట్టేసాడు. ఒక స్మైల్ అంటూ అడిగి మరీ బీడీ తాగుతున్న డ్రైవర్‌ను సెల్‌ఫోన్‌లో ఫొటో తీసుకున్నాడు. "నువ్వు ఎవురికి ఏం చెప్పినా నాకేం భయం?" అన్నట్లు వెకిలిగా నవ్వుతూ ఫోజు ఇచ్చాడు డ్రైవర్.

రమణ వెనక్కి వచ్చి తన సీట్లో కుర్చునేశాడు. లొకేషన్ సహా వాట్సప్‌లోనో, ట్విట్టర్‌లోనో, ఫేస్‌బుక్‌లోనో సందేశాలు, సమాచారం క్షణాల్లో.. ఆ ఆపని అయిపోయాక నా వైపు తల తిప్పి చూశాడు. అతడి కళ్ళల్లో ఏదో నిశ్చింత కనిపించింది. ఇందాకటి అలజడి, ఉద్రేకం లేవు. కోపం అస్సలు తెలియని వాడిలా కనిపించాడు. కొన్ని క్షణాల్లో ఎంత మార్పు, ఇదేమిటి అని నేను అనుకుంటూ వుంటే, ఆ విషయాన్ని కూడా గ్రహించిన వాడిలా కళ్ళు ఎగరేశాడు.

"స్పందన చూద్దాం. నాకు చెయ్యాలి అనిపించింది, నేను చెయ్యాల్సింది నేను చేశాను, ఆ పైన చూడాలి ఏం జరుగుతుందో? దేనికైనా ఒక పద్ధతి వుండాలి కదా సార్. పద్ధతి లేని వాళ్ళతోనే మనం మాట్లాడాలి. పద్ధతిగా పోవాలని గట్టిగా చెప్పాలి. వాదించాలి, గొడవ పడాలి. పద్ధతిగా పోయే వాళ్లకు మనం ఎక్కడా అడ్డు తగల కూడదు సార్. మనం పక్కకు తప్పుకుని వాళ్లకు దారివ్వాలి. అలాంటి వాళ్లకు స్వేచ్ఛ ఇవ్వాలి. ప్రశ్న, సంఘర్షణ లేని జీవితం కూడా జీవితమేనా?" తమాషాగా నవ్వుతున్నాడు. అతడు ఎప్పుడూ అంతే! మాట్లాడితే పద్ధతి అంటాడు.

"వెళ్ళిపోయే టైం వచ్చినప్పుడు మనం వెళ్ళిపోవాలి సార్. మన స్టాపింగ్ వచ్చినప్పుడు ఎవరూ మనకు చెప్పరు. మనమే దిగేస్తాము. లైఫ్ కూడా అంతే సార్! పోవాల్సి వచ్చినప్పుడు వెళ్లిపోవాలి. బస్సులోనో రైల్లోనో మనకు ఎంత దూరం ఎంత వరకూ, ఎంత కాలం ప్రయాణం చేసినా మన స్టాప్ వచ్చినప్పుడు మనం సీట్ ఖాళీ చేసి సులభంగానే వెళ్లిపోవాలి సార్.." ఆగి ఆగి మాట్లాడటం అతని అలవాటు. ఆ మాటలు అట్లాగే వినడం నా అలవాటు.

బస్సు బయట ఏదో దృశ్యం అతడిని ఆకర్షించినట్టు ఉంది. అటు వైపే చూస్తూ తల తిప్పకుండా అంటున్నాడు.. "ప్రతి సారీ ఊరికే తుపాకులకు భయపడిపోతే ఎట్లా సార్?"

నేను కూడా తలతిప్పి అటువైపు చూశాను. రోడ్డుకు అటు వైపు సినిమా థియేటర్ ముందు పోస్టర్లు అంటిస్తున్నారు ఆడవాళ్ళు కొందరు. కాదు కాదు.. పోస్టర్లపై తెల్ల కాగితాలు అంటిస్తున్నారు. కొన్ని పోస్టర్లను చింపేసే ప్రయత్నం చేస్తున్నారు కానీ, కుదరడం లేదు. అశ్లీల అర్ధ నగ్న చిత్రాలపై కనపడకుండా తెల్ల కాగితాలు, రంగు కాగితాలు అడ్డంగా అంటిస్తున్నారు. బూతు చిత్రాలు మాత్రమే ప్రదర్శించే ఆ పాత థియేటర్ ముందు ఏదో గొడవ జరుగుతోంది. థియేటర్ వాళ్ళకూ ఆడవాళ్ళకు మధ్య ఏదో మాటల యుద్ధం జరుగు తోంది. ఒక్క మగవాడు కూడా ఆ ఆడవాళ్ళ వైపు మాట్లాడడటం లేదు కానీ గుంపు చేరి ఆడవాళ్ళనే తినేసేలా చూస్తూ, సిగరెట్లు కాలుస్తూ, కిళ్లీలు నములుతూ, వెకిలి చూపులు, వెకిలి నవ్వులతో... 'దిగు' అని నా వైపు, 'ఆపు' అని డ్రైవర్ వైపు తల తిప్పి అరిచాడు రమణ. డ్రైవర్ బస్సు ఆపటానికి మొదట

ఒప్పుకోలేదు కానీ, అప్పుడొక విచిత్రం జరిగింది.

ఉన్నట్టుండి డ్రైవర్ సెల్ మోగింది. "బస్సు పక్కలో ఆపి మాట్లాడండి" నవ్వుతూ అంటున్నాడు రమణ. ఆ ఫోన్ ఎక్కడి నుంచి ఎవరి నుండి వచ్చిందో రమణకు అర్థం అయినట్లుంది. డ్రైవర్‌కే వెంటనే అర్థం అయినట్లు లేదు. కానీ, ఈసారి విసుగ్గా రమణ చెప్పినట్లే బస్సు రోడ్డు పక్కనే ఆపేసాడు. తల అడ్డంగా ఊపుతూ వూ.. కొడుతూ "లేదు సార్.. సారీ సార్" అని రమణ వైపు తల తిప్పి చూసాడు. రమణ కళ్ళల్లో నవ్వు.

డ్రైవర్ ఫోన్ పెట్టేసి "సారీ.. సార్" అంటుంటే, రమణ నవ్వుతూ అతడి భుజం తట్టాడు. "గవర్నమెంటు పెట్టిందే రూల్స్‌ని, గవర్నమెంట్ ఎంప్లాయిస్ కూడా ఫాలో కాకపోతే యెట్లా? కొన్ని దశాబ్దాలు పోరాటాలు చేస్తే ప్రభుత్వాలు బహిరంగ ప్రదేశాల్లో పొగ తాగరాదని చట్టం చేసాయి. కాన్సర్ వస్తుందని తెలిసినా, మనం బీడీలు, సిగరెట్లు, గుట్కాలు, పొగాకు అమ్ముతానే వున్నాం. ఆల్కహాల్ కానీ బీడీ సిగరెట్లు కానీ నిషేధించే దమ్ము ప్రభుత్వాలకు ఉందా? తమ్ముడూ బస్సులో పొగతాగవద్దు, డ్రైవింగ్ చేస్తా సెల్లు మాట్లాడవద్దు, మాకోసమో, గవర్నమెంట్ కోసమో కాదు. నీ కోసం, నీ కుటుంబం కోసం, ఈ సమాజం కోసం కూడా!"

స్టూడెంట్స్ కొంతమంది ఆడపిల్లలు, ఇద్దరు ముగ్గురు మహిళా ఉద్యోగస్తులు చప్పట్లు కొట్టారు. గంపలో కూరగాయలు, ఆకుకూరలు పెట్టుకున్న మార్కెట్ మహిళ ఒకామె నోట్లో వేళు ళ్ళ ఉంచుకుని గట్టిగా విజిల్ వేసేసింది ఉత్సాహంగా. వాళ్ల మొహాల నిండా ఏదో ఉత్సాహం, కొంచెం వెలుతురు. ఇంకొంత మంది ఎందుకో అకారణంగా చిరాకు పడుతున్నట్లు వాళ్ల మొహాలు చెపుతున్నాయి.

ఆగిన బస్సులోంచి రమణ చురుగ్గా దిగేసాడు. నేనూ అతడి వెనకే బస్సు దిగేసాను. ఇద్దరం వెనక్కు వచ్చి రోడ్డు దాటి ఆ సినిమా థియేటర్ ముందుకు వచ్చేసరికి అక్కడకి పోలీసులు వచ్చి నిలబడి ఇరుపక్షాల వైపు తలలు తిప్పుతూ శ్రద్ధగా వింటూ వున్నారు. అంతకుముందే అక్కడినుంచి కబురు వెళ్లినట్లుంది. ఒక స్కూటీ వేగంగా అక్కడికి వచ్చి ఆగింది. ఇద్దరమ్మాయిలు బండి దిగారు. హెల్మెట్ తీసి బండికి లాక్ చేసి నల్లకోటు సర్దుకుంటూ ఒక అమ్మాయి నిండా పాతికేళ్ళు కూడా ఉండవేమో, చురుకైన కళ్ళతో పెదాలపై నవ్వుతో చేతులు తిప్పుతూ మాట్లాడుతుంటే పోలీసులు టోపీలు తీసి మళ్ళీ మళ్ళీ పెట్టుకుంటున్నారు. వాళ్ళ మొహాలు వాడిపోయాయి.

ఆ అమ్మాయి చురుగ్గా "సంధ్యా వీడియో తియ్యమ్మా.." అనగానే, స్కూటీలోంచి వెనక కూర్చుని వచ్చిన పొడుగు అమ్మాయి సెల్ తీసి వీడియో తీయడం మొదలు పెట్టగానే అక్కడున్న ఆ మగవాళ్ళు మొహాలు తిప్పుకుంటూ, కర్చీఫ్‌లు అడ్డం పెట్టుకొని మొహాలు చాటు చేసుకుంటూ హడావిడిగా ఆ స్థలాన్ని ఖాళీ చేసేసారు. అంతవరకూ అడ్డదిడ్డంగా మాట్లాడిన థియేటర్ వాళ్ళ మొహాల్లో రంగులు మారిపోయాయి. మెల్లగా లోలోపలే ఏదో గొణుక్కుంటూ థియేటర్ లోపలి వెళ్ళిపోయారు.

రమణ హుషారుగా ముందుకు నడచి "సుప్రజా.. రియల్లీ నైస్" నవ్వుతూ అభినందించి కుడి చెయ్యి పైకి ఎత్తి సెల్యూట్ చేస్తుంటే ఆ అమ్మాయి మొహమాటంగా నవ్వింది. "ఎన్ని సార్లు కేసులు వేస్తున్నా ఈ సెల్ ఫోన్ షాపుల్లోంచి బ్లూఫిల్మ్స్ డౌన్ లోడింగ్ ఆపలేకపోతున్నాం. ఈ థియేటర్‌లో డైరెక్ట్‌గా బ్లూ ఫిల్మ్స్ చూపిస్తున్నారని అందరికీ తెలుసు. అయినా అన్నిట్లో రాజకీయమే.. ఇక్కడా అదే దరిద్రమే .."

"సమస్య ఇక్కడే వుంది సుప్రజా.. జయప్రభ చెప్పినట్లు పైటను మాత్రమే కాదు తగలేయ్యాల్సింది.. ఇట్లాంటి థియేటర్లు, సెల్‌షాపుల్ని ముందు తగలెయ్యాలి. ఎన్నో పోర్న్ సైట్లు. అన్నిటినీ అగ్గి పెట్టాల్సిందే."

మాటల్లో నిప్పుల వాన కురుస్తోంది అక్కడ. చలిగాలి వీస్తున్నా, ఉన్నట్లుండి ఆ ఇద్దరు అమ్మాయిల రాకతో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. నగ్న చిత్రాల పోస్టర్లపై తెల్ల కాగితాలు అంటించడం పూర్తయింది. ఎవరో పంపిస్తే వేడిగా టీ వచ్చింది. టీ తాగి థాంక్స్ చెప్పి అక్కడినుండి కదిలాం.

♦ ♦ ♦

ప్రయాణం మళ్ళీ మొదలైంది. సిటీ దాటుతున్నాం. బస్సు దిగి ఇంకో బస్సు ఎక్కినాక ఇద్దరం పక్కపక్కనే ఒకే సీట్‌లో కూర్చున్నాం. ఆర్డినరీ బస్సు.. పల్లె వెలుగో, పల్లె ప్రగతో... ఏదో.. పేరు.. రమణ వాట్సప్‌లో మెసేజ్ టైపు చేస్తూ అందులో నిమగ్నమైపోయాడు. యధా లాపంగా చుట్టూ చూసాను. రద్దీ లేదు.. అయినా ఎవరికివాళ్ళు మూతులు గుడ్డలతో మాస్కులతో బిగించుకుని ఒకరికొకరు దూరదూరంగా, భయం భయంగా.. ఒకరినొకరు సందేహంగా, అనుమానంగా చూస్తూ. సెల్ ఫోన్ ప్రపంచంలో ఎవర్ని వాళ్ళు సంపూర్ణంగా పోగొట్టుకునే ప్రయత్నంలో తీరిక లేకుండా ఉన్నారు.

మామూలుగా అయితే గుంపులు, సమూహాల వల్లే ఊర్లు, సమాజాలు నాగరికతలు ఏర్పడ్డాయని చరిత్ర చెపుతుంది. కానీ, ఈ మధ్యకాలంలో నలుగురు ఒక్కచోట చేరడం చాలా కష్టమై పోతోంది. కరోనా వచ్చాక అస్సలు ఇద్దరు కలవడమే కష్టమై పోతోంది. కాస్తయినా జన సమూహాన్ని చూసి చాలాకాలం అవుతోంది. నలుగురూ చేరతారు కానీ ఎవడి దృష్టి వాడిదే, ఎవడి లక్ష్యం, ఎవడి స్వార్థం వాడిదే.. వాళ్ళ వాళ్ళ లాభాలు,

నష్టాలు, కష్టాలు, నష్ట నివారణా సూత్రాలు, లెక్కలు.. మాటిమాటికీ టైం చూసుకుంటూ ఎప్పుడెప్పుడు వాళ్ళ పని అయిపోతుందా, ఎప్పు డెప్పుడు అక్కడినుండి కదలి, వాళ్ళ వాళ్ళ కలుగుల్లోకి వాళ్ళు వెళ్ళిపోయి తలుపులు బిగించు కుందామా అనే ఆలోచనల్లోనే వుంటారు. ఎవరి సంకెళ్ళు వాళ్ళవే. ఎవరి కలుగులు, బోరియలు, బోన్లు, గుహలు వాళ్ళవే. అంతటా అనుమానమే, అసహనమే. ఉండలేనితనమే.. భరించలేనితనమే. ఎవరికోసం ఎవరూ ఏమీ చేయలేనితనం. ఇంకొకరికోసం ఆలోచించడానికి తీరిక లేని ప్రపంచం. సమూహాల గురించి మనిషి పట్టించు కోనప్పుడే కదా ఉపద్రవాలు, విస్ఫోటనాలు జరిగేది. ఇప్పుడు ఎవరికీ లేనిది సమయమే. అవును సమయం లేదు మిత్రమా.. బతకడానికైనా, స్వేచ్ఛగా గాలి పీల్చుకోవటానికైనా, స్వేచ్ఛగా ఆలోచించడానికైనా, స్వేచ్ఛగా నలుగురూ కలసి నడవటానికైనా తీరిక లేదు.

"అయిపోయింది.." నవ్వుతున్నాడు రమణ.

అతడి మొహంలోకి వెలుతురు వచ్చింది. ఆ వెలుగుని చూసే కదా అందరూ భయపడేది. మళ్ళీ ఏదో చేసే ఉంటాడు.. అందుకే.. ఆ కళ్ళల్లో సంతృప్తి.. మొహంలో వెలుతురూ.. ఆ నవ్వూ'.... అడవులకు స్వేచ్ఛ కావాలి సార్.. స్వేచ్ఛ లేకుంటే మనిషైనా, మాను అయినా అంతే.. మొక్కల్ని కాదు ఇప్పుడు అడవుల్ని పెంచాలి సార్.. సమయం లేదు.."

"మనం కలవాల్సిన వాళ్ళు రెడీగా వున్నారు. ఇంకో గంటలో అక్కడికి చేరుకుంటాం. అందరం కలసి ఎట్లాగైనా పొలాలను బతికించుకోవాలి సార్..."

మెయిన్ రోడ్డు మలుపు తిరిగి మరోపక్క వెడుతోంది బస్సు. గతుకుల్లో టైర్లు దిగి ఎక్కినప్పుడు, గతుకులు తప్పించడానికి డ్రైవర్ స్టీరింగ్ తిప్పినప్పుడు ప్రయాణికులు సీట్ల లోంచి పైకి కిందకి, పక్కలకి కదులుతున్నారు కానీ సెల్ ఫోన్ల పై నుంచి మాత్రం దృష్టి మరల్చడం లేదు. ఎవరి లోకంలో వాళ్ళే. ప్రయాణాల్లో ఏ ముచ్చట్లు లేవు. మనుషులు ఒక చోటు నుండి ఇంకో చోటుకు శరీరాలను కదల్చడం తప్ప ఇంకేమీ జరగటం లేదు. ఎక్కడైనా ప్రయాణాల్లో ఒక అనుభవం ఒక అనుభూతి వుంటాయి, కొత్తదనం వుంటుంది. కొత్త మనుషులు, కొత్త ప్రదేశాలు, కొత్త ఆలోచనలు, కొత్త ప్రతిపాదనలు, కొత్త చర్చలు, కొత్త ఆవిష్కరణలు.. మొత్తం మీద ఒక కొత్త దేశం.. కొత్తదనం.. కొత్త గాలి. ఏవీ? అవన్నీ నిషేధాల జాబితాలో చేరిపోయాయి.

ఏదో పల్లె. బస్సు ఆగింది. పొలాల చుట్టూ కొండలు, పొలాలు ఖాళీగా ఎండిపోయి జాలిగా ఆకాశం వైపు చూస్తున్నవి కొన్ని. కోసిన కూలి కూడా రాబట్టలేని స్థితిలో వదిలేసిన పంటలతో మరికొన్ని పొలాలు పచ్చగా.. కొన్ని పచ్చని మొక్కలు, అక్కడక్కడా కొన్ని నేలరాలిన మహా వృక్షాలు, దూరంగా కొండను యంత్రాలతో పెల్లగిస్తున్న మనుషులు.

"ఇక్కడ అల్లం టీ బావుంటుంది రా.. మిత్రమా" మాటల్లోనే రమణ బస్సు దిగేసాడు. బస్సులో ఆ మాటను పట్టించుకున్న వాళ్ళు లేరు. ఎవరైనా దిగుతారేమో అనుకుని చూసాను కానీ, ఎవ్వరూ తలలు పైకి ఎత్తి అక్కడున్న పల్లెను చూస్తున్న వాళ్ళు లేరు. పల్లె కూడా సగమే వుంది. అందునా జనం మరీ తక్కువగానే ఉన్నట్లున్నారు.

డ్రైవర్ మాత్రం బస్సు దిగి బీడీ అంటించుకుంటూ దగ్గుతూనే అంటున్నాడు. "ఏం జీతాలో, ఏం జీవితాలో ఏందో? బీడీ పారేద్దాం అంటే మనసు ఒప్పదు. బీడీ తాక్కపోతే బుర్ర పనిచెయ్యదు. మానెయ్యాలి ఇంకైనా .. థూ.. దీనెమ్మ... జీవితం. ఒకటి వుంటే ఒకటి వుండదు.."

టీ తాగుతూ టీ షాప్ అతడ్ని అడిగి నా మనసులో మెదలుతున్న సందేహాన్ని నివృత్తి చేసుకునే ప్రయత్నం చేసాను. "అయినా పది లక్షల మందితో రైతులు, కార్మికుల సభలు ఈ నేలలోనే ఈ కాలంలోనే జరిగాయి. ఇప్పుడు ఇక్కడ ఊర్లల్లో చూస్తే రచ్చబండ రోడ్డు విస్తరణలో పోయినట్లుంది. ఇండ్లముందు అరుగులు వుండటం అనాగరికత అయిపోయినట్లుంది. వూర్లో జనాలు లేరా బాబూ?"

"కొందరు పోయారు, కొందరు వెళ్ళిపోయారు, కొందరు మాత్రమే మిగిలారు సార్." ఆ జవాబు కూడా నాకు చెప్పినట్లు లేదు, తనకు తనే చెప్పుకున్నట్లుగా వుంది అతడి వాలకం.

"రెండు చేతుల్తో పారా, గడ్డపార పట్టనోడికి, బురదనేలలో రెండుకాళ్ళతో అడుగు పెట్టనోడికి, చేతివేళ్ళకి తడీ, రుచి తెలియని వాడికి ఈ పల్లెలు పొలాలు రైతులు యెట్లా కనిపిస్తారు? నాకొక కల వుంది. అది త్వరగా నెరవేరాలని వుంది. పొలాలన్నీ మళ్ళీ పూర్వం లాగా ఇండ్లు అయినట్లు ఈకాలంలోనే మళ్ళీ అపార్మెంట్లు తొలగించి, మళ్ళీ ఈ ప్రాంతంలో పొలాలు వస్తే బావుంటుంది. అవును సార్. ఊర్లు పొలాలు కావాలి. ఇక్కడ మళ్ళీ పంటలు పండాలి." రమణ కలవరిస్తున్నట్లు అంటున్నాడు. అంటూనే అమాంతం నేల మీదకువొరిగి పోయాడు.

వంగి కుడివైపు చెవిని నేలకు ఆనించాడు. తర్వాత ఛాతిని కూడా నేలకు ఆనించి "హమ్మయ్య ఇంక పర్వాలేదు సార్. ఎవరు ఎంత అడ్డుకోవాలని చూసినా భూమికి ఏం కాలేదు సార్ .." ఆ కళ్ళ నిండా.. సంతోషం.. ఆగి ఆగి మాట్లాడుతాడు కదా.. మళ్ళీ అన్నాడు.

"ఏం పర్వాలేదు సార్ .. ఊరు వదిలి పోయిన వాళ్ళు కూడా ఇంక వచ్చేస్తారులే . ఎందుకంటే .. భూమి ఇంకా బతికే వుంది!" ■



## ఉపశమనం

పెదాలపై ప్లాస్టిక్ నవ్వుల్ని పూయించడం
నీకూ నాకూ కొత్తేమీ కాదు
ఆరితేరిపోయాం!
అలాగే నవ్వి నవ్వి
అలసిపోయాం కూడా!

అప్పుడప్పుడైనా
అలవాటుగా విచ్చుకుంటున్న
పెదాల్ని ముని పళ్లతో నొక్కి పెట్టి
మనసారా...
కొందరి గుండె చప్పుడుల్ని విందాం
కాసిన్ని కన్నీళ్ళని దోసిళ్ళలో పట్టి
కాస్తంత ఓదార్పునిద్దాం


ఉపశమనం...
వాళ్లకు కాదు!
మనిషిగా అంతరించిపోతున్న
నీకూ ...నాకూ ..!

- శ్రీను కుడుపూడి
89192 62864

## మట్టిని దీవించే ముసురు

నిశి మత్తులో 'రాత్రి' గురకపెట్టే వేళలో
హఠాత్తుగా తలుపుకొడుతున్న
గాలి గొంతుకు గది ఉలిక్కిపడింది

వెలుతురుతో కళ్ళు తుడుచుకున్న 'నిద్ర'
తలుపు సందు నుంచి బయటకు చూసింది



ఆకాశపు చీకటి ఒంటిపై
మెరుపు కొరడా దెబ్బలకు
గాలి గోగ్గోలు పెడుతూ
ఏదో గాలిసోకినట్లుగా ...

ఊర్ల జుట్టుపట్టుకుని
వీధి తలల్ని తన్నుకుంటూ
విసురుగా ఊద్చుకు ఊగుతూ

రాత్రి చెవిలో ఉరుము చప్పుడుకి
చీకటి చెవులు మూసుకుంది

నింగి కంటిలో మెరుపు సవ్వడికి
దిక్కులు కళ్ళు మూసుకున్నాయి.

నేల గుండెలదిరి తలను ఒడిలో కుక్కొని
వణుకుతూ ముడుక్కొంది

నింగి, నేల మధ్య మట్టి ప్రాణాలని
తలచి పులకించే
ప్రకృతి గొంతుకు వంతపాడే
గాలి, మెరుపు, ఉరుము, వాన ....
ఆనాది చుట్టరికమే!

కురిసే ప్రేమే వర్షం అరిసే గొంతు ఉరుము
దూకే అడుగే పిడుగు సాచే హస్తం గాలి

అన్నీ బంధువులైన ఈ బాంధవ్యమే!
మట్టిని దీవించే ముసురుకు పునాది
మనిషిని ప్రేమించే ప్రకృతికి అనాది!


- చందలూరి నారాయణ రావు
97044 37247

# సాహితీ ప్రజ్ఞ

నిర్వహణ : పిళ్లా కుమార స్వామి

1. 'సువ్వీ సువ్వీ సువ్వని సుదతులు నంచెదరోలాల' వంటి సువ్వి పాటలు రాసింది ఎవరు?
   ఎ. పాల్కురికి సోమనాధుడు బి. త్యాగయ్య సి. అన్నమయ్య డి. క్షేత్రయ్య
2. 'ప్రజాకవి వేమనపై పరిశోధన చేసిన వారు ఎవరు?
   ఎ. ఆరుద్ర బి. నార్ల సి. రాళ్లపల్లి డి. ఎన్.గోపి
3. 'పెద్దన్న వలె కృతి చెప్పిన బెద్దన వలె' అన్న కవి ఎవరు?
   ఎ. తెనాలి రామకృష్ణ బి. పెద్దన సి.కృష్ణదేవరాయలు డి. చౌడప్ప కవి
4. రారా గా పేరుగాంచిన రాచమల్లు రామచంద్రారెడ్డి ఏ పత్రికలకు సంపాదకులుగా వ్యవహరించారు?
   ఎ. సవ్యసాచి, సంవేదన బి. పెన్నేరు, రేనాడు సి. జమీన్‌రైతు, సంవేదన డి. సవ్యసాచి, పెన్నేరు
5. గుణాఢ్యుడు 'బృహత్కథ'ను ఏ భాషలో రాశాడు?
   ఎ. పాళీ బి. సంస్కృతం సి. పైశాచి డి. రాక్షస
6. గాథాసప్తశతి ఏ భాషలో రచింపబడింది?
   ఎ. సంస్కృతం బి. ప్రాకృతం సి. పాళీ డి. పైశాచి
7. గాలిబ్ గీతాలను తెలుగులోకి అనువదించిన కవి
   ఎ. దాశరథి బి. దేవులపల్లి రామానుజరావు సి. అక్కినేని నాగేశ్వరరావు డి. మిర్జా అసదుల్లాఖాన్
8. 'స్వీయలోపమ్ము లెరుగుట పెద్ద విద్య, లోపమెరిగిన వాడే పూర్ణుడగు నరుడు' అన్న కవి ఎవరు?
   ఎ. దాశరథి బి కాళోజీ సి. గాలిబ్ డి. ముఖ్దుం మోహియుద్దీన్
9. 'చిల్లరదేవుళ్ళు' నవల రచయిత ఎవరు?
   ఎ.దాశరథి బి. దాశరథి రంగాచార్య సి. శ్రీశ్రీ డి. రంగనాయకమ్మ
10. 'పరస్పరం సంఘర్షించిన శక్తులలో చరిత్ర పుట్టెను' అన్న కవి ఎవరు?
    ఎ. శ్రీశ్రీ బి. బాలగంగాధర్ తిలక్ సి.పురిపండా డి. శివసాగర్
11. డైరీ రూపంలో రాసిన అతడు – ఆమె నవలా రచయిత ఎవరు?
    ఎ. రావిశాస్త్రి బి. ఉప్పల లక్ష్మణరావు సి. ఉన్నవ లక్ష్మీనారాయణ డి. మహీధర రామ్మోహనరావు
12. 'అల్పజీవి' నవలా రచయిత ఎవరు?
    ఎ. శ్రీశ్రీ బి. కేశవరెడ్డి సి. కె.ఎన్.వై. పతంజలి డి. రావిశాస్త్రి
13. 'ఉత్కళం' నవలా రచయిత ఎవరు?
    ఎ. అట్టాడ అప్పల్నాయుడు బి. బలివాడ కాంతారావు సి. పతంజలి డి. జి.ఎస్.చలం
14. మాలపల్లి నవలా రచయిత?
    ఎ. ఉన్నవ లక్ష్మీనారాయణ బి. ఉప్పల లక్ష్మణరావు సి. మహీధర రామ్మోహనరావు డి. బలివాడ కాంతారావు
15. శిల్పం, భాష రచనకు మూలపరికరాలయితే, జీవితం ముడి పదార్థమని చెప్పిన విమర్శకుడు ఎవరు?
    ఎ. కొడవటిగంటి కుటుంబరావు బి. చెంచయ్య సి. కె.వి.ఆర్ డి. త్రిపురనేని మధుసూదనరావు
16. 'ఏడుతరాలు' నవలా రచయిత?
    ఎ. అలెక్స్‌హేలీ బి. రంగనాయకమ్మ సి. ఆర్థర్‌హేలీ డి. హెచ్.జి.వెల్స్
17. శాసనాలను మొట్టమొదట తెలుగులో వేయించిన వారు?
    ఎ. చోళులు బి. రేనాటి చోళులు సి. శాతవాహనులు డి. రాష్ట్రకూటులు
18. తెలుగులో వేయబడిన మొట్టమొదటి శాసనం ఏది?
    ఎ. ధనంజయుని నలమళ్ళ శాసనం బి. ఎర్రగుడి పాడు సి. భట్టిప్రోలు డి. జయసింహవల్లభుని విప్పర్ల శాసనం

జవాబులు : **1. సి 2. డి 3. డి 4. ఎ 5. సి 6. బి 7. ఎ 8. సి 9. బి 10. ఎ 11. బి 12. డి 13. ఎ 14. ఎ 15. ఎ 16. ఎ 17. బి 18. ఎ**







# రాయలసీమ కవిత్వం ప్రజాభ్యుదయం

- డాక్టర్ బి.నాగశేషు
99855 09053


**తె**లుగునాట మూడు ప్రాంతాల్లోనూ మాట్లాడే భాష ఒకటే అయినా ఆయా ప్రాంత మట్టివాసన కనుగుణంగా, ప్రాంతీయ నేపథ్యంగా యాస, మాట, పాట, కథ, కవిత్వం, నవల, నాటకం పుట్టుకొస్తుంటాయి. ఈ ప్రక్రియలు తెలుగునాట అన్ని ప్రాంతాల్లో ఉన్నప్పటికీ, ఎన్నుకునే సమయానికి వచ్చేటప్పటికి కవిత్వానికి ఒక ప్రాంతం, బలమైన పాటకొక ప్రాంతం, శ్రావ్యమైన కథ, నవలకొక ప్రాంతం నాయకత్వం వహిస్తుంది. ఆయా ప్రాంతవాసుల జీవన స్థితిగతులను బట్టి ఆయా రకమైన ప్రక్రియ పుట్టుకొస్తుంది.

ఉద్యమం, ఉద్రేకం అణచివేత ఉన్నచోట 'పాట' కథ పెద్దన్న పాత్ర పోషిస్తుంది. జనాన్ని పోగుచేయడానికి, పోరాడటానికి, ప్రేరణ నింపడానికి పాట ప్రాతినిధ్యం వహిస్తుంది. మిగతా ప్రక్రియలకు ఆ శక్తి తక్కువ. అందువల్ల పాటనగానే తెలంగాణ గడ్డ గర్జిస్తుంది. కోస్తా సోదరుల జీవితాల్లో భావుకత నిండుగా ఉండటం వల్ల కమ్మని కవితాత్మకత వారిని అల్లుకుంటుంది. రాయలసీమలో కథ, విమర్శ, వినిపించినంతగా ఇతరాలు కాస్త తక్కువే. సీమవాసుల జీవితాల్లో వాస్తవికతపై చేయి సాపిస్తుంది. వేదనాభరిత జీవితాలను కవిత్వపు కొలతలు సరిపోవేమో!

రాయలసీమలోని అచలతత్వం, తాత్త్వికత కొంతవరకూ తెలంగాణలో కూడా కనిపిస్తుంది. వేమన, పోతులూరి లాంటి జీవిత సత్యాలను బోధించే తత్త్వవేత్తలు మిగతా కోస్తా ప్రాంతంలో అగుపించరు. రాయలసీమ, ఉత్తరాంధ్రలో కథ, నవల ప్రబలంగా కనిపిస్తే, కోస్తాలో కవిత్వం పచ్చగా పరిమళిస్తుంది. ఇలా తెలుగు నేల అన్ని ప్రక్రియలతో అలరారుతున్నది. భూస్వామ్య విధానం, అణచివేత ఉన్నప్పుడు కవిత్వం కన్నా, పాటగా, కథగా నవలగా జీవితం విస్తరిస్తుంది.

రాయలసీమప్రాంతంలో కవులు తక్కువని చాలామంది అభిప్రాయం. అయితే అక్కడి కవికోకిలలు ఏ వసంతం కోసమో ఎదురుచూసే గండు కోయిలలు మాత్రం కాదు. సీమ నెత్తుటి చుక్కకే కాదు, చిట్లిన చెమట బిందువులకు కూడా కవితా గొంతు ఉంటుంది. అది హాయిగా జోలపాడదు, విప్లవమై విల్లెక్కుబెట్టిస్తుంది, గాండ్రిస్తుంది, ఉరుముతుంది. ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. మదింపు చేస్తుంది. మనసులను ముడేస్తుంది. ఇదండి మా జీవితమని సమాజ యవనిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేస్తుంది.

అష్టదిగ్గజాల్లోని అల్లసాని పెద్దన, ధూర్జటి, పింగళి సూరన అందించిన వారసత్వాన్ని నెమరేసుకోవాలి. వేమనలోని మూఢత్వాలపై ధిక్కరణ, పోతులూరి వారి తాత్త్వికత ప్రజల నాలుకలపై నిత్యం నాట్యమాడుతున్నాయి. ప్రారంభంలో కవిత్వాన్ని హృద్యంగా పద్యంగా చెప్పిన పద్యకవులు మణూరు రామారావు, రాప్తాటి ఓబిరెడ్డి, గొట్టిపాటి సుబ్బరాయుడు, ఆశావాది ప్రకాష్‌రావు లాంటి కవుల కవిత్వాన్ని మననం చేసుకుంటూ తరువాత తరం కవులు తమ కవితాసేద్యాన్ని, వారసత్వాన్ని అందుకున్నారు. నదితనాన్ని కోల్పోయిన పెన్నమ్మ ఎదబాధను వర్ణించిన విద్వాన్ విశ్వం, పెన్నేటి పాట ఎంతమంది కవులకు ప్రేరణగా నిలిచిందో, రాయలసీమలోని ప్రతి జిల్లా కూడా కవిత్వానికి ప్రాతినిధ్యం బలంగా ఉంది. కవిత్వాన్ని కాగడాలా పట్టుకొని జీవించిన వ్యక్తి ఎస్. మునిసుందరం. మునిసుందరం జెండా ఉచ్చులో చిక్కినా మా వూరు / చేతులు కోల్పోయిన ఫ్యాక్షన్ బ్రదర్‌లా ఉంది అంటూ కనువిప్పు కవిత్వం రాశారు. రాయలసీమ మట్టినేను / నాకిన్ని



నీళ్లు కావాలి / ఎండలు మండి పోతున్నా గుండెలవిసిపోతున్నా / మీసాలు తిప్పే పౌరుషం నాది / అన్నమడిగితే అగ్రహారాలిచ్చిన గతంనాది / నేడు గుక్కెడు నీళ్లకోసం కటకట పడుతున్న గడుసునాది అంటారు. నూతలపాటి గంగాధరం, చీకటి నుంచి వెలుగులోకి అనే శీర్షికలోనే అభ్యుదయం చూపాడు. విమర్శకుడిగా గుర్తింపు పొందిన రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి 'పొలి' అనే కవితా సంపుటిలో అభ్యుదయం నింపారు. దాము అనే కవి మనం కొత్తగా నేర్వాల్సిన జీవన భాష గురించి చెబుతూ జీవితం గురించి మనకు తెలిసిన భాషకు అర్థం సమకూర్చేలోపు అస్తిత్వం మారిపోతుంది. యినుపపాదాలకింద చిట్లే అసహాయ స్వరపేటికల/ నీలపు నిప్పులభాష నేర్వాలిప్పుడు / ఉరికంబపు నల్లటి ముసుగును చీల్చుకువచ్చే చురకత్తుల పోరాటభాషను నేర్వాలిప్పుడు / మారణం కన్నా జీవరణం భయపెట్టే తరానికి ముందు నేర్వాల్సిందిదే అంటూ చైతన్యం నూరిపోశాడు. కర్నూలు నుంచి కవిత్వం రాస్తున్న జి.వెంకట కృష్ణ తన కవితల్లో నా కలలను భగ్నం చేస్తే కవితనవుతాను అంటారు. 'ఎన్నిసార్లు కలలు భంగం చేస్తావు అన్నిసార్లూ అక్షరాన్ని కాపలాగా ఉంచుకుంటాను' అంటారు. ఫ్యాక్షన్ ఉచ్చులో ఇరుక్కొని ఎందరో అమాయకులు ప్రాణాలు విడిచారు. తగాదాలు ఒకరివి తన్నుకు చచ్చేది ఒకరు. ఫ్యాక్షన్ వల్ల ఎన్ని ప్రాణాలు సమిధలు బూడిదై పోయాయో తెలిపారు. వారికి జ్ఞానోదయం నింపేలా. 'ఎవరి పంతాలకో తెగపడుతున్న పందెంకోళ్ళు / ఎవరి ఆటలోనో పావులు ఎవరి పౌరుషమో చిందిన రక్తంలో... అంటూ మేల్కొనాల్సిన లొచ్చిన తరుణాన్ని తట్టిలేపారు.


మల్లెల నరసింహమూర్తి అనే కవి రాయలసీమ రాళ్లుకూడా తిరగబడతాయని, తిరగబడాలని కవిత్వం రాస్తారు. ప్రజలు నీటికోసం ఉద్యమించాల్సిన వైనాన్ని వివరిస్తారు. రాజకీయ టెండమావుల వెంట తిరిగి తిరిగి అలసిపోయాం / ఇక వాళ్లకు తిరగటం చేతకాదు, తిరగబడటం తప్ప/ వలసబోవటం పరిష్కారం కాదు/ కరువు శత్రువును సంహరించడానికి జలఖడ్గమే ఆయుధం అంటారు. ప్రాంతీయత, అభ్యుదయం రెండూ కనిపిస్తాయి. ఈ కవితలో. 'శవాల మీద బట్టలమ్ముకనే రాజకీయానికి / రైతు వెన్నెముక పదవులు కట్టబెట్టే సాధనం కాదు/ పళ్లు రాలగొట్టే వజ్రాయుధం కావాలి' అంటారు చంద్రశాస్త్రి.

జూపల్లి ప్రేంచంద్ తన కవితల్లో హత్యలు కాదు/ మాకు ఆత్మహత్యలే కొత్త, తలమీద మెడలు నరికే నా కొడుకులు/ ఈ పొద్దు పురుగుల మందు తాగేదేందిరా సిగ్గులేకపోతేసరి / ద్రోహంచేసిన్నాకొడుకుల తల తెగనరికివెయ్యాలిగానీ / ఆత్మహత్యగా మారేదేందిరా నాకొడుకా అంటూ చావడం కాదు నిన్ను చావుకు పురిగొల్పే పరిస్థితులను చంపాలి అంటూ కటువుగా చెప్తారు. జీవితాలమీద కన్పించని యుద్ధక్షేత్రం/ అప్రత్యక్ష దాడిలో పీనుగులను చేసి ఆడుకునే శత్రువులు ఇద్దరే ఇద్దరు కరువురక్కసి, రాజకీయ మృగం అంటూ రాయలసీమకు రాజకీయనాయకులు చేసిన మోసాన్ని ఎండగట్టారు రఘుబాబు జంధ్యాల. వాన కాకుండా రాజకీయ నాయకులు చేస్తున్న మోసాన్ని బహిర్గతం చేశారు వై రాములు. నీటికోసం చేయిచాపితే/ రాజకీయాలన్నీ ఓటుకోసం చూస్తారని కుయుక్తులను కవిత్వీకరించారు. "ప్రజల కన్నీళ్లను నీళు కావంటారు / మరి ప్రజల కళ్లల్లో నీరు నిప్పై రగిలేదెన్నడు" అంటారు బిక్కి కృష్ణ. మగ్గం నేసి బతుకుతున్న నేతన్నలను బలితీసుకుంటున్నది సామ్రాజ్యవాదం ఒగటయితే, పాపం పాలనా యంత్రాంగానిది కూడా అంటారు సీనియర్ కవి రాధేయ.

'చేతులకోసం' అనే కవితలో రాకాసి రాతి పొదల ఒత్తిళ్లకు / చిలక పచ్చనాకులు ఆగ్రహించి ద్రవించి / మంటలైమండే ఇంధనాలయినట్లు బిగుసుకుంటున్న పిడికిళ్లు / బద్ధలౌతున్న అవేశాలు అంటూ, మా సహనాన్ని పరీక్షించకండి అవి ఉ ప్పెనలై ఉద్యమిస్తాయని సడ్లపల్లి చిదంబరరెడ్డి తన కవితలో చెప్పారు. 'కొత్తపాట కావాలి' అనే కవితలో సురగేని రామకృష్ణ. ప్రతి వాడూ నీపై నడిచి వెళ్లి కిరీటాన్ని మోస్తున్నవాడే అంటూ మోసం చేసినవారిని ఎదురించడానికి నీ కొక కొత్త పాట కావాలి / నువ్వొక కొత్త గొంతుక కావాలి / మరో ఉద్యమం కోసం ప్రతి అడుగును సిద్ధం చేయాలి అని జనాల్లో అభ్యుదయం రావాలని ఆకాంక్షించారు. 'తడి ఆరిన గొంతుక' అనే కవితలో అక్షరమాలి సురేష్ ... స్తంభించిన ప్రాణానికి ఇపుడు బైపాస్ సర్జరీలే జరగాలి, స్టంట్లు కాదు. మా అందరి అవయవ మూలాల్లోకి నదులు ప్రవహించాలి అంటారు.

వొరుప్పోటు కవితలో రాజీలేని పోరాటాలు చేయాల్సి వచ్చినపుడల్లా/ సామాన్లు సర్దుకొని రాజ్యాలు మారుతున్న మాదీ ఉందిలెండి తప్పు అంటూ, పంటలకు కాదు మందులు పిచికారీ చేయాల్సింది తెగుళ్ళు పట్టిన మన మెదళ్లకు, రాజకీయ కుయుక్తులకు జీవామృతాన్ని పిచికారీ చేయాలి అంటారు.

ఎర్రని తొలి కిరణాల సాక్షిగా / మరో ప్రపంచం సాధ్యమని




కవిత్వీకరిస్తా అంటారు కెంగార మోహన్. 'కిటికీపిట్ట ఖైదుకవిత్వం' అంటూనే వియత్నాం విప్లవ కారుడు, కవి హొచిమిన్‌ని గుర్తు చేస్తారు పలమనేరు బాలాజీ. ఉరిశిక్ష కూడా విప్లవానికి మరొక ప్రారంభమే అంటారు రమణజీవి 'నలుగురు పాండవులు' కవితలో. ప్రస్తుతం జరుగుతున్న వాస్తవాలను ఎద్దేవా చేస్తూ కవితలు రాశారు. సౌభాగ్య పేరుతో కవిత్వం రాసిన డా.పి.విజయకుమార్ 'ఎర్రపిడికిలి' అనే కవితలో రక్తనాళాల ఉద్రిక్త శక్తి / ఆత్మవిశ్వాసం పూరించిన జీవశంఖం/ చేతినుండి పెకిలి వచ్చి చెలరేగిన గుండెలా ఉందంటాడు. ఎవరో ఒకరు పూనుకోవాలి / పూనకం పట్టిన ఈ లోకానికి పూర్వజ్ఞానం కలిగించాలి యాంత్రిక జీవితంలో మంత్రబద్ధులైన మనుషుల మెదళ్లకు షాక్ ట్రీట్‌మెంట్ ఇచ్చి మేల్కొల్పాలి అంటారు. మధురాంతకం మహేంద్ర, కాల సముద్రతీరంలో, ముషాయిదా అనే కవితలో అభ్యుదయం ఆవిష్కరించారు. జలగండం కవితలో వై. శ్రీరాములు, కరువు చెరనుంచీ భూమిని విడిపించాలంటే నీళ్లకు వేసిన సంకెళ్లు తెంచాల్సిందే అంటారు. తూముచెర్ల రాజారాం అతడే అనే దీర్ఘ కవితలో నిజంగా ఇవాళ అతడు చితి చుట్టూ తిరిగే చిల్లుకుండే కావచ్చు / రేపు మాత్రం అతడు మానవ నాగరికతానువంశిక దర్పణానికి/పొగరుగా ఎగిరే పతాకం కాకపోడు అని భవిష్యత్ ఆశా కిరణాలను వెచ్చగా ప్రసరిస్తున్నాడు. ఎస్. జయ మట్టి పువ్వు కవితా సంపుటిలో 'ఒక జీవితాన్ని జీవించాలంటే / మనిషికి చాలా జన్మలు కావాలి' అంటారు. ఇంద్రవెల్లి రమేష్ 'ప్రమాద సంగీతం' కవితలో ప్రభుత్వం ముందు లొంగిన వాడూ/ జీవితం ముందర లొంగినవాడూ ఇద్దరూ ఒక్కటే అంటారు. కాశీభట్ల వేణుగోపాల్ మళ్లీ ఎగరాలని కవితా సంపుటిని కోనేటి ముతా వేలిముద్రలు కవితా సంపుటాల ద్వారా అభ్యుదయాన్ని నింపారు. నాగప్పగారి సుందర్‌రాజు చండాల చాటింపు కవితలో 'మాకు ముహూర్తాలతో పనిలేదు/ మీ ముందు మాటలక్కర్లేదు / మాదిగమాటే మాట్లాడతాం. ఇదే చాటింపు' అంటారు.

రాప్తాడు గోపాలకృష్ణ ఏదీ ఏకవచనం కాదు అంటూనే సమూహానికి దూరమైన కవి పిల్లలచేత బాలసంఘాలు పెట్టించి ఉద్యమాన్ని ఉడతాభక్తిగా విప్లవ పునాదులు నిర్మిస్తాడు. అంకురం పేరుతో 19 మంది యువకులచే ఒక చిన్న కవితా సంపుటి వెలువరించారు.

డి. శిరీష అనంతపురం నుండి కవిత్వాన్ని రాస్తున్నారు. రజిత కొండసాని ఒక కల, రెండుకళ్లు అనే కవితా సంపుటిని ఆవిష్కరించారు. స(రి)తిగమలు అనే కవితలో స్త్రీలపై అనాదిగా జరుగుతున్న మోసాలను ఎండగట్టారు. ఈమె తన కవితల్లో ప్రేమ, నిలదీత రెండూ కనిపిస్తాయి. పల్లిపట్టు నాగరాజు 'బోసినవ్వులరెమ్మ' అనే కవితలో 'కాసేపు వదిలిపెట్టు నానా/ కాలం కంటి రెప్పలకింద/ ఉబికే కన్నీళ్లు తుడిచే భరోసానీడల్నీ/ ఊపిరి బిగబట్టి నిలబడే పోరాట వాక్యాన్నో/ నల్లనల్లని నీకళ్లంత అందమైన అక్షరాలతో/ రాసిరావాలి అంటూ కవిత్వం కాలక్షేపం కోసం కాదని కదిలించడానికి పెనుమార్పుకు సంకేతమని వ్యక్తపరుస్తారు. డబురా ధనలక్ష్మీ, నబీ రసూల్ ఇంకా అనేకమంది మంచి కవిత్వం రాస్తున్నారు.

షమీవుల్లా, సి.వి.సురేష్ దస్తగిరి, చిరుగు సురేష్‌బాబు, రామనాథం నాయుడు, సొదుం శ్రీకాంత్, టి.వెంకటేష్, పాలా వెంకట సుబ్బయ్య, భైరవు రెడ్డి నారాయణరెడ్డి, దోర్నాథుల సిద్ధారెడ్డి, కాట్రగడ్డ దయానంద్, సుబ్బారెడ్డి, వెంకట్రామిరెడ్డి, హెచ్ ఆర్‌కె, వేంపల్లెరెడ్డి నాగరాజు, ఐదుల సైదాచారి, బాబ్జీ, కె.ఎస్. రమణ, బడబాగ్ని శంకరరావు, రాసాని, గోప్యం కరుణాకర్, దాము, లక్ష్మీ కందిమళ్ల, ఉద్దండం చంద్రశేఖర్, లోసారి సుధాకర్, జానీ తక్కెడ శిల, జాబిలి జయచంద్ర, కుంచె లక్ష్మినాగరాజు, అంకే శ్రీనివాస్, నాగేంద్ర, నాగశేషు, అరుణ, చక్రవర్తి, తెలుగు వెంకటేష్, ఈ రాఘవేంద్ర, పల్లభ శ్రీనివాస్ లాంటి అనేకమంది రాయలసీమకు ప్రాతినిధ్యం వహించే కవిత్వం వెలువరించారు. ఇంకా సోషల్ మీడియా ఉపయోగించడం ద్వారా చాలామంది కవిత్వం రాస్తున్నారు. అందులో ఒట్టివేవి, గట్టివేవి అనేది కాలం నిర్ణయించాలి.




■



## బతుకు తీరు

నాలుగు గొప్ప, మెప్పు మాటలు చెప్పి
పేద్ద మనిషినయ్యాను
నా నాలుక రుచి గలది
అసత్యాలే వొలుకుతుందంటే ఎవరూ వొప్పరేం
కాసిన్ని మంచి, మెచ్చిన పనులు చేసి
మహాత్ముడినయ్యాను
చెడు ఎక్కువే చేసినా చెల్లిపోయిందిలే
పుట్టిన రోజని ప్రకటించుకున్నా
అభిమానం హెూదా తీపిలో ముంచెత్తింది
జన్మ అంటే ఏమిటో, ఎందుకో తెలియకుండానే
ఎక్కిన సోపానాలెన్నో తొక్కిన మెట్లెన్నో!
ఎక్కడ వున్నాననే 'తిక్క' ప్రధానమయ్యింది
గాలివాటుగానో, చేతివాటుగానో
బుద్ధివాటుగానో జరుగుతుందిలే
నిలబెట్టుకోవటమే నా మంకుతనం
హామీలూరుతుంటాయి
నమ్మకాలనే వెతికి పట్టాలి!

తెలివితేటలూ పుట్టగొడుగుల్లెక్కనే
సంపదల వారసత్వంగా మలచాలి
ఎవడు బతికేడు ఇంతింతకాలం అని గదా
నాలుగేడులు ఎక్కువో తక్కువో
నలుగురు మోసే వరకు వుండునో లేదో
చరిత్ర రహస్యంగా పేజీలు లిఖిస్తుందట
అయితే యేం?
పోలిక వొదిలేసి బతికేస్తే పోలా!

- దాసరాజు రామారావు

## వెళ్ళిపోయాక ...

ఉన్నంతసేపూ మణికట్టు మీద
ముళ్ళకెంత తొందరో
ఒకదాని వెనుక మరొకటి
అల్లరిపిల్లల్లా పరుగుపందెం వేసేవి

ఉన్నంతసేపూ
మాటలు సీతాకోకలై పెదవులపై ఎగురుతూ
మనసు ముడులను సుతారంగా విప్పేవి

ఉన్నంతసేపూ పసందైన రుచులు
వేర్వేరు రూపాలతో నాలుకలపై నాట్యమాడేవి


ఉన్నంతసేపూ
నడక దారిలో మూలమూలలను
బహిర్గతం చేసే సరికొత్త కోణాలు
పరిచయమయ్యాయి
ఇంత బతుకుని భుజాన మోసినా
చవి చూడని అనుభవాలు సైతం రెక్క విప్పాయి

అంతెందుకు ...
జీవితపు మరొక పార్శ్వం పరిచయమై
పెద్ద గీత ముందర చిన్న గీత గీసి
బరువు హఠాత్తుగా తేలికైంది

వాళ్ళు వెళ్ళిపోయాక
శబ్దం శూన్యాన్ని తొడుక్కుంది
సమయం
చెప్పలేని భావంతో
మూలన ముడుచుకుంది
రంగు వెలిసి
రాత్రులు పగళ్ళు పగుళ్ళు బారాయి

గదులు సైతం గుక్కపెట్టి
గుండెల్లోని ఖాళీతనాన్ని పూడ్చలేక
తమలోకి అడుగిడి
సారవంతం చేసే
మెత్తని పదధ్వనులకై వేచి చూస్తూ ...

- పద్మావతి రాంభక్త
99663 07777








### వాస్తవ ప్రతిబింబాలు

# కాట్రగడ్డ దయానంద్ కథలు

- వి.పూర్ణచంద్రశేఖర్ రావు

98496 52183

**తె**లుగు సాహిత్య చరిత్రలో ఎందరో సాహితీవేత్తలు ఉద్భవిస్తూనే ఉన్నారు. వీరు తమ రచనల ద్వారా సమాజాన్ని సక్రమమైన మార్గంలో నడిపించే ప్రయత్నం చేశారు. సమాజంలోని అసమానతలను రూపుమాపే ప్రయత్నంలో చాలామంది కవులు తమ కవితా వస్తువులుగా అసమానతలను స్వీకరించి, రచనలు చేసి సమాజాన్ని జాగృతం చేయటానికి ప్రయత్నించారు. ఆర్థిక అసమానతలు, సామాజిక లింగ వివక్షలు వంటి అనేక సమస్యలే నేటికీ సమాజంలో ఉన్నాయి. అలాంటి సమాజంలో 'కలం' అనే ఆయుధాన్ని ధరించి, సమాజానికి పట్టిన దురవస్థలను దుమ్ము దులిపి, సమాజాన్ని సక్రమమైన మార్గంలో పెట్టిన కవులూ రచయితలూ ఎందరో ఉన్నారు. అలాంటి వారిలో ముందు వరుసన చేర్చగలిగిన రచయిత కాట్రగడ్డ దయానంద్.

దయానంద్ గారి జన్మస్థలం ప్రకాశం జిల్లా కొప్పోలు గ్రామం. అమ్మనబ్రోలు, విజయవాడ మొదలగు ప్రాంతాల్లో విద్యాభ్యాసం కొనసాగించారు. ఉస్మానియా యూనివర్శిటీ నుంచి ఎంఏ తెలుగు పూర్తి చేశారు. ఇప్పుడు వృత్తిరీత్యా పోస్టాఫీసులో ఉద్యోగి అయిన ప్రవృత్తి రీత్యా రచయితగా మారారు. నిరంతరం పత్రికా పఠనం, వ్యాసాలు, సాహిత్య విమర్శలు వంటివి చదవటం ద్వారా దయానంద్ గారిలో సాహిత్యం పట్ల ఆసక్తి కలిగింది. ప్రముఖ కవి ఎండ్లూరి సుధాకర్, కె.సదాశివరావు, వాసిరెడ్డి నవీన్ వంటి ప్రముఖుల ప్రోత్సాహం కూడా వీరు రచయితగా మారటానికి తోడ్పడింది. ఎస్వి భుజంగ రాయశర్మ, కె.వి. రమణారెడ్డి, చెంచయ్య, ఇంద్రగంటి భానుమూర్తి వంటి సాహితీ ప్రముఖుల ప్రభావ వల్ల కూడా సాహితీ రచన వైపు ఆసక్తిని పెంచుకున్నారు.

దయానంద్ తన రచనలతో సాహిత్య జగత్తులో తనకంటూ ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. పదిహేడేళ్ళ వయస్సులో 'లాటరీ' అనే కథ రాశారు. తదుపరి రెండు కథా సంపుటాలు, ఒక కవితా సంపుటిని వెలువరించారు.

- పండుటాకు – కథా సంపుటి – 18 కథలు
- గుండ్లకమ్మ తీరాన – కథా సంపుటి – 14 కథలు
- మెతుకు – కవితా సంపుటి – 39 కవితలు

దయానంద్ కథలు మంచి పేరు ప్రఖ్యాతులు పొందాయి. రాసిన కథలు కొన్నే అయినా, గొప్ప కథకుల జాబితాలో చేరిపోయారని సాహితీవేత్త నాగభైరవ కోటేశ్వరరావు ఒక సందర్భంలో దయానంద్ గురించి వ్యాఖ్యానించారు.

కాట్రగడ్డ దయానంద్ గారి కథలు స్పష్టమైన సంభాషణతో, ప్రాంతీయ మాండలికంతో, చక్కని అర్థవంతమైన శైలిలో సాగుతాయి. ఈ కథా సంపుటాల్లో గ్రామీణ రైతుల కథలు, వృద్ధుల కథలు, దళితుల కథలు, స్త్రీల సమస్యా కథలు, సారా వ్యతిరేక కథలు, వీధి బాలల కథలు వంటివి మనకు దర్శనమిస్తాయి.

దయానంద్ గారి నేపథ్యం పల్లెటూరు దిగువ మధ్య తరగతి రైతు కుటుంబం. పరిశీలనా దృష్టి అధికంగా కల దయానంద్ కథల్లో మానసిక చిత్రణ చక్కగా చేశారు. కథ మధ్య తన అభిప్రాయంతో నిమిత్తం లేకుండా పాత్రల ప్రవర్తన ద్వారానే కథను నడిపించటం ఆయన ప్రత్యేకత. ఈ కవికి మట్టి తడి బంధం తెలుసు. మానవతా విలువ తెలుసు. విచ్ఛిన్నమైపోతున్న మహత్తర మానవ సంబంధాలను పరిశీలించిన ఆర్తి ప్రతి కథలో మనకు స్పష్టంగా కనిపిస్తుంది. దయానంద్ కథల

చదువుతుంటే నిజమైన కథ పల్లెలోనే ఉండిపోయిందని పిస్తుంది. నగరం మేలి ముసుగులు గ్రామీణ ప్రాంతానికి గిట్టవేమీ అనిపిస్తుంది. తాను కథ వెనుక ఉన్నాననే స్పృహ కల్పించకుండానే పాఠకుడితో కథలు చదివింప గల నేర్పు సాధించిన మంచి కథా రచయిత దయానంద్. ఈయన శైలి ఏ నగీషీలూ నాజూకులూ లేకుండా సహజంగా చదివించుకు పోతుంది. దయానంద్ గారి కథలు పల్లె బతుకులకు అద్దం పట్టే కథలని, పల్లె చెప్పిన కథలని, గ్రామీణ జీవన చిత్రణ నడుస్తున్న చరిత్ర అని, మట్టి మనుషుల జీవితాల్ని దోసిట పట్టిన ఇతివృత్తాలని, మట్టి వాసనను గుబాళించే కథలని, మనసుని చిత్రించే కథలని .. సాహితీవేత్తలు పేర్కొన్నారు. దయానంద్‌గారి కథలు గ్రామాల్లో ని మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి జీవితాలకు నిలువెత్తు అద్దాలు. పల్లె జీవితాలతో మమేకమైన రచయితలు తప్ప చిత్రించలేని అద్భుత గ్రామీణ వాతావరణ చిత్రణ ప్రతి కథలోనూ కనిపిస్తుంది. మనిషి వాసనకి, మట్టి వాసనకు ప్రతీకలు ఈ కథలు. కథల్లోని సంఘటనలూ, పాత్రలూ పాఠకుడి మనసు మీద బలంగా ముద్రవేస్తాయి.

దయానంద్ తన ఉద్యోగరీత్యా కూడా ప్రకాశం జిల్లా పల్లెటూళ్ళు, పట్టణాలలో మనుషుల జీవితాల్ని చాలా దగ్గరగా పరిశీలించారు. తన కథల్లో పాత్రలు, వాళ్ళుండే చోట్లు, వారు చేసే పనులూ ఆయనకు చాలా పరిచయం. అందుకే ఈ కథల వాతావరణంలో అంత సహజత్వం ఉంటుంది. దయానంద్ గుండ్లకమ్మ నదీ తీరప్రాంతాల్లో వచ్చిన మార్పులకు ప్రత్యక్ష సాక్షి. ఆ నేపథ్యంలో జీవితాలు, మానవ సంబంధాలు ఎలా మారుతున్నాయో తెలిసి చలించిన రచయిత. ఒకప్పుడు స్వతంత్రంగా ధైర్యంగా జీవించిన చిన్న రైతుల జీవితాలు అస్తవ్యస్తం కావడం, పెద్దవాళ్ళ వ్యాపారాల కోసం, చిన్నవారు భూములు అమ్మేసుకోవాల్సి రావడం ఆయన దగ్గరగా చూశాడు. భూమితో రైతుకి ఉన్న సంబంధం రైతు బిడ్డలకు లేకపోవడం గమనించాడు. వాటిని తన కథల్లో అద్భుతంగా చిత్రించారు. ఆ కథలన్నీ ఆర్తిగా, ఆత్మీయుల కబుర్లు, మంచీ చెడ్డా చెప్పినట్టు ఉంటాయి. ఆ కథల్లో పాత్రలు రక్తమాంసాలతో నిజం మనుషుల్లా ఉంటాయి. సగటు మనుషుల బంధాలూ, బాంధవ్యాలూ, బాధ్యతలు కలిగి ఉంటారు. వాళ్ళు అంతంత మాత్రం నిరాశకు లొంగేవారు కాదు. బతుకు లడాయిలో ఢక్కా ముక్కలు తిన్నవాళ్ళు. తుపానుల ముందు తలవంచినా, పరిస్థితుల కొరడా దెబ్బలకి నడుం విరిగినా, తిరిగి నిటారుగా నిలబడి భవిష్యత్‌పై ఆశతో, ఆత్మ విశ్వాసంతో తలెత్తి ముందుకు సాగేవాళ్ళు. బతకంటంలో విశ్వాసం ఉన్నవాళ్ళుగా మనకు కనిపిస్తారు.

దయానంద్ కథల్లోని పాత్రలు మనల్ని నిశ్చేష్టుల్ని చేస్తాయి. ఈ కథకుడు కథల్లో తానో పరాయివాడుగా ఉంటూ పాత్రల్లోకి ప్రవేశించి మనల్ని అగాధాల్లోకి తోసేస్తాడు. ఇలా ఉంది జీవితం.. ఇప్పుడు మన కర్తవ్యం ఏమిటని ఓ బైరాగిలాగా నిష్క్రమిస్తాడు. ఆయన కథల వెనుక యథార్థ వ్యథలు కోకొల్లలు. 'పండుటాకు' సంపుటిలో గాని, గుండ్లకమ్మ తీరాన కథా సంపుటిలో గాని వర్తమాన దు:ఖ వాతావరణాన్ని దృశ్యాలు దృశ్యాలుగా విప్పటానికి చేసిన అతి సున్నితమైన మేధోచర్యని మనం గమనించవచ్చు. ఇవి పది కాలాలపాటు వెన్నాడే కథలు. ఓ రైతు బిడ్డగా, గ్రామీణ పక్షపాతిగా ఎక్కడ నిలబడాలో తెలుసుకోవటంతో ఈ రచయిత తన చారిత్రక కర్తవ్యాన్ని సరిగ్గానే నెరవేరుస్తున్నాడు. ఆయన పాత్రలు ఏ రాజకీయాలూ మాట్లాడవు. గాంధీలా సత్యాగ్రహం చేస్తాయి. దండయాత్రలు చేస్తాయి. ఎక్కడా దుస్సాహసికులు, పిరికివారు కనిపించరు. ఈ దేశంలో మేమూ మనుష్యులమే – అని చెప్పే విధంగా పాత్రలు మనకు కనిపిస్తాయి. సరిగ్గా ఇక్కడే ప్రేమ్‌చంద్ వారసుడుగా కనబడతాడు. ప్రేమ్‌చంద్ మాదిరి ఓ సంయమన రచయిత దయానంద్. 'ప్రేమ్‌చంద్‌ని, దయానంద్‌ని పక్క పక్కన కూర్చోబెడితే ఆశ్చర్యంగా ఇద్దరూ ఒకరే అనిపిస్తుంది. తెలుగు సాహిత్యంలో ప్రేమ్‌చంద్ వారసుడిగా, దయానంద్ కథల్ని పరిశీలించాల్సిన అవసరం వర్తమాన పరిశోధకుల మీద ఎంతో ఉంది' అని సాహితీవేత్త శ్రీరామ కవచం సాగర్ వ్యాఖ్యానించారు.

తక్షణ సంఘర్షణలకి వెంటనే స్పందించి కథలు రాసే ఒడుపుని సంతరించుకొన్న దయానంద్ కొన్ని వర్తమాన సంఘటనలను అద్భుత కథలుగా మలిచారు. ఇందులో 'అలజడి', 'నేల తిమ్మిరి', 'గుండ్లకమ్మ తీరాన', 'అతడు–ఆమె', 'ఒక స్వప్నలోకం', 'పండుటాకు', 'శిశిరం', 'నీడ', 'మనిషీ – మట్టి', 'ఆకురాలు కాలంలోకి – లాంటి కథలు ఇందుకు ఉదాహరణలు. ఇలాంటి కథలను దయానంద్ మాత్రమే రాయ గలరు. 'వస్తువే శిల్పమై అల్లుకుపోవడం మంచి కథకుల లక్షణం. సాహిత్యకారుని జిజ్ఞాసకూ, స్వీకరించే జీవితానికి సామరస్యం కుదిరినప్పుడు కథలు సలక్షణంగా గుబాళిస్తాయి. కాట్రగడ్డ దయానంద్ ఈ అరుదైన సామరస్యానికి చక్కని ఉదాహరణ' అని సాహితీవేత్త పసునూరి శ్రీధర్ అన్న మాటలు ఆయన కథల్లో అడుగడుగునా మనకు స్ఫురణకు వస్తాయి. ■

## ఆకు తొడగని కాంతి

చెప్పడం కష్టమేమి కాదు
బూడిద పువ్వులపై నుండి
దుర్గంధ తరంగాలలోకి జారిపోవడాన్ని
కాళ్ల కింద పడి నలిగే
దేవుళ్ల గుసగుసల్ని,
రక్తపాత విజయాలు ఇంకిపోవడాన్ని
చర్మంలోంచి పాకే భయం విరిగిపోవడాన్ని

ఉడుకుతున్న సున్నంబట్టీలో
ముఖాలు చెదిరిపోతాయి
అసూయా భానుడు
వేటగాడి కళ్లలోకి సుస్వరాలను నేస్తాడు
కుచించుకుపోయిన మనిషిని
రాత్రి నెర్రెల్లోంచి బయటకు తీయాలి

నిద్రను ధరించినప్పుడు
సుడులు తిరిగే సాయంకాలాల్ని వలుస్తున్నవాడు
నునుపెక్కిన ఉషోదయాన్ని
దుప్పట్లో జారవిడచడం
పురాతన తప్పిదమే
కడుపులో మాడిపోయే ఆకలి నెలవంకను
స్వప్నం లేని
ఆకు తొడగని కాంతి మూలుగుల్లోంచి వేలాడే చీకటిని,
ఎండిన తల్లి పాలిండ్లను,
అంతుచిక్కని నీలి ఆకాశాలు
కఠిన రోదన
బండరాళ్ల కొమ్ములు
వినపడని మూలుగురెక్కల తాకిడి
పోగొట్టుకున్న నిడివి లేని ఏకాంతం
మనుషులుగా, మబ్బులుగా
కొమ్మల నుండి వీచే లేతగాలి తరగలా
సూర్యకాంతిలా
నది నెత్తిమీద పొద్దులా వికసించాలి
నిశ్శబ్దానికి కట్టుబడి ఉన్నచోట
అక్షరం నాట్యమాడుతుంది!

**- అఖిలాశ**
7259511956



## ఎప్పుడూ అదే మోసం

ఫిరదౌసి మోసపోయినప్పుడే
మాకు రాజుల అన్యాయాలు
అవగతమై అలవాటైపోయాయి
చరిత్ర తెలిసినోళ్ళం
ఈ ధరిత్రిపై విచిత్రాలెన్ని చూడలేదని
ఎండమావుల్లో నీరుండదని
మాకు తెలిసిందే కదా
మాట ఇవ్వడం వరకే
ఆ రాజసం ఆ అట్టహాసం
తరువాత ఏం జరిగేదీ అందరికీ ఎరుకే
రాజులు రారాజుల మాటున
యువరాజుల కోసమే కదా
మీ తాపత్రయ తంత్రాలు
ఎవరిన ఆనందింపజేయాలని
ఈ ప్రయత్నాలు తిరస్కారాలు
ఏలిన వారెవరైనా రాలినవారం మేమే కదా
గోడు చెప్పుకోను, మాకెవరు మిగిలారింక?
ఏ రేడు మా కన్నీరు గుర్తించగలడో కదా
ఏ తోఫా ఎప్పుడాపేస్తారో
ఏ దుల్హన్‌కు మాత్రం ఏం తెలుస్తుంది?
తోడుంటానన్న భాయి లోటుందని చెబితే
ఖాళీ హృదయం వెర్రి చూపు చూసింది
అద్దంలోంచి ప్రతిబింబం వెక్కిరించి నవ్వింది
నీ చదువు నీవు చదువుకోమని
మస్తిష్కం భాషించింది!

**- జంధ్యాల రఘుబాబు**
9849753298



# ఉద్యమ రుతువు!

మౌనం మౌనం మౌనం
ఇంకా ఎంతకాలమీ మౌన జపం?
ఇల్లూ వాకిలీ పిల్లలూ
మొత్తంగా మన అస్తిత్వం
అన్నీ మౌనంగానే మన కళ్లముందే
మట్టి కొట్టుకుపోతున్నాయి
ఇంకా ఎంతకాలమీ మౌనం?

రుతువులు మాయమయ్యాక
పూలెలా పూస్తాయి, కాయెలెలా కాస్తాయి
రుతువుల్ని వాయిదా వేసే నేర్పరులు వాళ్లు
వారి వాయిదాలను నమ్మటం
మన తెలివితక్కువతనం కాదా

ఆ విద్యావనంలో పూసిన
పసిమొగ్గల్ని చూడు
రుతువును ఆయుధంగా చేతపట్టి
ఎంతెర్రర్రగా పూశాయో
పెద్దల్నే కాళ్ల దగ్గరికి
ఎట్లా రప్పించుకున్నాయో

ఆ మొగ్గల్నే వికసింపచేసేవాడా!
ఆ మొగ్గలకే పరిమళాలద్ది మురిసిపోయే తల్లీ!
నువ్వు చేస్తున్నదేమిటి?
మౌనం మౌనం మౌనం
ఇంకా ఎంతకాలమీ మౌన జపం

ఎంతైనా వాయిదాలకు
అలవాటుపడ్డ జీవితం కదా మనది
వాయిదాల్ని ప్రేమిస్తూనే వుంటాం
చివరికి మన బతుకులే వాయిదా పడేదాకా
వాయిదాలను మౌనంగా ఆరాధిస్తూనే వుంటాం
ఇక వాయిదాలను వాయిదా వేయాల్సిందే

నువ్వు కంటున్న కలల మొగ్గలు పూలవ్వాలంటే
నువ్వు ఆశించిన ఫలాలు నీకు దక్కాలంటే
కొత్త వ్యవసాయం మొదలెట్టాల్సిందే
రుతువును పిడికిళ్లకెత్తుకుని
పోరుబాట పట్టాల్సిందే

మిత్రుడా! మిత్రురాలా!
చరిత్ర మరిచావా?
పోరాడితే పోయేదేం లేదు
బానిస సంకెళ్లు తప్ప!

మన చేత
వాయిదాల పాఠాలు వల్లెవేయిస్తూ
మౌనం మౌనం మౌనం అంటూ
మౌనం పాటించమనీ పాటించమనీ
మన చేత మౌన జపం చేయిస్తూ
చివరికి మన ఉనికికే
మౌనం పాటింప చేస్తారు వాళ్లు

మిత్రులారా!
ఇక మౌనాన్ని వీడే సమయం ఆసన్నమైంది
రుతువు పూసే కాలం దగ్గరపడుతోంది

అదిగదిగో కొత్త రుతువు
మన కలలు పూసేందుకు
మన ఆశల ఫలాలు
మన చేతికందేందుకు
ఉద్యమ రుతువై కదం తొక్కబోతోంది!
వానచినుకుల్లా మొదలై
జడివానలా మారుదాం
మన వరద తాకిడికి
వాళ్ల పీఠాలు కదలాల్సిందే ఇక!

- చిత్తలూరి
8247432521



# కట్టని కంతు

- వి.రెడ్డెప్ప రెడ్డి
94400 44922

అనంతపురం జిల్లా కల్యాణదుర్గం. సుదూరంలో ఉన్నవాళ్ళు ఆ ప్రాంతం పేరు వినగానే అక్కడి వేడికి థర్మామీటర్లు చిట్లిపోతాయని, రోళ్ళు పగులుతాయని అనుకుంటారు. దగ్గరగా చూసినవాళ్ళు నిఖార్సయిన కరువు ఇక్కడే చూడొచ్చంటారు. అక్కడక్కడా చెట్లున్నా అవి కత్తిరింపునకు నోచని బోన్సాయిల్లా ఉంటాయంటారు. కడుపునిండా తిండిలేక మనుషులందరూ జీరోసైజు కోసం పోరాడే కట్టెల్లాగుంటారని నమ్ముతారు.

ఆ ప్రాంతంలోని ఊరే మల్లేపల్లి. వన్నూరప్ప, ఇరగమ్మ బతికేది ఈ ఊర్లోనే. వాళ్ళ ఒక్కగానొక్క కొడుకు దొడ్డప్ప. యాభైయేళ్ళ నాడు మూడెకరాల భూమి అడమానం పెట్టి అదే భూమిలో వన్నూరప్ప తండ్రి బావి తవ్వించాడు. బావి అడుగు నాలుగేళ్ళకే కంకరరోడ్డులా మాడింది. రాళ్ళ బావిగా పేరుపడింది. బావి తవ్వుకున్న సంతోషంలో వన్నూరప్ప తల్లి ఆ గట్టునే ఓ మామిడి ముట్టె నాటింది. ముట్టె దురదృష్టం, మొలిచింది. రెమ్మకో ఆకుతో నాలుగు బార్ల ఎత్తున బతికి చస్తోంది.

ఉదయం చేని కాడికి పోతుంటే దొడ్డప్ప మోటార్ సైకిల్లో పెట్రోలయిపోయింది. "థూ దీనెమ్మ, ముండమోపి బతుకు. బండి కొన్నాక నెలరోజులు కూడా సరిగా వాడుకోలా. ఊర్లో అందరూ చూసేటిగా బండ్లో పోతే గొప్ప అనుకుంటే, బండి తోసుకుంటా బోయే బతుకయింది. పెట్రోల్ కొనేకి పైసా లేదు. బండి బైటికి తీయ్యపోతే 'పెట్రోలుకు యోగితి లేదు గానీ బండొకటి నాకొడుక్కు' అంటారు." తనలో తనే తిట్టుకున్నాడు.

వెనక్కి ఇంటికి తోసుకుని పోతుంటే ఊరి మధ్యలో మోటార్ సైకిల్ కంపనీ కలెక్షన్ ఏజెంట్లు అడ్డగించారు. బండిని షోరూముకు తీసుకెళ్ళడానికి చూశారు. "పెట్రోలుకు యేగితి లేనోడికి బండెందుకురా? కంతులు కట్టే గెతిలేన్నాకొడుకు బండి కొండమెందుకురా? మీ నాయనకే పుట్టింటే కంతులు కట్రా," అంటూ ఒకడు బండబూతులు తిట్టాడు. "ఈ నెల్లో కట్టేస్తా అని చెప్పబట్టి ఆర్నెల్లు అయింది. ఒగసారన్న మాట మీద కట్నావురా కొడకా?" అంటూ ఇంకొకడు అందుకున్నాడు. వాళ్ళు ఇంటికొచ్చి తిట్టిన రోజుల కంటే, ఊరి మధ్యలోకి తెచ్చి తిట్టిన రోజులే ఎక్కువ. ఈ సారి బండి తోసుకుంటూ వెళ్లి తనే ఊరి మధ్యలో వాళ్లకు దొరికిపోయాడు. ఈసారి మాటలతో సరిపెట్టలేదు. ఒకడు చెంపకేసి కొడితే ఐదువేళ్ళ ముద్ర అట్టు తేలింది. మరొకడు మెడ పట్టి తోస్తే బోర్లాపడ్డాడు. ఊరంతా చూస్తున్నారు. ఇలా ఇంకో నాలుగుసార్లు తిట్లు కొట్లు ఊరి మధ్యలో జరిగినా తను బండి కంతులు కట్టలేదు. కన్న తల్లితో కూడా దెబ్బ, మాట పడనివాడు. తల కొట్టేసినట్టయింది. 'థూ, నాదీ ఒగ బతుకేనా? కుక్క బతుకు, దీనికంటే చచ్చేది మేలు' అనుకున్నాడు. ఇంటికొచ్చి తల్లి చీర తీసుకున్నాడు. మోటార్ సైకిల్ తోసుకుంటూ చేని కాడికి పొయినాడు.

బండికి స్టాండు వేసి సీటు వెనకున్న హాండిలుకు చీర ఒక కొస కట్టాడు. మరో కొస మామిడిచెట్టు కొమ్మపైకి విసిరాడు. మోటార్ సైకిల్ సీటుపైకెక్కి కొమ్మనుంచి వేలాడుతున్న మరోకొస అందుకుని జారుముడి వేసి మెడకు తగిలించుకున్నాడు. తన బతుకును బుగ్గిచేసిన మోటార్ సైకిలును దొడ్డప్ప కసితీరా తన్నాడు. జీవం లేకపోతే మాత్రం మోటార్ సైకిల్కేమి ఖర్మ, తన్నులు తినడానికి? పక్కకు వాలిపోయింది. దొడ్డప్ప చీరకు వేలాడాడు. నూరేండ్లు బతకాల్సిన పిలగాడు చచ్చిపోతా ఉన్నాడే అని గాలికి, నేలకు, కొమ్మకు కనికరమయిందేమో, ఎర్రటి దుమ్ము, ఎండిన ఆకులు,

పుల్లలతో నిండిన చిట్లాగాలి మామిడిచెట్టును చుట్టుముట్టింది. దొడ్డప్ప చిట్లాగాలి వేగానికి ఊగిపోయాడు. ఊగి ఊగి మామిడి తొడిమ తెగి కాయ రాల్తుందేమో కానీ తాడుకు వేలాడిన మనిషి రాలేనా? బతికి బట్ట కట్టేనా? తాడు తెగలేదు, అతడు రాలలేదు. వేగంగా తిరిగి తిరిగి చుట్టి చుట్టి అలసిపోయిందేమో చిట్లాగాలి ఆగింది. సాయంత్రమయింది. మామిడిచెట్టు నీడ కొండచిలువలా పెరిగింది. అంత దూరంనుంచి చూసిన వాళ్లకు చెట్టుకు వేలాడుతున్న శవం నీడ, భూమినుంచి వెనుక చక్రం కొద్దిగాలేచి వేలాడుతున్న మోటార్ సైకిల్ నీడ కలిపి భేతాళు న్ని భుజాన మోస్తున్న విక్రమార్కుడిలా అగుపించాయి.

రెండేళ్ళ కిందట రెండు పొట్టేలి పిల్లలను కొన్నారు. ఆ పిల్లలు ఇంట్లో మిగిలిన సద్ది తిని ఇరగమ్మ చుట్టూ తిరిగాయి. చేన్లో వన్నూరప్ప చుట్టూ పారాడి తుంపరకు మొలిచిన గరిక, ఊస, కాశి, ఉట్లాగడ్డి మేశాయి. పొట్టేండ్లు అయ్యాయి. ఆ ఏడాది కరువులో గడ్డిదొరక్క బిడ్డల్లా సాక్కొన్న పొట్టేండ్లను అమ్ముకోవలసి వచ్చింది. వాటిని అమ్మిన ఐదువేలు ఇంట్లోనే పెట్టిన్నాడు వన్నూరప్ప. నాలుగు చినుకులు పడితే ఆ దుడ్డుతో ఈసారి నాలుగు పొట్టేలి పిల్లలను కొని మేపాలని ఇరగమ్మ ఆశ. ఊర్లో నలుగురూ కొంటుంటే దొడ్డప్ప కూడా పొట్టేండ్లు అమ్మిన దుడ్డుతో మోటార్ సైకిల్ కొన్నాడు.

మొదటి నాలుగు కంతులు దొడ్డప్ప సరిగ్గానే కట్టాడు. వేసిన వేరుశెనగ ఎండిపోవడంతో మిగతా కంతులు కట్టలేకపోయాడు. కంతులు కట్టేకి అమ్మ మెడలో తాళి అమ్మించడానికి మనసు రాలేదు. కంతులు కట్టలేక కొడుకు పదిమందిలో అవమాన పడ్డాడని తెలిస్తే మెడలో తాళెం ఖర్మ, మెడ కోసి ఇచ్చేంత ప్రేమ కొడుకుపై ఇరగమ్మకు. కొడుక్కు తల్లంటే అంతకు మించిన ప్రేమ. అందుకే తల్లి చీరతో ఉరేసుకున్నాడు.

దొడ్డప్ప ఆత్మహత్యకు కారణమనుకున్న వాళ్ళను స్టేషనుకు పిలిపించాడు సిఐ రామనాథం. కంపెనీ సేల్స్ మేనేజర్, నలుగురు కలెక్షన్ ఏజెంట్లు వచ్చారు. దొడ్డప్ప తల్లిదండ్రులను పిలుచుకొచ్చాడు కానిస్టేబులు వెంకటప్ప. విచారణ మొదలయింది. సిఐ కానిస్టేబులు వైపు చూసాడు. "వన్నూరప్ప తిండికి జరగనోడు. గవర్నమెంటిచ్చిన ఇల్లు, ఇంట్లో నాలుగు తెల్లబోకులు, కోళ్ళు మూసే దొల్ల, జాలారిలో ముక్కబోయిన తొట్టి తప్పా ఇంకేం లేవు." చూసిన వివరాలు చెప్పాడు.

వన్నూరప్ప వైపు చూస్తూ "ఏ అవసరముండి మోటార్ సైకిల్ కొన్నావ్?'' కేసు పూర్వాపరాలు తెలుసుకునేందుకు సిఐ అడిగాడు.

"అవసరమై కొన్లా సార్. మావోడు బండి కొన్నెబ్బుడు ఆయప్పోచ్చిండె" అంటూ సూటు బూటులో ఉండే యువకుడిని చూపించాడు. "ఆపొద్దు వూరి రచ్చబండపై రొంగురొంగుల బండ్లు పరస పెట్నారు, యాధీధినా హారన్లు గొడుతూ మెరవణి దీయించినారు. 'ఐదేలు కట్టండి, బండి దీస్కోండి. ఆమైన పదారు నెల్లు కంతుల్గడితే చాలు. బండిపై పాలు, పెరుగు, కూరగాయలు, ఆక్కూరలు రైతుల్దెగ్గిర గొని టౌన్లోకి గొండబయి లాభానికి అమ్మొచ్చు. ఇంగ రైతులయితే తలమోత ల్యేకుండా, మధ్యలో యెవునికి అమ్మకుండా, గౌరంగ బండిపై టౌన్లోకి గొండబయి ఎక్కువ రేట్లకమ్ముకోవచ్చు. రెయ్యిపూట యింట్లోనే వుంటా, కరెంటు రాంగానే బండేస్కోని తోటకుబయి మోటార్లేసుకోవచ్చు. పులుగుపుట్రా కరవకుండా బతికిపోవచ్చు' అంటూ ఆశ జూపెట్నారు. 'బండి ఇంటి ముంగలుంటే యింటికే కల, నలుగుర్లో గౌరవం,'' అని వూరించి వూరించి కొనిపించినారు."

ఇందాక వన్నూరప్ప చూపించిన యువకుడిని చూస్తూ "నీ వివరాలు చెప్పు" అన్నాడు సిఐ. "నా పేరు రఘురాం. కంపనీలో మార్కెటింగ్ మేనేజరును" అన్నాడు.

"లక్షల జీతం తీసుకునే నీకు కేసులో ఇరుక్కుంటే జీవితం నాశనమవుతుందని తెలీదా?" సిఐ ప్రశ్నించాడు.

"నెలకు జీతం పదిహేను వేలే సార్. అమ్మిన ప్రతి మోటార్ సైకిలుపై వెయ్యి రూపాయలు కమీషన్ ఇస్తారు.'' తన విషయంలో 'పదవి గొప్ప జీతం చిప్ప' అనే నిజం దాచే వీల్లేనందుకు బాధపడ్డాడు రఘురాం.

యూనిఫార్ములో ఉన్న కలెక్షన్ ఏజెంట్లను చూస్తూ "మీరేం చేస్తారు" అన్నాడు.

అందులో ఒకడు జవాబు చెపుతూ "నా పేరు రామచంద్ర. నెలకు పదివేలు జీతం. కంతులు కట్టనోళ్ళ నుంచి లక్ష రూపాయలు కంపనీకి వసూల్జేయిస్తే మాగొగరికీ వెయ్యి కమీషనొస్తుంది," వివరించాడు. సేల్స్ మేనేజరును, కలెక్షన్ ఏజెంట్లను కలిపి సెల్లులో గొంతుకూర్చోబెట్టాడు సిఐ. "మేమే తప్పు చేయలేదు. చేయని తప్పుకు మమ్మల్ని బలి చేయొద్దు సార్." వాళ్ళు బతిమాలుకున్నారు. వాళ్ళు చెప్పిన వివరాల ప్రకారం ఈ ఊర్లో ఇరవై మోటార్ సైకిళ్ళు అమ్మారు. కంతులు సక్రమంగా కట్టలేదని ఇప్పటికే ఆరు బండ్లు షోరూముకు చేరాయి. కంతులు కట్టని ఆరు మందికీ ఇరవై నాలుగు శాతం వడ్డీతో కంతులు కట్టి బండ్లు తీసుకెళ్లాలని నోటీసులు వచ్చాయి.

ఇలా కంతులపై అమ్మడం వల్లే ఊర్లో అన్ని రోడ్లు సందు లేకుండా మోటార్ సైకిళ్ళమయం అయ్యాయేమో అనుకున్నాడు సిఐ. ఆ రోడ్లను మించి అతడి మనసు కల్లోలంగా ఉంది. తాను ఉద్యోగంలో చేరిన కొత్తల్లో కఠినాత్ముడు అనిపించు కున్నాడు. కొన్ని కేసుల్లో నిర్దోషులకు శిక్ష వేయించానేమోనని

మదన పడేవాడు. రిటైర్మెంటు దగ్గరపడింది. పాపపుణ్యాలు మనసును తొలిచే వయసు. అందుకేనేమో చీరకు వేలాడి నాలుక బయటికొచ్చి చచ్చిన దొడ్డప్ప ముఖం, తలకొరవి పెట్టాల్సిన కొడుకు పోవడంతో ఏడ్చి ఏడ్చి నీళ్ళు ఇంకిపోయిన తల్లిదండ్రుల కళ్ళు, శవాన్ని శవపరీక్ష పేరుతో కోస్తున్నారని తెలిసి దీనంగా నిలబడ్డ తల్లిదండ్రల ముఖాలు, ఈ ఆత్మహత్య కారణంగా తాము ఎన్నేళ్ళ శిక్ష అనుభవించాల్సి వస్తుందోననే ఆందోళనలో కంపనీ ఉద్యోగుల ముఖాలు, ఆత్మహత్య చేసుకున్న దొడ్డప్ప కుటుంబానికి న్యాయం చేయమని ఎంఎల్‌ఏ పోను, దొడ్డప్ప కుటుంబానికి న్యాయం జరిగేవరకు రాస్తారోకో చేస్తామని రోడ్డుపై రాద్ధాంతం చేసిన ప్రతిపక్ష పార్టీ నాయకుడి తిట్ల పురాణం కలిపి అతడి మనసును తొలుస్తున్నాయి. ఎవరిది నేరమో నిర్ణయించుకోలేక పోతున్నాడు. జీతం రాళ్ళకోసం పనిచేసే ఉద్యోగులు చేసింది జైలుకు పంపాల్సినంత నేరమా? అనుమాన పడుతున్నాడు.

సిఐ తన మిత్రులు నలుగురిని పోనుచేసి ఇంటికి పిలిపించుకున్నాడు. ఒకరు రిటైర్డ్ డిస్ట్రిక్ట్ జడ్జి కేదారనాథ్, రెండవవారు లాయర్ సదానంద, మూడవవారు రిటైర్డ్ లెక్చరర్ రంగాచార్య, నాలుగువ వారు తన సహ ఉద్యోగి ఎస్ఐ నాగేంద్ర. నెలకొకరింట్లో మందుప్రాసన మిత్రుల మధ్య ఒప్పందం. మరో రెండు నెలల తరువాత గానీ సిఐ వంతు రాదు. అయినా మనసు బాగోక మిత్రులను పిలిపించుకున్నాడు. నంజుకు బేడలు, పల్లీలు, కోడివేపుడు ప్లేట్లలో సర్దుకుని మందుప్రాసన మొదలెట్టారు. మామూలు రోజుల్లో అయితే జోకాభిరామాయణంతో ఆ సమయం గడిచిపోయేది. కానీ ఈ పూట సిఐ తన మనసులోని సంఘర్షణను వివరించాడు. మొదటి రౌండు పూర్తయింది.

"కంపనీ ఉద్యోగులను లోపలేసి నాలుగు తగిలిస్తే ఎవడెవడు ఏమని తిట్నారు, ఎన్ని దెబ్బలు కొట్నారు, ఎవరి తిట్లు కొట్లు దొడ్డప్ప ఆత్మహత్యకు కారణమైనాయన్నది ఆ నాకొడుకులే ఒప్పుకుంటారు." నాగేంద్ర తనకు అలవాటైన పద్ధతిని పంచుకున్నాడు.

"ఆత్మహత్యకు కారణమైన యువకులపై కేసు పెట్టి, శిక్ష వేయగలిగిన సాక్షాలను కోర్టుకు సమర్పించడమే సిఐగా నీ బాధ్యత." ఆలోచనను పంచుకున్నాడు సదానంద.

"కంపనీ చేస్తున్న శ్రమదోపిడీ చాలదా? అవసరమున్న వాడికే మోటార్ సైకిళ్ళు అమ్మితే వచ్చే లాభాలు చాలవా? 'దొమ్మలగొండికి ఎంత తిన్నా కడుపు నిండదట.' ఈ పారిశ్రామిక వేత్తల కడుపులు కూడా నిండడం లేదేమో? లేకపోతే కడికి గతిలేని ఈ ఊర్లో కూడా మోటార్ సైకిళ్ళు కంతులకు అమ్మడమేంటి?'' కేదారనాథ్ ఆలోచనను పంచుకున్నాడు.

"శ్రమదోపిడీకే పరిమితం కావడానికి ఇది కార్ల్‌మార్క్స్, ఎంగెల్స్ కాలం కాదు. గ్లోబలైజేషన్ కాలం. శ్రమదోపిడీని అడ్డుకోవడానికి లేబర్ యూనియన్లు, లేబర్ ఆఫీసర్లు, లేబర్ కోర్టులు, శ్రామిక చట్టాలు తమ తమ పరిధిలో పనిచేస్తూనే ఉంటాయి. శ్రమదోపిడీ పెంచాలంటే వీటన్నిటితో వేగాలి. అయినా శ్రమ దోపిడీ అనేది ఓ పెద్ద తతంగం. శ్రమదోపిడీని వస్తురూపంలోకి మార్చాలి. వస్తువులను అమ్ముకోవాలి. ఖర్చులు పోగా ఆదాయం సంపాదించాలి. ఇంత తతంగం కంటే నేరుగా ఆదాయ దోపిడీ సులువు కదా? తమ వద్ద పనిచేసే శ్రామికులను దోచుకోవడంపై దృష్టి తగ్గించారు. అవసరం ఉన్నవాడికి, లేనివాడికి, చివరికి కడుపుకు గతిలేనోడికి కూడా మోటార్ సైకిళ్ళు అమ్మి, ఉద్యోగుల ద్వారా ఆదాయ దోపిడీ చేయిస్తున్నారు. అలాంటపుడు ఉద్యోగులకు శిక్ష వేయించడమంటే, అసలు నేరస్థులను వదిలి అమాయకులకు శిక్ష వేయించడమే." ఆలోచనను పంచుకున్నాడు రంగాచార్య.

సీసా, నంజు ఖాళీ అయ్యాక చివరి చుక్కలను ఆస్వాదిస్తూ, ఒకేసారి నలుగురు కలిసి "అదెలా?" అన్నారు. రంగాచార్య మాట కొనసాగించాడు. "శ్రమదోపిడీలో కేవలం ఆయా కంపనీల్లో పనిచేసే శ్రామికులను మాత్రమే దోచుకునే వీలుంటుంది. అదే ఆదాయ దోపిడీ అయితే అన్ని వర్గాలను దోపిడీ చేయెచ్చు. శ్రమదోపిడీని ఆదాయంగా మార్చుకోవడం కంటే, నేరుగా ఇతరుల ఆదాయాన్ని తమ ఆదాయంగా మలుచుకోవడం సులభమని పారిశ్రామిక వేత్తలెపుడో గ్రహించారు."

"పరిశ్రమలు శ్రమదోపిడీతోపాటు ఆదాయ దోపిడీకి అవకాశం కల్పిస్తాయి. మీకు అర్థమయ్యే ఉదాహరణ గమనించండి. సగం కడుపునకు తిని సినిమాకు పోయిన అభిమానికి వెయ్యి రూపాయలకు టిక్కెట్టు అమ్మినవాడిని మించిన ఆదాయ దోపిడీదారుడెవడు? ఏ ఉత్పత్తి లేకుండా క్రికెట్ ఐపిఎల్ పేరుతో పండ్రెండు టీములు పెట్టి ఆడించి, ఐదు వందల లెక్కన టికెట్లు అమ్మడం ఆదాయ దోపిడీకి వేసిన అదనపు దారే. మార్కెటింగ్ నైపుణ్యాలతో అమ్ముడయ్యే కూల్ డ్రింకుల్లాంటివి ఇందుకు అదనపు ఉదాహరణలే. పేదవాడి చివరి ఆదాయాన్ని కూడా దోచుకోగలిగే మార్గాలే సారా, మొబైల్ ఫోన్లు, రీచార్జిల్లాంటివి. పేద మధ్యతరగతి వాళ్ళు బాంకుల్లో చేసుకునే పొదుపులు ఆదాయం నుంచి కడుపులు కట్టుకుని దాచుకునే సొమ్మే. ఆ పొదుపులు కూడా దోపిడీ చేస్తున్నారన్నది అందరికీ తెలిసిందే."

"కంతుల రూపంలో అమ్మే కార్లు, మోటార్ సైకిళ్ళు, ఫ్రిడ్జి, ఏసీ లాంటి పథకాలంటే పేద, మధ్యతరగతి కుటుంబాలకు రాబోయే ఐదు పదేళ్ళ పాటు వచ్చే ఆదాయంనుంచి వాటా పొందడానికి ఇప్పుడే చేసుకున్న అగ్రిమెంట్లు. పురుగులున్న చోటే బల్లి చేర్తుంది, ఆదాయమున్నచోటే వ్యాపారం జరుగుతుంది. ఆదాయం లేని చోట వ్యాపారం నడపడమే కంతుల పథకానికి పునాది. అటు ప్రభుత్వాలు, ఇటు ఆదాయ దోపిడీదార్లు గుర్తించని విషయమొకటుంది. రెట్లావు కొండచిలువ తొడలావు జింకను మింగినా బతుకుతుంది, నలుగురు మనుషులను మింగితే ఫిగిలి చస్తుంది."

టీచర్ చెప్పిన అంశాల్లో నిజముందని సిఐ నమ్మాడు. ఆదాయదోపిడీకి పాల్పడిందని, ఆత్మహత్యకు కారణమయిందని మోటార్ సైకిల్ కంపనీపై కేసు ఫైల్ చేసాడు. చట్టాల్లో లేని దోపిడీపై కేసు పెట్టాడనే సాకుతో కేసు కొట్టేసాడు అన్నీ తెలిసిన మేజిస్ట్రేట్.

అప్పటివరకు తటపటాయించిన కంపనీ, కోర్టులో కేసు కొట్టేయడంతో మిగిలిన కంతులు కట్టమని వన్నూరప్పకు నోటీసు పంపింది. "చెట్టంత కొడుకును మింగినా ఇంకా ఆ నాకొడుకుల ఆకలి తీర్లేదా? మనల్ని మింగాకయినా తీర్తాదిలే. మనాయిసు గూడా బోస్కోని ఆ నా కొడుకులు యింగో నూరేండ్లు ఈడే గూటం కొట్టుకోని బతకనీలే" అనుకుంటు పళ్ళు కొరికాడు వన్నూరప్ప. "ఒక మోటార్ సైకిల్ అప్పుకు నిండు ప్రాణం బలి కావడమా?" అన్న ప్రశ్న ఆవేదనగా ఆలోచనలనిండా కమ్మేసింది. బలి ఇచ్చుకుంటూపోతే ఇంకెంతమంది? ఇంకెన్ని కుటుంబాలు. ఈ దుర్మార్గాన్ని ఆపాలి, కనీసం ఈ మల్లేపల్లిలో, ఈ మండలంలో, ఈ జిల్లాలో ఆపలేమా? ఆలోచించారు. వెనక్కొచ్చారు.

మనిషి చస్తే కొట్టే డప్పును, మనిషిని బతికించడానికి కొట్టాలనుకున్నారు. మరుసటి రోజు నుంచి ఊర్లెంబడి తిరుగుతూ, "కంతులతో బండ్లు కొనకండి, బండ్లు అమ్మినోడికి బానిసలు కాకండి" అంటూ వివరంగా చెప్తూ, డప్పు కొడుతూ, పాట కట్టి పాడుతూ బతకడానికి నిర్ణయించుకున్నారు. ■



# మహాబోధి

- డా.సి.భవానీదేవి
9866847000



కొన్ని సందర్భాల్లో
ఏం మాట్లాడాలన్నా నోరు పెగలదు
ఏం రాయాలన్నా కలం కదలదు

తెలిసీ తెలియని పాఠశాలకు
తెలుగు కవిత్వ మధురిమలు
రుచి చూపించిన ఆగళం
మాకు ఇంకా వినిపిస్తూనే ఉంది!

ఎదిగీ ఎదగని కళాశాలకు
హిందీ భాషాగంధాన్ని హత్తిన
ఆ అద్భుత బోధనాపటిమ
మా దారంతా వెలుగిస్తూనే ఉంది !

ఒదిగీ ఒదగని ఊహాతరంగాలకు
ఊపిరులందించిన అమృతత్వంతో
నవ్య విహాయస వాకిళ్ళను తెరిచి
భావనాబలాన్ని పెనవేస్తూనే ఉంది!

అందీ అందని నిగూఢ పాఠ్యాంశాలను
అరచేతిలో ఉసిరికాయలా ఉంచి
విద్యార్థులను వికాసవర్ధనులుగా
జీవన తేజస్సును విస్తరిస్తూనేఉంది!

రాసీరాయని కావ్యంలాంటి గురువు
లభించటం కొందరికే దక్కే అదృష్టం
ఆగీ ఆగని కన్నీటి బాష్పాలసాక్షిగా
కెవిఎస్ మాష్టారికి ప్రణమిల్లుతాం!

వ్యాఖ్యానాలు.. పాటలు.. ప్రవచనాలు
మించిన మధుర వాయఝరీ!
గౌరవ వినమ్ర విషాదం నింపుకుని
మీ వారసత్వ జాడల్ని అనుసరిస్తాం!

బాపట్ల చరిత్రలో గణనీయ భూషణమై
మహాబోధిలా మహస్సునిచ్చిన మీకు
శిష్యులుగా శిరస్సువంచి నివాళినిస్తాం!
అమృత మృదయాశీస్సులు కోరతాం!!

**(3-7-22** తేదీన బాపట్లలో కన్నుమూసిన మధురకవి
మా మాష్టారు డా.కె.వి.ఎస్.ఆచార్యులు గారికి కన్నీటి నివాళి)

# గుండెల బాంబులు!

నేను భూమిపై పడ్డప్పటినుండి
యుద్ధం చేస్తూనే ఉన్నాను
మనుషుల్తో.. మనువుల్తో
మనుషుల్ని సృష్టించిన దేవుళ్ళతో..!

నేను ప్రతిరోజు యుద్ధం చేస్తున్నానే ఉన్నాను
నాతో.. మీతో.. నా చుట్టూ ఉన్న నాగుపాముల్తో..
బుసలు కొట్టే... విష నాలుకల్తో
ప్లాస్టిక్ పూల నవ్వుల్తో..
అబద్ధాల... పెదవుల్తో!

నేను యుద్ధం చేస్తూనే ఉన్నాను
ఎదనదిలో ఎడతెగక ఎగసిపడుతున్న
కలల అలల ఉప్పెనల్తో...
ఉన్మత్తుల ప్రేలాపనల్తో
పువ్వుల్లాంటి ప్రేమకావ్యాల్తో..
ముళ్ళు గుచ్చే విప్లవాల బాటల్తో..
ఆదర్శాల అడవులతో..
నే నడిచే అడుగులతో!
అపుడపుడూ.. నా నీడల్తో!

నేను యుద్ధం చేస్తూనే ఉన్నాను
మాతృభాషా పదాలను అసాధువులన్న
మృతభాషా విగ్రహాలతో...
అధిక సంఖ్యాకుల బతుకు చిత్రాలను
అక్షరాలుగ మార్చని కుట్రదారులతో..
వ్యాకరణాల సంకెళ్ళు తొడిగిన సిద్ధాంతులతో..
ఆచరణలో విఫలమైన సిద్ధాంతాలతో...
నేను యుద్ధం చేస్తూనే ఉంటాను
శబ్దం నిశ్శబ్దమై మనసుల్లో
మౌనం ప్రేమ సంగీతమయ్యేంతవరకు!
సమానత్వ చైతన్య గీతం వినిపించేవరకు!

కార్పొరేట్లను మోసే భుజాలతో
మానవ స్వార్థ నైజాలతో ...
నిరంతరం యుద్ధం చేస్తూనే ఉంటాను!



కల్పనా కావ్యాల శబ్ద సౌందర్యం కన్నా
కార్మికుల శ్రమ సౌందర్యం గొప్పదని
'చండాలుడు' పల్లె నుండి ఢిల్లీ వరకు
చాటింపు వేసేవరకు!
అంతవరకు యుద్ధం చేస్తూనే ఉంటాను!

ఎత్తిన కలం కరవాలం దించక
నెత్తిన పిడుగులు పడినా జంకక
ఎవరి విమర్శలకు తలవంచక
రాజీలేని యుద్ధం చేస్తూనే ఉంటాను!

యుద్ధం చేయడానికి కత్తులు కటార్లు కరవాలాలు అక్కర్లేదు
నాలుగు అక్షరాలు చాలు!

భయపడకండి!
బతుకంటే యుద్ధమని తెలుసుకోండి!
నాలుగు అక్షరాలను
చేతుల్లోకి తీసుకోండి!
మీ గుండెలు బాంబులుగా
మారిపోతాయి!

– కళారత్న **బిక్కి కృష్ణ**
83744 39053



# తీస్తా సెతల్వాద్‌పై 'మోడీరాజ్' వేట

- తెలకపల్లి రవి

దేశ చరిత్రలో బహుశా ప్రపంచ న్యాయ చరిత్రలో ఒక సుప్రీంకోర్టు తీర్పు.. హక్కుల కోసం పోరాడేవారి అరెస్టుకు ఆధారం కావడం జరిగివుండదు. మన స్వాతంత్ర్య అమృతోత్సవం అందుకు సందర్భమైంది. అమానుషమైన గుజరాత్ నరమేధంలో ప్రాణాలు కోల్పోయిన వేలాది మంది కుటుంబాలకు న్యాయం కోసం నిర్విరామ కృషి చేస్తున్న తీస్తా సెతల్వాద్‌ను అన్యాయంగా అరెస్టు చేయడానికి గుజరాత్ పోలీసులు అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పునే కారణంగా చూపించారు మరి! గుజరాత్ నరమేధం ఇటీవలే 20 ఏళ్లు పూర్తి చేసుకున్న తరుణంలోనే సుప్రీం కోర్టు నరేంద్ర మోడీకి క్లీన్ చిట్ ఇవ్వడం లేదా గతంలో సిట్ ఇచ్చిందని నిర్ధారించడం యాదృచ్ఛికం కాదు. కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా తీర్పును స్వాగతిస్తూ ఈ మారణహెూమానికి అప్పటి ముఖ్యమంత్రి మోడీపై ఆరోపణలు, అంతులేని బాధ కలిగించినా గరళ కంఠుడిలా భరించారని పొగడ్తలు కురిపించారు. అప్పట్లో మోడీ గుజరాత్ హెూంశాఖ చూస్తుంటే సహాయ మంత్రిగా పనిచేసిన అమిత్‌షా ఒక బూటకపు ఎన్‌కౌంటర్ కేసులో తను మూడు మాసాలు జైలు పాలైన సంగతి గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు మోడీ దేశ ప్రధానిగా వుంటే షా దేశానికే హెూంమంత్రిగా ఉన్నారు. సుప్రీం తీర్పు పేరిట శరవేగంగా తీస్తా సెతల్వాద్‌ను అరెస్టు చేయడంలో ఈ పరిణామం ప్రతిబింబిస్తుంది.

సిట్ క్లీన్‌చిట్ ఇచ్చిన తర్వాత కూడా ఈ మారణహెూమం మరుగున పడకుండా కొనసాగించడంలో కొన్ని శక్తులు దురుద్దేశ్యంతో పని చేస్తున్నాయనీ, వారిని బోనెక్కించాల్సి వుందని ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. సాక్ష్యాలు చెప్పిన కొందరు పోలీసు అధికారులనూ తమ ప్రయోజనాలు నెరవేరలేదన్న అసంతృప్తితో మాట్లాడారని కొట్టివేసింది. గుజరాత్ టెర్రరిస్టు వ్యతిరేక పోలీసులు మరుసటి రోజున తీస్తాను నిర్బంధంలోకి తీసుకున్నారు. ముందస్తు నోటీసు లేకుండా ఇంట్లోకి ప్రవేశించి సోదాలు చేశారు. దీన్ని నిరసిస్తూ మాజీ న్యాయమూర్తులతో సహా 300 మంది సీనియర్ న్యాయకోవిదులు ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి రమణకు లేఖ రాశారంటే ఇదెంత అసాధారణంగా వుందో తెలుస్తుంది. తాము చెప్పిన తీర్పు ఉద్దేశం తీస్తా సెతల్వాద్ తదితరుల అరెస్టు కాదని సుప్రీం కోర్టు స్పష్టం చేయాలని వారు కోరారు. అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు, సిపిఎం వంటి పార్టీలు, కొందరు మీడియా వ్యాఖ్యాతలు కూడా ఆమె అరెస్టును ఖండించారు. మరో వంక సోషల్ మీడియాలో పరివార్ పదాతిదళం తీస్తా పైనే గాక ఆమె తాతముత్తాతల పైన కూడా విష ప్రచారం చేస్తున్నది. కేంద్ర రాష్ట్ర సంస్థలు వేటాడుతూనే వున్నాయి.

**తీస్తా నేపథ్యం**

తీస్తా ముత్తాత సిహెచ్.సెతల్వాద్ పార్సీ కుటుంబానికి చెందిన గొప్ప న్యాయ కోవిదుడు. జలియన్‌వాలా బాగ్ మారణకాండకు కారణమైన ఒ.డయ్యర్‌పై విచారణ జరిపిన హంటర్ కమిషన్‌లో సభ్యుడు. పరివార్ పదాతిదళం దీన్ని ప్రతికూలాంశంగా చిత్రిస్తూ ఆయన బ్రిటిష్‌వారి కోసం పని చేసినట్టు చిత్రిస్తున్నది. వాస్తవానికి డయ్యర్‌ను తప్పించేందుకు ఉద్దేశించిన ఆ విచారణలో సిహెచ్.సెతల్వాద్ భారతీయుల ఆగ్రహాన్ని, నిరసనను ప్రతిధ్వనించే ప్రశ్నలు వేసి డయ్యర్‌కు చమటలు పట్టించాడట. ఆమె తాత ఎం.సి సెతల్వాద్ ఈ దేశపు తొలి అటార్నీ జనరల్. తండ్రి అతుల్ సెతల్వాద్ ముంబాయిలో లాయర్లకు లాయర్‌గా పేరొందారు. ఎమర్జన్సీకి వ్యతిరేకంగా పోరాడిన ధీశాలి. తీస్తా జర్నలిస్టుగా కొన్ని పత్రికల్లో విలేకరిగా పని చేసినా భివాండి, ముంబాయి మత కలహాలను చూశాక మతతత్వానికి వ్యతిరేకంగా పని చేయాలని నిర్ణయించుకున్నారు. అలాంటి భావాలే గల జర్నలిస్టు జావేద్

ఆనంద్‌ను పెళ్లి చేసుకున్నారు. బడా పత్రికల్లో కన్నా స్వతంత్ర వేదిక మంచిదన్న అభిప్రాయంతో 1993లో 'కమ్యూనలిజం కంబాట్' పత్రిక స్థాపించారు. అలేఖ్ పద్మశ్రీ, జావేద్ అఖ్తర్, విజయ టెండూల్కర్, రాహుల్ బోస్, క్యాథలిక్ ప్రీస్ట్ కెడ్రిక్ ప్రకాశ్‌లతో కలసి 2002 ఏప్రిల్‌లో సిటిజెన్స్ ఫర్ జస్టిస్ అండ్ పీస్ (సిపిజె) స్థాపించారు. గుజరాత్ మారణకాండను దేశానికి, ప్రపంచానికి చెప్పి చైతన్య పరచడంలో ఈ వ్యవస్థలన్నీ అగ్రభాగాన నిలిచాయి. సబ్ రంగ్ కమ్యూనికేషన్స్ పబ్లికేషన్స్ కూడా జావేద్ ఆనంద్ ఆధ్వర్యంలో అలాగే ఏర్పడింది.

**తప్పుడు కేసులతో వేట**

2002 ఫిబ్రవరిలో గోద్రా స్టేషన్‌లో హత్యలు, దానికి ప్రతీకారం పేరిట సాగిన ఊచకోత తర్వాత తీస్తా సెతల్వాద్ తీవ్ర పోరాటానికి దిగారు. నాటి హత్యాకాండలో సామూహిక విధ్వంసం, హత్యలు జరిగిన ప్రదేశాలు చరిత్రలో నల్లని గుర్తుగా మిగిలిపోయాయి. గుల్బర్గా సొసైటీ, బెస్ట్ బేకరీ, నరోదా పాటియా, సర్దార్ పూర్, ఓద్ వంటివి కొన్ని. అన్నిచోట్లా రాక్షసత్వం రాజ్యమేలింది. వెయ్యి మందికి పైగా ప్రాణాలు కోల్పోయినట్టు అధికారపూర్వకంగా ప్రకటించారు గాని వాస్తవానికి అంతకంటే ఎక్కువ మందే మరణించారు. మహిళలపైనా దారుణాలు జరిగాయి. ముస్లిముల వెలివేత నడిచింది. అప్పటి ప్రధాని వాజ్‌పేయి కళ్ల నీళ్లు పెట్టుకున్నారు, కవితలు రాశారు, రాజధర్మం పాటించాలని నీతులు చెప్పారు. కాని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వారి ఆశీస్సులున్న పరివార్ మూకలు, పరోక్షంగా వారికి వత్తాసునిచ్చే పోలీసులు, అధికార యంత్రాంగం కారణంగా ఈ ఘాతుకాలను దర్యాప్తు చేయడం, నిందితులను పట్టుకోవడం అన్న ప్రసక్తి లేకుండా పోయింది. సహాయక శిబిరాల్లో వున్న బాధితుల పైనే బెదిరింపులు, వేధింపులు నడిచాయి. ఆ ఉద్రిక్త పరిస్థితిలోనే మోడీ ముందస్తు ఎన్నికలకు తొందరపడ్డారు. ఎన్నికల సంఘంపై దాడి చేశారు. ఎట్టకేలకు ఎన్నికలు పెట్టించి భయోత్పాతంలో మరోసారి అధికారంలోకి రాగలిగారు. గుజరాత్‌లో ప్రధాన ప్రత్యర్థి అయిన కాంగ్రెస్ నేతలు కూడా హిందూత్వ ఊపులో తామెక్కడ వెనకబడ తామోనని వీటన్నిటిని గట్టిగా ఖండించడానికి వెనుకాడారు. ఆ సమయంలో వామపక్షాలు లౌకిక వాదులతో పాటు తమ సంస్థల ద్వారా నిరంతర కృషి చేసిన, చేస్తున్న వ్యక్తి తీస్తా. అప్పుడే వి.ఆర్.కృష్ణయ్యర్‌తో సహా ముగ్గురు మాజీ న్యాయ మూర్తులు, ఇతర ప్రముఖులతో కలసి కన్సర్న్డ్ సిటిజన్స్ ట్రిబ్యునల్ పేరిట విచారణ కమిటీ ఏర్పడింది. దాదాపు మూడు వేల ఫిర్యాదులు ఇతర ఘటనలు విచారించి సమగ్రమైన రెండు సంపుటాల నివేదిక విడుదల చేసింది (ఈ నివేదికను ప్రజాశక్తి బుక్‌హౌస్, హైదరాబాద్ బుక్ ట్రస్ట్ ఉమ్మడిగా ప్రచురించాయి. ఇప్పుడు మరిన్ని సంస్థలు కలసి ప్రచురిస్తున్నాయి.).


ఆ భయంకర కాలంలో తీస్తా బాధితుల శిబిరాలను సందర్శించడం, మరీ హతాశులైన నిరాశ్రయులకు ఆశ్రయ మివ్వడం, సాక్ష్యాలు చెప్పేందుకు ధైర్యం కల్పించడం చేశారు. సరిగ్గా ఆ కారణంతోనే మోడీ ప్రభుత్వం సంఘ పరివార్ ఆమెను శత్రువుగా భావించి అడుగడుగునా వేటాడాయి. బాధితులను ఒత్తిడి చేసి, భయపెట్టి సాక్ష్యాలు, వాంగ్మూలాలు తీసుకున్నారని బెస్ట్ బేకరీ కేసుకు సంబంధించిన కీలక సాక్షి జహీర్ షేక్ 2004 లోనే ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై విచారించిన సుప్రీంకోర్టు ఆమె నిర్దోషిగా ప్రకటిస్తూ మోసానికి గాను జహీర్‌కే ఏడాది శిక్ష వేసింది. ఇందుకోసం మోడీ సన్నిహితుడైన శ్రీవాత్సవ... జహీర్‌కు రూ.18 లక్షలు చెల్లించినట్టు తెహల్కా ఆపరేషన్‌లో తేలింది. మరో 22 మంది సాక్ష్యాలు కూడా బూటకమని సిట్ నిర్ధారించినట్టు టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రత్యేక వ్యాసం రాయగా సిపిజె ఖండించింది. అది సిట్ నివేదిక కాదని, ప్రభుత్వ నివేదిక అని స్పష్టం చేసింది. ఢిల్లీలోని పాలసీ రిసెర్చి సభ్యుడైన ప్రతాప్ భాను మెహతా కూడా టైమ్స్ వ్యాసం ఆధారంగా తీస్తాపై అలాటి ఆరోపణలే చేసి తర్వాత వెనక్కు తగ్గారు. బాధితుల కోసం విరాళాలు సేకరించిన తీస్తా వాటిని దారి మళ్లించినట్టు 2013లో నాటి ఘటనలపై మ్యూజియం కోసం వచ్చిన విరాళాలు దుర్వినియోగ పర్చిన సిపిజెను నిషేధించాలని గుల్బర్గా సొసైటీ పేరిట ఒక ప్రకటన వెలువడింది. గుజరాత్ క్రైం పోలీసులు దానిపై దర్యాప్తు తతంగం మొదలెట్టారు. మరోవంక సబ్‌రంగ్ పత్రికా ప్రకటన విడుదల చేస్తూ రియల్ ఎస్టేట్ ధరలు మండిపోతున్న కారణంగా మ్యూజియం ఆలోచన విరమించామని, దాతలకు ఆ విషయం చెప్పి ప్రత్యామ్నాయ ప్రతిపాదన ఆలోచిస్తున్నామని తెల్పింది. పూర్తి ఆడిటింగ్ చేసిన తమ ఖాతాలో నిధులు రూ.4,60,285 లు మాత్రమేనని కూడా వెల్లడించింది. కాని తమ లెటర్ పాడ్ దొంగిలించి ఈ ఫిర్యాదు చేశారని, వాటితో సంబంధం లేదని కొద్దిరోజుల తర్వాత సొసైటీ అధికార ప్రతినిధులు పోలీసు కమిషనర్‌కు లేఖ రాశారు. అప్పటికే కేంద్రంలో మోడీ ప్రభుత్వం రావడం, మతతత్వ వ్యతిరేక శక్తులపై వేట ఉధృతమయ్యాయి. అందుకే వీటన్నిటి ద్వారా ఆమెపైన సబ్‌రంగ్‌పైనా దుష్ప్రచారా న్ని కొనసాగనిచ్చారు. వారి ఖాతాలు నిలిపివేశారు. వీటిని విడుదల చేయడానికి, వారికి ముందస్తు బెయిలు ఇవ్వడానికి గుజరాత్ హైకోర్టు నిరాకరించినా సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని తాత్కాలిక ఉపశమనం కల్పించింది. వ్యాపార సంస్థ అయిన

సబ్‌రంగ్ ఫోర్డ్ సంస్థ నుంచి విరాళాలు పొందడం విదేశీ విరాళాల చట్టానికి విరుద్ధమని 2017లో మరో కేసు బనాయించారు. తమతో ఆ సంస్థ చేసుకున్న అవగాహన మేరకు తీసుకున్నాం తప్ప చట్ట ఉల్లంఘన జరగలేదని సబ్‌రంగ్ సమాధానమిచ్చింది. మత సామరస్యం కోసం కృషి అన్న ఆశయాలే దేశ వ్యవహారాల్లో జోక్యానికి అవకాశమిస్తున్నాయని సర్కారు వింత వాదన చేసింది. సంబంధిత అధికారులు క్రమబద్ధంగా ఆడిట్ చేస్తూనే వున్నారనీ చెప్పింది. అయినా ఏదో పేరుతో వారి కార్యాలయాలపై దాడి, 24 గంటల గాలింపులు చేయడం దేనికంటే వారు సేకరించిన సాక్ష్యాధారాలు వుంటే స్వాధీనం చేసుకోవడమే. ఈ వేధింపుల జాబితా ఇంకా చాలా పొడవైందే.

**సిట్, కోర్టులు చెప్పలేదా?**

ఐక్యరాజ్యసమితితో సహా గుజరాత్ ఘటనలను ప్రపంచానికి తెలియజేసిన వ్యక్తి తీస్తా. గుజరాత్‌లో కేసు విచారణ అయితే భయపెడతారంటూ ముంబాయికి మార్పించుకోగలిగారు. 68 కేసుల్లో 120 మందికి శిక్ష పడిందంటే అది తీస్తా వంటి వారి కృషి ఫలితమే! అయితే ఈ కేసుల్లో ముందస్తు బెయిలు సులభంగా ఇవ్వడమే గాక శిక్షలు పడినవారికి కూడా వెంటనే స్వేచ్ఛ లభిస్తుండడం విచారకరం. వారు సాక్షులను ఇప్పటికీ బెదిరిస్తూ సంచరిస్తున్నారు. కోర్టులకు వెళ్లడం నిరంతరం జరుగుతూనే వుంది. ఆ క్రమంలోనే జకియా జాఫ్రీ కేసును సుప్రీం కొట్టివేస్తూ పిటిషనర్ తీస్తాకు దురుద్దేశాలు అంటకట్టింది. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నేరస్తులను ఉపేక్షించిందని చెప్పడానికి ఆధారాలు లేవని సిట్ చెప్పిందని న్యాయమూర్తులు పేర్కొన్నారు. సిట్ మోడీకి క్లీన్‌చిట్ ఇచ్చిందనే వాదన పాక్షికమైంది. అలా అంటూనే సిట్ పోలీసు అధికారుల ప్రవర్తనను తీవ్రంగా తప్పు పట్టింది. మంత్రులు కంట్రోలు రూమ్‌లో వుండి నడిపించారని తెల్పింది. 2002 ఫిబ్రవరి 27న గోద్రా స్టేషన్ సందర్శించిన ముఖ్యమంత్రి దగ్గరలోనే వున్న గుల్బర్గా సొసైటీలో హత్యాకాండ బాధితులను ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించింది. చర్యకు ప్రతిచర్య అంటూ ఈ హత్యాకాండను పరోక్షంగా సమర్థించడం, మైనార్టీ జనాభా పెరిగిపోతున్నదని ఎన్నికల సభలో చెప్పడం వంటి ఉదాహరణలు ప్రస్తావించింది. తప్పుడు కథనాలతో రెచ్చగొడుతున్న మీడియాను సరిదిద్ది సత్యాలు వెల్లడించే ప్రయత్నం జరగలేదని కూడా చెప్పింది. విహెచ్‌పి నాయకులొకరు అధికారుల సమావేశంలో పాల్గొన్నట్టు విచారణ అధికారి ఎ.కె మల్హోత్రా విమర్శించారు. గుజరాత్ తగలబడుతుంటే ప్రభుత్వాధి నేతలు నీరోల్లా వ్యవహరించాని సుప్రీంకోర్టు ఒక దశలో వ్యాఖ్యానించింది. మానవ హక్కుల కమిషన్ మరింత తీవ్రంగా మోడీ ప్రభుత్వాన్ని అభిశంసించింది. సిట్ మోడీని విచారించిన తీరు సరిగా లేదని గుజరాత్ హైకోర్టు వ్యాఖ్యానించింది. నిజానికి ప్రభుత్వం తీరు బాగాలేదంటూనే మోడీపై విచారణ జరపక పోవడానికి సిట్ చూపిన కారణాలు సాంకేతికమైనవే. ఒక కేసులో కోర్టుకు సహకరించేందుకు నియమితులైన అమికస్ క్యూరీ రాజా రామచంద్రన్ మోడీని విచారించాలని వాదించారు. కనుక సుప్రీం కోర్టు తీస్తా సెతల్వాద్ వంటి వారిలో దురుద్దేశాలు చూడటం తలకిందులు తర్కం, అంటే సిట్ నివేదిక అంతిమం అంటే రాజ్యాంగం ఏమయ్యేట్టు? ఇక ఆ పేరుతో ఆమెను అరెస్టు చేయడం రాజ్యం దమననీతి. అదే నూపుర్‌శర్మను అరెస్టు చేయకపోవడమేమిటని సుప్రీం నేరుగా వ్యాఖ్యానించినా ఇంతవరకూ ఎలాంటి చర్య లేదే? నాజీలపై నాటి న్యూరేన్ బర్గ్ విచారణ అటుంచి ఫాసిస్టు చర్యల కారకులపై ఇప్పటికీ పాశ్చాత్య దేశాల్లో విచారణ జరుగుతూనే వుంటుంది. యాభై ఏళ్లనాటి ఎమర్జన్సీని ఇప్పటికీ విమర్శిస్తుంటాము. ఇంకా విచిత్రంగా వందల ఏళ్లనాడు ఆలయాలు కూల్చారనే ఆరోపణలతో ఈ పాలక పక్షీయులు కేసులు పెడితే తీర్పులు వస్తుంటాయి మరి! ఇరవయ్యేళ్ల గుజరాత్ నరమేధంలో నేరస్తులను మర్చిపోవాలన్న సంకేతం సుప్రీం నుంచి ఆశించేదేనా? చెప్పుకోవలసిన అంశాలు ఇంకా చాలా వున్నా ముందు జరగాల్సింది ఆమెను విడుదల చేయడం. దోషులను శిక్షించడం. అవసరమైన వివరణతో ఆమె అరెస్టు తాము చెప్పింది కాదని స్పష్టం చేయాలి. తీర్పును సమీక్షించుకుని సవరించుకోవాలి. లేకపోతే భవిష్యత్తులో బాధితుల తరపున హక్కుల కోసం ముందుకు వచ్చేవారిపై ఇది బెదిరింపు అస్త్రంలా మారుతుంది.

**(జూలై 3, 2022 ప్రజాశక్తి)**



**వాని రెక్కల కష్టంబు లేనినాడు**
**సస్యరమ పండి పులకింప సంశ యించు**
**వారు చెమ్మటలలోడ్చి ప్రపంచమునకు భోజనం బెట్టు**
**వానికి భుక్తి లేదు..**
**- గుర్రం జాషువా**

# చరవాణి వదిలేశాక ...

- పుట్టి గిరిధర్
94914 93170



ఈరోజెందుకో
మనసు తేలికగా ఎగురుతోంది
బరువునంతా ఎక్కడో దించేసినట్లు
కట్టేసిన గొలుసును తెంపేసినట్లు
ఏదో తెలియని స్వేచ్ఛ ఆవహించింది
నేలను వదిలి రివ్వుమనే రెక్కల పక్షినై
తనివితీరా ఎగరాలనిపిస్తుంది!

నా చుట్టూ ఉన్న నాలుగు గోడలు
వింతగా నన్ను చూస్తున్నాయి
నా కంటికి చిక్కని అందాలెన్నో
ఈ రోజు తారసపడుతున్నాయి
మాటలు వినబడుతున్నాయి
నవ్వులు కనబడుతున్నాయి
ఆకాశం ఇంద్రధనుస్సును చూసి మురిసినట్లు
మరిచిపోయిన భావాలన్నీ గుర్తుకొస్తున్నాయి!

ఎప్పుడూ తలదించుకునే చూపులు
తలెత్తుకుని ప్రపంచాన్ని చూస్తున్నాయి
యంత్రంలా నిరంతరం కదిలే
చేతివేళ్ళకు కూడా స్పర్శ తెలిసొచ్చింది
ఎవరూ నన్ను రమ్మని పిలవట్లేదు
ఎవరూ నన్ను వెనక్కు లాగట్లేదు
ఇన్నాళ్లు నన్ను నేను కోల్పోయినట్లు
ఎక్కడో తప్పిపోయిన నేను
నేడు చల్లగా వ్యాపించే వెన్నెలనై
అడుగడుగులో కొత్త నడకను చూస్తున్నాను!

ఆరుబయట ఉన్నా
జైలులో బందీనై ఉన్నట్లు
నలుగురిలో ఉన్నా
నాలో నేను మాట్లాడుకుంటున్నట్లు
నాకు తెలియకుండానే
నన్నెవరో నడిపిస్తున్నట్లు
ఒకసారి కోపం, ఒకసారి ఇష్టం
ఒకసారి నవ్వు, ఒకసారి ఏడుపు
నవరసాలన్నీ నాలోంచి కాకుండా
ఎవరో నాలోకి నింపుతున్నట్లు

లోకాన్ని మరిచిపోయి
ఎవరి లోకంలోనో బతుకుతున్న నేను
నేడు మేఘాలను వదిలిన చినుకునై
నాకు నేను మనిషిలా కనిపిస్తున్నాను!

నన్ను నిరంతరం వెంటాడే ఓ పరికరం
ఈరోజు నా చేతిలో లేదు
దానికి సెలవిచ్చి
నాకు నేను బతుకునిచ్చుకున్నాను
ఎన్నాళ్లనుండో చతికిలబడ్డ నేను
సముద్రాన్ని వదిలి ఎగిసే అలల చలనమై
పాత లోకాన్ని కొత్తగా చూస్తున్నాను!

ఎన్నాళ్లనుండో వెతుకుతున్న స్వేచ్ఛ
ముఖానికి తగిలించుకున్న
మాయల తెరను వదిలించి
నన్ను నాకు పరిచయం చేసింది!

ప్రపంచాన్ని మన చేతిలో బంధించినా
మనల్ని తన గుప్పెట్లో పెట్టుకుని
బానిసలా మార్చేసిన 'చరవాణి'ని
నెలకొక్కసారైనా మరిచిపోతే
మనకు మనం దొరుకుతామని అర్థమైంది! ■



# సాహిత్య కారులకు ఒక నిబద్ధత అవసరం

## ప్రముఖ సాహిత్య విమర్శకులు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి

**కవులకు, రచయితలకు తాము రాస్తున్న అంశాల పట్ల నిబద్ధత అవసరమని ప్రముఖ రచయిత, సాహితీ విమర్శకులు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి అన్నారు. సృజనకారుడు ఒక దృక్పథాన్ని కలిగిఉండడం తప్పు కాదని, అలా ఉండకపోవడమే సాహిత్యానికి నష్టం కలిగిస్తుందని పేర్కొన్నారు. రచయిత డాక్టర్ టేకుమళ్ల వెంకటప్పయ్య 'సాహితీ ప్రస్థానం' పత్రిక తరపున రాచపాళెం చంద్రశేఖర రెడ్డితో ముచ్చటించారు. ఆ ముఖాముఖి ఇదీ ... :**

**నమస్కారం చంద్రశేఖరరెడ్డి గారూ.. విమర్శనారంగంలో, కథారంగంలో, రచనారంగంలో ఇలా అనేక రంగాల్లో లబ్ధప్రతిష్టులైన మిమ్ములను ఇలా ముఖాముఖి ద్వారా కలుసుకోవడం చాలా సంతోషం. కొన్ని సాహిత్య విషయాలకు సమాధానాలివ్వాలని కోరుతూ మొదటగా మీ బాల్యం, అప్పట్లో ఉన్న ఆసక్తులు క్లుప్తంగా చెప్తారా?**

నా జీవితం, సాహిత్య వివరాలు అడుగుతున్నందుకు సంతోషం. మాది వ్యవసాయ కుటుంబం. తిరుపతి సమీపంలోకి కుంట్రపాకం మా స్వగ్రామం. నా బాల్యమంతా వ్యవసాయంతోనే గడిచింది. మంగమ్మ, రామిరెడ్డి గార్లు నా తల్లిదండ్రులు. మా తల్లిగారు నాకు మూడేండ్ల వయసున్నప్పుడే మరణించింది. పినతల్లి రాజమ్మ నన్ను ఆదరంగా పెంచింది. అప్పట్లో నా ఆసక్తి అంతా వ్యవసాయ రహస్యాలు తెలుసుకోవడమే. గాంధీ జయంతి, దీపావళి, భోగిపండుగలు జరుపుకోవడం, కబడ్డీ, బిళ్ళాకోడు ఆడుకోవడమే ఆసక్తులుగా నా బాల్యం గడిచింది.

**మీ తొలి రచన ఎప్పుడు అచ్చయింది? అప్పటి మీ సంతోష క్షణాలను ఒక్కసారి పంచుకుంటారా?**

'సినిమా కవిత్వం' అన్న పేరుతో రాసిన వ్యాసం ఒకటి ఎం.ఎ (తెలుగు) రెండో సంవత్సరం శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో చదువుతున్నప్పుడు ఒక సదస్సులో సమర్పించాను. అదే నా తొలి రచన. ఆ పత్రం 1972 అక్టోబరులో స్రవంతి అనే మాసపత్రికలో ప్రచురితమైంది. సహజంగానే నా రచన అచ్చురూపం ధరించడం చాలా ఆనందం అనిపించింది. ఆ సమయంలో నేను పరిశోధక విద్యార్థిగా ఉన్నాను. పత్రిక రాగానే నా జూనియర్ విద్యార్థయిన వి.చెంచయ్యకు చూపించాను. ఆయన చాలా ప్రణాళికాబద్ధంగా ఉన్నదని అభినందించాడు. నా సహ పరిశోధకులు ఎన్.భక్తవత్సలం, ఆర్.వెంకటసుబ్బయ్య గార్లు నన్ను చాలా అభినందించారు.

**ఎన్నో గొప్ప ప్రబంధాలు ఎన్నో ఉండగా 'ప్రభావతీ ప్రద్యుమ్నం'పై మీరు సిద్ధాంత గ్రంథం ఆవిష్కరించడానికి కారణం కట్టమంచి వారి 'కవిత్వ తత్త్వ విచారము' మిమ్మల్ని ప్రభావితం చేసిందని అనుకోవచ్చా?**

సాధారణగా పరిశోధనాంశ నిర్ణయం, విద్యార్థి ఆసక్తులను దృష్టిలో ఉంచుకుని, పర్యవేక్షకులే నిర్ణయిస్తారు. నాకు మొదటినుంచీ వ్యవసాయం ప్రధానం. విద్య రెండవది. ఎం.ఎ., పూర్తయ్యాక సిలబస్లో ఉన్న తెలుగే నా చదువు. మా గ్రామంలో

శ్రీరామనవమి, శ్రీ కృష్ణ జయంతి సందర్భాల్లో జరిగే పురాణ పఠనం వినేవాడిని. అలా ప్రాచీన సాహిత్యంపై పరిచయం పరోక్షంగా ఉంది. మా శాఖాధ్యక్షులు నన్ను 'నీ పరిశోధనాంశం ప్రాచీన సాహిత్యమా? లేక ఆధునిక సాహిత్యమా?' అని అడిగినప్పుడు నాకు ఆధునిక సాహిత్యంతో అంత పరిచయం లేదు. అందువల్ల ప్రాచీన సాహిత్యం వేపు మొగ్గుచూపాను. వారు ఆచార్య తుమ్మపూడి కోటేశ్వరరావు గారిని కలవమని చెప్పారు. శ్రీ తుమ్మపూడి వారు నన్ను 'ప్రభావతీ ప్రద్యుమ్నం' మీద పరిశోధన చేయమని చెప్పారు. పరిశోధనలో భాగంగా కట్టమంచి వారి 'కవితత్త్వ విచారం' చదివాను. అప్పటికి నాకు గల ప్రాచీన సాహిత్యాభిరుచి వల్ల, నా సిద్ధాంత గ్రంథంలో కట్టమంచివారితో విబేధించాను. ఇప్పుడు నాకు కట్టమంచి వారు ఆదర్శప్రాయుడయ్యారు.

**మీ రచనల్లో ఎక్కువ ప్రాధాన్యత విమర్శకే ఇచ్చినట్టు కనిపిస్తున్నది. మీ దృష్టి విమర్శ వేపుకు మళ్ళడానికి ప్రత్యేకమైన కారణాలేమైనా ఉన్నాయా?**

నిజమే! నేను ప్రధానంగా సాహిత్య విమర్శ చదివి, యాభై యేళ్ళలో ముప్పైకి పైగా విమర్శ గ్రంథాలు ప్రచురించడం పట్ల నాకు ఆశ్చర్యం కలుగుతూ ఉంటుంది. నా పరిశోధనా విద్యార్థి జీవితం నన్ను విమర్శ వేపు నడిపించింది. పరిశోధనాకాలంలో కట్టమంచి వారు, తుమ్మపూడి వారు, కేతవరపు రామకోటి శాస్త్రి గారు, జి.వి.సుబ్రహ్మణ్యం గారు, పాటిబండ మాధవశర్మ వంటి పండితుల విమర్శ గ్రంథాలు చదివి, ఆకళింపు చేసుకుని, విమర్శనా రంగం వైపు ఆకర్షితుడనయ్యాను. ఆ తర్వాత రా.రా., వల్లంపాటి, సర్దేశాయి తిరుమలరావు గార్ల ఆధునిక విమర్శనా గ్రంథాలను కూడా చదివాను. మా శాఖాధ్యక్షులు జి.ఎన్.రెడ్డి గారు, తరగతి గదిలో పాఠ్యాంశంగా విమర్శనా సూత్రాలు బోధించిన మద్దూరి సుబ్బారెడ్డి గార్లు మాచేత సెమినార్లు చేయించడం, పాఠాలు చెప్పించడం వంటి కార్యక్రమాలు చేసేవారు. తుమ్మపూడి వారు ఒక కావ్యాన్ని అనేక కోణాల్లో పరిశీలించడం నేర్పారు. ఈ నేపథ్యం నన్ను విమర్శ వేపు నడిపిందని చెప్పవచ్చు. అప్పట్లో రాయలసీమ సాహిత్య విమర్శకులకు నెలవు అనే ప్రచారం ఉండేది. నాకు కూడా సాహిత్య విమర్శకుడు అనిపించుకోవాలన్న ఉత్సుకత, నన్ను అలా విమర్శ వేపు నడిపించింది.

**కథలు, కథానికలు, నవలల విమర్శపై మీరు ఎక్కువ దృష్టి పెట్టడానికి కారణాలేమైనా ఉన్నాయా?**

నిజానికి నా సాహిత్య విమర్శ ఎక్కువగా కవిత్వం మీదనే సాగింది. ఆ తర్వాతి స్థానం కథానికలు, నవలలది. నాటక విమర్శ మీద నా కృషి నామమాత్రమే! ప్రాచీన ఆధునిక కవిత్వంపై నేను 15 విమర్శ గ్రంథాలు ప్రచురించాను. నవల, కథాంశం, మన నవలలు – మన కథానికలు, గురజాడ – తెలుగు కథానిక, మరో నలభై వ్యాసాలు ప్రచురించాను. నేను ఆధునిక విమర్శకుడిగా ఎదుగుతున్న సమయానికి తెలుగులో కథానిక వైపు సమాజం దృష్టి బాగా విస్తరించింది. ఆ ప్రభావంతో నేను కథానికా విమర్శ వేపు దృష్టి పెట్టాను. నా విద్యార్థులతో ఎక్కువగా కథానికల మీదనే పరిశోధనలు చేయించాను. కాళీపట్నం రామారావు గారు కథానిలయం స్థాపించినప్పుడు నాతోనే ప్రారంభింపజేశారు. ఆయన కథానిలయం స్థాపించడానికి నా దగ్గర జరుగుతున్న కథానికా పరిశోధనలే కారణమని కూడా చెప్పారు. ఈ విషయాలన్నీ నేను కథానిక విమర్శ చేయడానికి కారణాలయ్యాయి.

**వాడ్రేవు చిన వీరభద్రుడు గారు ఒకచోట 'పాశ్చాత్య దేశాల్లో కథలు నవలలు, ఆధునికతావాద కథన పద్ధతులను ధిక్కరించి, నేడు పోస్ట్ మాడరన్ నెరేటివ్ల వేపు పయనిస్తూ, వాస్తవిక వాదాల వేపు దూసుకెళ్తుండగా, తెలుగు నవలలు మాత్రం ఇంకా విక్టోరియన్ కాలపు నవలా శిల్పం దగ్గరే ఆగిపోయింది' అన్నారు. తెలుగు నవల ఇంకా శైశవ దశలోనే ఉందంటారా? ఈ వ్యాఖ్యపై మీరు ఏకీభవిస్తారా?**

నాకు వాస్తవికతావాదం పట్ల పరిపూర్ణమైన నమ్మకం, ఇష్టం ఉన్నాయి. ఆధునికానంతరవాదం మీద నాకు విశ్వాసం లేదు. భారతదేశం ఇంకా పురాతన విశ్వాసాలు ఆచారాల దగ్గరే సంచరిస్తున్నది. అచ్చమైన ఆధునిక సమాజంగా మారలేదు. ఆధునికత ఇంకా సాధించని మన సమాజంలో ఆధునికానంతర వాదం ఎలా ప్రవేశిస్తుంది? భారతీయ సమాజంలో పైమెట్టు మీద కూర్చున్న కొందరికి ఇష్టమైనది ఆధునికానంతర వాదం.

**వల్లంపాటి 'నవలా శిల్పం' పుస్తకాన్ని నేటి మార్పులకు అనుగుణంగా పునర్మూల్యాంకనం చేయాల్సిన అవసరం ఉందని నా అభిప్రాయం. ఏమంటారు?**

వల్లంపాటి వెంకటసుబ్బయ్య గారి 'నవలా శిల్పం' ఇరవయ్యవ శతాబ్దం చివరి దశాబ్దంలో వచ్చింది. అప్పటికి ఆ గ్రంథం నవలాధ్యయనం పట్ల కొత్తచూపును కలిగించింది. ఆయన ఆంగ్లాధ్యాపకులు. నవలకు సంబంధించి పాశ్చాత్య సాహిత్య గ్రంథాలను అధ్యయనం చేసి 'నవలా శిల్పం' రాశారు. తర్వాత గడచిన మూడు దశాబ్దాల్లో సాహిత్య విమర్శ చాలా విస్తరించింది. మారిన సందర్భానికి అనుగుణంగా మరో పుస్తకాన్ని ఎవరైనా రాయవచ్చు. వారి ప్రతిపాదనలను సవరించ వచ్చు. ఖాళీలను పూరించవచ్చు.

**పెన్నూరి సునీల్ దీర్ఘ కవితల మీద రాసిన సిద్ధాంత గ్రంథానికి మీ ముందుమాటలో తొలి దీర్ఘ కవిత 'తెలంగాణా' అని పేర్కొన్నారు. కాని వాస్తవానికి దానికి మూడేళ్ల ముందే వచ్చిన కవిరాజ మూర్తి 'మహైక'ను మీరు విస్మరించడానికి ప్రత్యేకమైన కారణాలేమైనా ఉన్నాయా?**

తొలి దీర్ఘకవిత ఏది? అన్న ప్రశ్నకు చారిత్రక ఆధారాలు మారుతున్నందువల్ల సమాధానం మారుతోంది. 'మహైక' ముందు వచ్చి ఉంటే అదే తొలి దీర్ఘ కవిత అవుతుంది. అది వచ్చిందని తెలియకనే 'తెలగాణా' తొలి దీర్ఘ కవిత అని నేను అన్నాను. అది విస్మరించటం కాదు; ఆ విషయం నా దృష్టిలో లేకపోవడమే కారణం.

**గురజాడ కన్యాశుల్కాన్ని మీరు వివిధ కోణాల్లో దర్శించి, పరిశోధనా వ్యాసాలను రాశారు. గురజాడ - మన విమర్శకులు, దీపధారి గురజాడ, ఇలా ఎన్నో రచనలు చేశారు. వేల్చేరు వారి కవితా విప్లవాలలో గురజాడ వారిది 'అసంపూర్ణ విప్లవం' అని అన్నారు. మీ దృష్టిలో గురజాడ - జాడలు భావితరాలపై ఎలాంటి ముద్రను వేశాయి?**

వేల్చేరు నారాయణరావు గారి 'తెలుగులో కవితా విప్లవాల స్వరూపం' తొలిసారిగా అచ్చయి వచ్చినప్పుడు అది విప్లవమే! తెలుగు సాహిత్య అధ్యయనం మీద కొత్త కాంతి ప్రసరించింది. ఏ నోట విన్నా అప్పుడు ఆ గ్రంథం మాటే. తెలుగు విప్లవ సాహిత్యం ప్రారంభ దశలో ఉన్నప్పుడు ఆ గ్రంథం వచ్చింది. ఆ నేపథ్యం కూడా ఆ గ్రంథం ఫోకస్ కావడానికి తోడ్పడింది. ఆ గ్రంథం ఇప్పటికి విలువైనదే. అయితే నారాయణరావు గారు విప్లవం అన్న మాటను చాలా వదులుగా, సాధారణీకరించి ఉపయోగించారనే మాట ఆరోజుల్లో వినిపించింది. ఆయన 'గురజాడది అసంపూర్ణ విప్లవం' అన్నారు. గురజాడ సాంఘిక విప్లవ రచయిత. సమాజంలో ఉన్న అంధవిశ్వాసాలు, మూఢ నమ్మకాలు, ఆచారాలను ఖండించి ఒక మానవీయ సమాజాన్ని ప్రతిపాదించాడు. కులమత వైషమ్యాలను, స్త్రీ వివక్షను, మతమౌఢ్యాన్ని ఖండించాడు. స్త్రీపురుష సంబంధాల్లో, మొత్తంగా మానవ సంబంధాల్లోనే మార్పులు కోరుకున్నారు. 'మగడు వేల్పన పాత మాటది. ప్రాణమిత్రుడ నీకు', 'వర్ణ ధర్మ మధర్మ ధర్మంబే', 'అన్నదమ్ముల వలెను జాతులు మతములన్నియు మెలగవలెనోయ్', వంటి వాక్యాలన్నీ గురజాడను సాంఘిక విప్లవవాదిగా నిర్ణయిస్తాయి. గురజాడ కోరుకున్న సమాజం ఇంకా ఏర్పడలేదు. అందువల్ల వేల్చేరు చెప్పినట్లు ఆయనది అసంపూర్ణ విప్లవం అనవచ్చు. ఇవాళ అది కొనసాగుతున్న విప్లవం. గురజాడ నాటికి ఈనాటికి సాహిత్యం ఎంతో విస్తృతి



## బీటలు వారిన దేహం

దేశం నిండా కన్నీటి జీవనదులు
దేహమంతా నెత్తుటి చారికలు
పొలాలు బీటలు వారడమిక్కడ
అందమైన భౌగోళిక ముఖచిత్రం
కడుపులు నింపని నేలను చూసి
గుక్కపట్టి ఏడ్చినా రాలని అశృవుల్ని చేసి
భూదేవి నవ్వుతోంది
ఐనా బతకడం తెలిసిన వాళ్ళం
మట్టిని ముద్దాడిన పుడమితల్లి పుత్రులం..
మలినమంటని ఆకలి పేగులం..
విశ్వానికే కంచంలో అన్నం పెట్టే అన్నదాతలం..
కాలే కడుపుకు నడుము కట్టుకట్టిన
దారిద్ర్యరేఖ బంధువులం..
ఋతువుల్లోనైనా ఒక్క వానచుక్క కోసం
ఆకాశంవైపు ఆర్ద్రతగా ఎదురు చూసే ఆశాజీవులం
కష్టాన్ని నమ్ముకుని కన్నీళ్లు దాచుకొని
నడక సాగించే నాగలి సోదరులం..

**- స్వయంప్రభ**

**88975 52022**

పొందింది. వైవిధ్యం సంతరించుకొన్నది. ఈ వైవిధ్యానికి బీజాలు, కారణాలు గురజాడలో కొన్నైనా ఉన్నాయి. వంటిళ్ళను విధ్వంసం చేయాలని మనం ఈనాడు అంటున్నాం. గురజాడ ఆనాడే అన్నాడు. కులాన్ని నిర్మూలన చెయ్యాలని, దానికి కులాంతర వివాహాలు మార్గమని డా.బి.ఆర్.అంబేద్కర్ పిలుపునివ్వకముందే గురజాడ 'లవణరాజు కల' రాశాడు. సాహిత్య రచనలో వ్యవహారిక భాష వాడకంలో మార్గదర్శి. సాహిత్యాన్ని సంఘ పరివర్తనకు ఆయుధంగా ఉపయోగించడం మనకు గురజాడే నేర్పారు. ఈ విషయంలో ఆయన కృషి ఏమాత్రం చిన్నదికాదు. అందువల్ల గురజాడ, తర్వాత నిలబడ్డ సాహిత్యం మీద, ప్రభావం చూపిన మాట వాస్తవం.

**ఆధునిక కవిత్వాన్ని విమర్శించడానికి 'గతితార్కిక భౌతికవాద విమర్శ' తప్ప వేరే గత్యంతరం లేదని పురిపండా అప్పలస్వామి ఒక చోట అనడం గమనిస్తే, మన భారతీయ విమర్శనా దృక్పథం సర్వత్రా పనికిరాదన్న భావాన్ని వ్యక్తీకరించడమే కదా? మీ అభిప్రాయం?**


పురిపండా అప్పలస్వామి తొలి తరం మార్క్సిస్టు. ఆధునిక కవిత్వాన్ని విమర్శించడానికి గతితార్కిక భౌతిక వాద విమర్శే సరైనదనడం అప్పటి ప్రపంచం మీద మార్క్సిస్టు ప్రభావం బలంగా ఉండడమే. భారతదేశానికి విస్తృతమైన అలంకార శాస్త్ర సంప్రదాయముంది. భారతీయ అలంకార శాస్త్రాలన్ని ప్రాచీన మధ్యయుగ భారతీయ సాహిత్యం ఆధారంగా రాయబడ్డవి. అంటే ఆ సాహిత్యానికి, ఆ అలంకార శాస్త్రానికి విడదీయరాని సంబంధం ఉంది. ప్రాచీన భారతీయ సాహిత్యమంటే రాచరిక, భూస్వామ్య, వర్ణ పురుషాధిపత్య వ్యవస్థను వడ్డించే సాహిత్యం. భక్తి ఆస్థాన సాహిత్యం అందుకు అనుకూలం. ఆనాటి భారతీయ అలంకార శాస్త్రాలు వాటి ఆధారంగా పుట్టినవే. అవి కావ్యాలు లేదా నాటకంలో నాయికా నాయకులుగా ఎవరుండాలి? రసాలు ఎలా ఉండాలి? వర్ణనలు, వక్రోక్తి, ధ్వని, చమత్కారం వంటివి ఎలా ఉండాలి? అన్న విషయం చెబుతాయి. ఆ అలంకార శాస్త్రాల వెలుగులో ఆధునిక కవిత్వాన్ని అధ్యయనం చేయడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు. ప్రాచీన లేక ఆధునిక సాహిత్యంలో వస్తు పరిశీలనకు సంప్రదాయ అలంకార శాస్త్రం ఎంతవరకూ ఉపయోగపడుతుంది? ప్రాచీన సాహిత్యంలో మానవ సంబంధాలు, స్త్రీపురుష సంబంధాలు, వివాహ వ్యవస్థ, వైజ్ఞానికాంశాలు, క్రీడావినోదాలు, వృత్తులు వంటి అంశాలను ప్రాచీన అలంకార శాస్త్రం ఆధారంగా పరిశీలించడానికి వీలవుతుందా? వీటిని పరిశీలించాలంటే మన సామాజిక శాస్త్రాల సహాయం కావాలి. భౌతికవాద భావజాలం కావాలి. అందుకే పురిపండా అప్పలస్వామి ఆమాట అన్నది. మార్క్సిజం తర్వాత మనకు, అంబేద్కరిజం, ఫెమినిజం వంటి కొత్త కొత్త సిద్ధాంతాలు అందుబాటులోకి వచ్చాయి.


**నేడు చాలామంది పేరున్న కవులు సైతం ఒక 'వర్గ స్పృహ' మీదనే వారి జీవిత కాలాన్ని వెచ్చిస్తున్నారు. కథైనా, కవిత్వమైనా, విమర్శైనా అవే వస్తువులు. కవిత్వం అంటే బహుముఖీనం కదా? అన్ని కోణాల్లో ఈ సమాజాన్ని స్పృశించవలసిన అవసరాన్ని వారెందుకు గుర్తెరగడంలేదు?**

ఒక భావజాలానికి కట్టుబడి రచన చేయటాన్ని, మీరు చట్రంలో ఇరుక్కోవడం అంటున్నారా? అలా అనకూడదు. దాన్ని *నిబద్ధత అని యిదివరకే తెలుగు సమాజం ఆమోదించింది. చట్రం అనడం నెగటివ్ టర్మ్* అవుతుంది. ఒకవేళ మీరన్నట్టు చట్రమే అయినా ప్రతి రచయితకూ ఒక చట్రం ఉంటుంది. ఏ చట్రమూ లేకుండా ఎవరూ ఏమీ రాయలేరు. అందువల్ల ఎవరి చట్రం ఏమిటో ప్రకటించుకోవడమే ఎవరైనా చేయవలసినది. *వర్గ స్పృహను వ్యతిరేకించబోయి రచయిత ప్రాథమిక లక్షణమైన నిబద్ధతను వ్యతిరేకించడం సాహిత్యన్యాయం అనిపించుకోదు.* సమాజాన్ని అర్థం చేసుకోవడానికి అనేక భావజాలాలున్నాయి. వాటిలో వర్గభావజాలం – మార్క్సిజం ఒకటి. దానికన్న శాస్త్రీయమైనది, గొప్పది ఏమైనా ఉంటే దానిని అనుసరించవచ్చు. సమాజానికి ఎన్ని ముఖాలున్నా, అన్ని ముఖాలను రచయిత తన కంటితో చూడడమే! సమాజాన్ని ఒక్కో రచయిత ఒక్కో కోణంలో స్పృశిస్తాడు. ఒకే రచయిత అన్ని కోణాల్లో స్పృశించడు. అలా స్పృశించడం అశాస్త్రీయం కూడా!

**చివరిగా, ఈనాడు అందరూ కవితారంగంలో దూకేవారే కానీ, విమర్శనారంగంలో కొద్ది మంది మాత్రమే కాలు పెడుతున్నారు. విమర్శ ముఖ్యమా? కవిత్వం ముఖ్యమా? విమర్శ మీద కవుల దృష్టి పెరగాలంటే ఏం చేయాలంటారు?**

కవిత్వమూ ముఖ్యమే! విమర్శా ముఖ్యమే! సృజనరంగంలో అధికులు ఉండడం, విమర్శన రంగంలో తక్కువమంది ఉండడం సహజమే. దానికి వగచవలసిన అవసరమేమీ లేదు. కవుల్లో చాలామంది విమర్శకులున్నారు. అయితే కవుల సంఖ్యతో పోలిస్తే విమర్శకుల సంఖ్య పరిమితమే! ఎవరినీ బలవంతంగా ఒక రంగంలోకి తీసుకుని రాలేము. కాకపోతే వర్క్‌షాపుల ద్వారా విమర్శకులను తయారు చెయ్యవచ్చు. ■



# మానవ సంబంధాలను స్పృశించిన కవిత్వం

- డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్
90145 59059

**మి**త్రుడు డాక్టర్ మహ్మద్ హసేన ఉద్యోగార్థుల కోసం పోటీ పరీక్షల పుస్తకాలను రచిస్తూనే.. వైవిధ్యంతో కూడిన 'బిడ్డా ఎప్పుడొస్తవ్' కవితా సంపుటి వెలువరించటం ముదావహం. మొదటి సంపుటితోనే మంచి కవిత్వాన్ని అందజేసే ప్రయత్నం చేసినందుకు అభినందనలు.

కడుపులో నలుసు పడ్డనాటి నుంచి భూమ్మీదకు వచ్చేవరకు తల్లి పడే తీపి బాధలు మనందరికీ తెలుసు. కన్న బిడ్డను చూసుకొని బతికే తల్లి, ఆ బిడ్డ కూడా దూరమైతే వర్ణనాతీతమైన ఆ తల్లి వేదనను, దు:ఖంతో కుదిపివేస్తున్న ప్రేమను, ఆవేదనను అక్షరాలలో బంధించి అందించే ప్రయత్నమే 'బిడ్డా ఎప్పుడొస్తవ్'. ఎంతటి కఠిన పాషాణమైన హృదయాన్నయినా కదిలించి వేసే కవిత ఇది. అదే కవితా శీర్షికను తన పుస్తకానికి పెట్టుకోవడం కవి మాతృ హృదయాన్ని ఎంతగా అవగతం చేసుకున్నాడో తెలియజేస్తుంది.

అనాదిగా ప్రకృతితో మమేకమై జీవించిన మానవుడు ఆ ప్రకృతిపై ఆధిపత్యం కోసం చేసే ప్రయత్నాల ఫలితమే అప్పుడప్పుడు మనం చూస్తున్న ప్రకృతి విలయాలు. ప్రకృతి కన్నెర్ర చేసినపుడు జరుగు విపత్కర పరిస్థితులు, 'సనిపోయిన గొడ్డుపై బోధలు వాలినట్లు/ తెల్లారేసరికి వాలిన తెల్ల చొక్కా నాయకులు' శాశ్వత పరిష్కారం చూపకుండా కంటి తుడుపుగా చేసే సహాయ కార్యక్రమాలు, 'మా తాత మా నాన్నని, మా నాన్న నన్ను/ ఇప్పుడు నేను నా పిల్లలను తుపాను బాధితుల/ పునరావాస కేంద్రాల్లో బిక్కుబిక్కుమనుకుంటూ/ బిచాన ఎత్తుకొని గడపాల్సి వచ్చే' తుపాను మిగిల్చిన విషాదాన్ని కళ్ళముందించిన తీరు అభినందనీయం.

'స్నేహానికన్న మిన్న లోకాన లేదురా, కడదాకా నీడలాగా నిను వీడి పోదురా/ నీ గుండెలో పూచేటిది, నీ శ్వాసగా నిలిచేటిది, ఈ స్నేహమొకటేనురా' అన్న భువనచంద్ర పాట మన హృదయాల్లో చెరగని ముద్ర వేసింది. జీవితంలో మనని అర్థం చేసుకొనే స్నేహితుడొక్కడుంటే చాలనుకుంటాం. అలాంటి స్నేహాన్ని, ఆ స్నేహితుడిని కాపాడుకోవలసిన బాధ్యత మన మీదుంది. 'మహమ్మారి కరోనా బజారు మొత్తం ఉడ్చేసింది' వృద్ధుని మాటలతో 'వాడితో గడిపిన కాలం కళ్ల ముందు గిర్రున తిరిగింది' కానీ లాభం లేదు. స్నేహాన్ని, స్నేహితుడ్ని కాపాడు కొమ్మని మనకొక హెచ్చరికను జారీ చేసింది 'ఇల్లు ఖాళీ చేసారు' అనే కవిత. ఇదే స్నేహం పై మరో కవిత 'నిజమైన స్నేహితుడు' స్నేహం గొప్పదనాన్ని, నిజమైన స్నేహితున్ని పరిచయం చేసింది.

కృషి ఉంటే మనుషులు ఋషులౌతారు, మహా పురుషులౌతారు అన్నది నిత్య సత్యం. 'ఆలోచనలకు ఆచరణకు మధ్య ఏర్పడే సమన్వయమే/ మనిషిని విజయం వైపు నడిపిస్తుంది', 'శ్రమకు నువ్వు దాసిగా మారితే/ విజయం నిన్ను వరిస్తుంది చూడు', 'విజేతకు పరాజితుడికి మధ్య తేడా/ ఆశావాద దృక్పథంతో కూడిన ఆత్మ విశ్వాసమే'. యువతను విజేతగా నిలిపేందుకు, వారిలో ఉత్తేజాన్ని నింపేందుకు ఈ మాటలు గొప్ప ప్రేరణా ప్రవచనాలుగా నిలుస్తాయి. 'కర్తవ్యాన్ని మరువకు/ కర్మను వీడకు/ గెలుపు దారిని వెతుకు / గెలిచి నిరూపించు 'విజేత'గా ప్రభోదాత్మకమైన ముగింపు వాక్యాలు కలిగిన 'విజేత' కవిత యువతకు స్ఫూర్తినిస్తుంది. సాధనమున పనులు సమకూరు ధరలోన అన్నట్లు 'ప్రతి మనిషి నిత్య విద్యార్థి కావాలి, నిరంతరం అభ్యాసం చేయాల'ని, అందుకు 'ప్రపంచమే ఉత్తమ గ్రంథం/ కాలమే ఉత్తమ గురువు/ ప్రకృతే పాఠ్య/ విద్యా ప్రణాళిక' అని తెలపడం కవి అనుభవాన్ని తేటపరుస్తుంది.

'తేరే బినా మేరీ జిందగీ హోగీ' 'అధూరి కహానీ'లో తనదైన భాషలో, చిన్ననాటి ఆత్మీయ మిత్రురాల్ని 'మన రెండు

కుటుంబాలు చేసిన విహారయాత్రలో / మొదటిసారి నాకు కొత్త ప్రపంచం చూపించావు' అంటూ ఆమె మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సొంపైన మాటలతో, తన హృదయంలో నిలుపుకున్న ఊహాసుందరిని 'ఎవరు నువ్వు' కవితలో హృద్యంగా వర్ణించారు.

విజ్ఞానానికి తొలి మెట్టు ప్రశ్నించడం. ప్రశ్నించడం ద్వారానే విజ్ఞానాన్ని సంపాదించగలం. 'ప్రశ్న పదునైన ఆయుధం ప్రశ్నించే వాడికి/ ప్రశ్నించండి పాలకులను/ అవినీతి అక్రమాలకు పాల్పడే అధికారులను' నేడు మనదేశంలోని పౌరులకు ఇదే ప్రథమ కర్తవ్యం. ప్రశ్నించడం ద్వారా సమాజాన్ని మార్చగలం. అదే హసేన 'ప్రశ్న' కవిత ద్వారా సూచించిన మార్గం.

కలం పట్టిన ప్రతి కవి తనని కన్న తల్లిదండ్రులను అక్షర రూపంలో తలచుకోకమానడు. హసేన కూడా 'కోడిపిల్లను గద్ద తన్నుకొని పోయినట్లు తన తండ్రిని మింగేసిన రోడ్డు ప్రమాదాన్ని తలుచుకుంటూ, నాన్నతో గడిపిన తీయని క్షణాలను గుర్తు చేసుకుంటున్నారు. 'ఇప్పటికీ నీ రూపం కళ్ళముందు కదులు తున్నట్లుగానే వుంది / నువ్వు లేవన్న సత్యం అసత్యమైతే బాగుండు నాన్న' అని ఆవేదన వ్యక్తం చేస్తారు. 'చెలిమికి చిరునామా, త్యాగానికి నిదర్శనం, మాటలకందనిది, మూటలు ఆశించనిది, భాషకు అందనిది, భావానికి దొరకనిది, కల్మషానికి గురి కానిది, అనంతం, అమలినం, అనిర్వచనీయం, అద్భుతం అమ్మ' అని అమ్మ గురించి తదాత్మ్యం చెందుతాడు. అదే నమ్మకంతో కరోనా బారిన పడిన తల్లిని 'ఇన్ని గండాలు దాటిన దానివి/ కరోనా సుడిగుండం దాటలేవా' అంటూ అమ్మ అవలీలగా కరోనా నుంచి కోలుకుంటుందన్న నమ్మకాన్ని వినిపిస్తాడు.

'జై జవాన్ జై కిసాన్' లాల్ బహదూర్ శాస్త్రి నినాదం. అన్నం పెట్టే రైతు, దేశాన్ని కాపాడే సైనికుడు ఇద్దరూ దేశానికి ముఖ్యమైన వారు. కర్షకుడు, నిత్యకృషీవలుడు, భూమికి స్నేహితుడు, ప్రకృతి ప్రేమికుడు, పర్యావరణ పరిరక్షకుడు, కాలం కరుణించకున్నా ప్రకృతి వికృత రూపం దాల్చినా మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగిపోయే రైతు వెనక బడటానికి కారణమేమిటో ఆలోచించాల్సిన అవసరం ఉంది. 'మట్టి వాసన తెలియనివాడు మద్దతు ధర నిర్ణయిస్తే /పంట పండించనివాడు పంట నష్ట పరిహారం ప్రకటిస్తే' అటు ప్రకృతి, ఇటు పాలకులు, మరొకవైపు పారిశ్రామికవేత్తలు రైతును అన్నీ రకాల మోసం చేస్తూ అణగదొక్కటానికి ప్రయత్నిస్తే రైతు వెనకబడక ఏం చేయగలడు? వ్యవసాయానికి ప్రాణం పోస్తూ, రైతును ప్రోత్సహిస్తే తప్ప భవిష్యత్తరాల వారు అనుసరించలేరన్న గొప్ప నిజాన్ని మన ముందుంచిన హసేన నిజంగా ప్రశంస నీయుడు. సైనికుల త్యాగం చెరిగిపోదని, వారి బలిదానం రేపటి ఉదయం కోసమేనని దేశం కోసం పోరాడి అమరులైన సైనికుల గాథలను త్యాగభరిత జీవితాలుగా ప్రకటించారు.

'ప్రకృతిలో నువ్వు నేను భాగమే/ నీ అస్తిత్వం కోసం నన్ను బలి చేస్తావెందుకు?' మనిషిని ప్రశ్నించిన చెట్టుకు సమాధానం ఎవరు చెప్పాలి? ప్రస్తుత పరిస్థితికి అద్దం పట్టినట్లుగా ఉంది 'నేను చెట్టుని' కవిత.

ఇంకా ఈ సంపుటిలో 'ఆత్మ విశ్వాసపు ఆలోచనలు/ నిన్ను ముందుకు నడిపిస్తే' పేదరికాన్ని జయించ గలమని, కులమతాల అడ్డుగోడలు కూలనప్పుడు/ తీరం వలె నువ్వు– కెరటం వలె నేను మిగిలిపోక తప్పదని, వాటిని దూరం చేసుకున్నప్పుడే నువ్వు – నేను ఏకమౌతామని, వనమహోత్సవంతో 'ఆపదలు నివారించు/ రేపటి తరము రక్షించు/ వృక్షాలను పెంచుదాం/ కాలుష్యం నివారిద్దా'మని, బంధం ఎప్పుడూ బందీ కాదు, బంధాలు అనుబంధాలు మనల్ని ముందుకు నడిపించే ఉ త్ప్రేరకాలుగా భావించాలని .. ఇలా ఎన్నో ప్రబోధాత్మక వాక్యాలు తారసపడతాయి, ఈ సంపుటిలో. తొలకరి, బాల్యం, వలస కార్మికులు, యోధుడు, స్వేచ్ఛ, తను అడిగింది, అహాన్ని జయించు, శిలువపై సందేశం, దేశానికి ఆక్సిజన్ కావాలిపుడు, అవును నేను మట్టినే, గురువే దైవం, డార్లింగ్, యుద్ధం గెలుద్దాం తదితర కవితలతో కూడిన ఈ సంపుటిని సాహితీలోకంలోకి ఆహ్వానిస్తూ .. మహ్మద్ హసేన మరిన్ని కవితా సంపుటులతో మున్ముందుకు సాగాలని ఆశిద్దాం. ■

**నిజమైన ప్రజా రచనలు నిద్రించేవాణ్నీ అలసిపోయినవాణ్నీ మేల్కలుపుతాయి. యథార్థ స్థితిని బోధిస్తాయి. చైతన్యవంతం చేసి, కార్యాచరణకు పురిగొల్పుతాయి.**

**- చిన్నప్ప భారతి**

## మాతృక

నలుగురు పోగయ్యారు...
మొదట్లో నున్నగా దువ్విన తలలా ఉన్న మాటలు
కొద్దికొద్దిగా రేగిన జుత్తులా మారాయి
పచ్చదనాన్ని దాటి వచ్చేశారు
మధ్య మధ్యలో మేనర్స్
సిగరెట్ వెలిగి ఆరిపోయినట్టు ఆరిపోతుంది
వాదనలో వీగిపోయినవి సిగరెట్ పీకల్లా పడివున్నాయి
ఒకరిద్దరికి వాళ్ళువాళ్ళుగా ఉండటానికి జాగా లేదు
కొన్ని హోల్ సేల్ సలహాల మధ్య
క్రమంగా ఇమ్మియరిలిజమ్లో
గెలిచో ఓడో వెళతారు
వాదన 'ప్రపంచానికి తన జైలు గోడలు తెలియవు'
అన్న మాట దగ్గర మొదలైంది!

మధ్యాహ్నం పైన సూర్యుడు వెనక్కి నడుస్తాడు
తిరిగి సాయంత్రం పోగయ్యారు
ఆ సమయాన్ని
బీరు సీసా మూత తీసినట్టు తెరుస్తారు
ప్రశాంతతను గ్లాసుల్లో పోసుకుని
చీర్స్ చెబుతారు
కళ్ళు ఎర్రటి స్వర్గధామాలు
గిటార్ మాటలు లేని పాటొకటి పాడుతుంటుంది
పైన అన్ని నక్షత్రాలు ప్రకాశించినా
కొన్ని ఎక్కువ తక్కువగా ప్రకాశిస్తున్నాయి
దగ్గర్లో ప్రమాదానికి గురైన పావురం కీచుకూత!

**- శాంతయోగి యోగానంద**
96522 71520





## ఒంటరితనం

ఒక్కోసారి 'రోజు '
ఎవరి కంటా పడకుండా
ఎవర్నీ చూడకుండా
అరణ్యంలో విరిసి వాడిపోయిన
పువ్వళ్ళే గడిచిపోతుంది...
మనకు మనమే బోర్ కొట్టే సందర్భాలు
మనల్ని మనమే వెలివేసుకుని
ఏ టీవీకో, పుస్తకానికో
కళ్ళని అరువు ఇచ్చేస్తాం...
శరీరాన్ని మంచానికో, కుర్చీకో
బందీ చేసేస్తాం...
కాళ్ళకి బంధాలేసేస్తాం
మనసు కూడా నిర్బంధంలో ఉండి
చలనరహితం అవుతుంది
నిశ్శబ్దం గదుల నిండా నిండి ఉంటుంది..
ఆకలి కూడా శత్రువే ఆ సమయంలో...
గడియారం తన పని తాను చేసుకుపోతుంది
చూస్తూనే రోజు మారిపోతుంది...
ఒంటరిక్షణాల ఖాతాలో
గడిచిన రోజు జమచేయబడుతుంది!

**- సునీత పేరిచర్ల**
83094 20900

# బాల్యం గుర్తొస్తుంది



జారిన పంచె చెంగులు చేతికందక
చాచిన చేతులు వొణుకుతూ
వృద్ధాప్య వొంటిపై పంచె
కోతి కొమ్మచ్చి ఆడుతుంటే...
గుండీలు తెగిన నిక్కరు
గిరకలపై పవళించి
పసిచేతులు పైకి లాగినా
ప్రీతి లేక పాదాలను వదలని
బాల్యం గుర్తొస్తుంది!

దశాబ్దాలుగా యంత్రాలైన దంతాలు
అలసి సొలసి రాలి
తాగిన పాలను
బోసినోరు తూమై జార్చితే...
కడుపు నిండిన పసిబిడ్డ
అమ్మ రొమ్మును విడిచి
పక్కకు వొత్తిలిగాక
పాలు నిండిన పెదాల్ని
పైటతో అమ్మ ముద్దుముద్దుగా
తుడిచిన
బాల్యం గుర్తొస్తుంది!

జాగిలిపడ్డ వొళ్ళు
నిస్సత్తువ కప్పి
పట్టు తప్పిన మూత్రం
మంచం క్షేత్రమై
పంచెను ఏరువాక చేస్తే...
పడక ముఖమల్ గుడ్డపై
యధేచ్ఛగా బిడ్డ
జార విడిచిన మూత్రం చూసి
బంగారం చిచ్చు పోశాడంటూ
తల్లి మురిపాల ముద్దు చేసిన
బాల్యం గుర్తొస్తుంది!

- అడిగోపుల వెంకటరత్నమ్
9848252946

నిద్రరాని చీకట్లో
ఇంటిపై కప్పునూ
కుడి ఎడమల చూస్తూ
కునుకు కరువైనందుకు
కనుగుడ్లను నిందిస్తుంటే...
పండు వెలుగులో
కాళ్ళాడిస్తూ చేతులూపుతూ
ఊ ఊ రాగాలు ఆలపిస్తూ
రెప్పపాటులో బిడ్డ
నిద్రాదేవి వొడిచేరిన
బాల్యం గుర్తొస్తుంది!

బాల్యానిది వృద్ధాప్యంపై
హస్వదృష్టి
వృద్ధాప్యానిది బాల్యంపై
దూరదృష్టి!

# ఘనంగా తెలుగు సాహితీవనం ఐదో వార్షికోత్సవం



'పాడవే కోయిలా ..' కవితా సంకలనాన్ని ఆవిష్కరించిన దృశ్యం

క్షణక్షణం పరిణామం చెందుతూ వస్తున్న నేటి సాంకేతిక యుగంలో అనేకమైన అంతర్జాల వేదికలు నెలకొల్పబడుతూ తెలుగు భాష, సాహిత్య పురోభివృద్ధికి విశేష కృషి చేస్తున్నాయి. అందులో 23 వేల మంది సభ్యులుగా సాహిత్యాభిమానులున్న 'తెలుగు సాహితీ వనం' అగ్రభాగాన నిలుస్తోంది. ఇది ఏ ప్రాంతానికో, వర్గానికో, మతానికో సంబంధించినది కాదు. ఇదొక అంతర్జాతీయ సమూహం.

ఈ వేదికను ఏర్పరచి ఐదు సంవత్సరాలైన సందర్భంగా జులై 3, 2022 నాడు హైదరాబాద్‌లోని రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్లో 5వ వార్షికోత్సవం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ కార్యదర్శి, మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టరు డా. ఏనుగు నరసింహా రెడ్డి, గౌరవ అతిథులుగా కళారత్న బిక్కి కృష్ణ, మౌనశ్రీ మల్లిక్, సత్యాజీ, ఆత్మీయ అతిథులుగా కూచి సాయి శంకర్, అరుణ సండడి హాజరయ్యారు. తెలుగు సాహితీ వనం అడ్మిన్ శాంతికృష్ణ అధ్యక్షతన ఈ సభ జరిగింది. తొలుత శాంతి కృష్ణ తెలుగు సాహితీ వనం చేస్తున్న సాహితీ సేవల గురించి వివరించారు. సమూహంలో నెలనెలా కవితల పోటీలు, కథలు, సమీక్షల పోటీలను నిర్వహించడమే కాకుండా విజేతలకు బహుమతులను అందజేయడం, జూమ్ సాహితీ సమావేశాలు, కవి అంతరంగం మొదలైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కవులను ప్రోత్సహిస్తే మంచి సాహిత్యం వస్తుందని, మంచి సాహిత్యం వచ్చిన నేలపై భాష పరిమళిస్తుందని అన్నారు.

అనంతరం తెలుగు సాహితీ వనం కవితల పోటీల్లో గెలుపొందిన కవితలతో ప్రచురించిన మూడు సంకలనాలు 'పాడవే కోయిలా', 'వసంత వీచిక', 'సమర ధీర'; శాంతికృష్ణ రచించిన 'స్వప్న ధార', బాబురావు రచించిన 'మట్టి మొగ్గలు', శ్రీధర్ రెడ్డి రచించిన 'ప్రతిబింబం' కవితా సంపుటాలు.. మొత్తం ఆరు పుస్తకాలను అతిథులు ఆవిష్కరించి, గ్రంథ పరిచయం చేశారు. కవిత్వంలో నవ్యత ఉండాలని నరసింహా రెడ్డి సూచించారు . ఇతరుల కవిత్వంపై స్పందనలను తెలపడం ద్వారా కవులను ప్రోత్సహించాలని బిక్కి కృష్ణ అన్నారు. కవితా వస్తువుల్లో ఎక్కువ తక్కువ బేధం ఉండరాదని, ప్రేమ కవిత్వంపై చిన్న చూపు తగదని మౌనశ్రీ మల్లిక్ చెప్పారు. ఎవరు ఏ స్థాయిలో ఉన్నా తినాల్సింది అన్నమే అని, అది పండిస్తున్న రైతుకు పాలకుల విధానాల వల్లే ఇంత దురవస్థ నెలకొందని సత్యాజీ అన్నారు. రైతు వెతలపై మరింత కవిత్వం వచ్చి సమాజాన్ని చైతన్య పరచాలని అన్నారు.

అనంతరం తెలుగు సాహితీ వనం తరపున తొలి 'జీవన సాఫల్య పురస్కారాన్ని' ఒలివేటి వెంకట సుబ్రహ్మణ్య శర్మకు అందజేశారు. సుబ్రహ్మణ్య శర్మ సామాజిక, తాత్విక అంశాలపై ఎంతో కృషి చేశారు. తెలుగు సాహితీ వనంలో పద్యాలను, వాటి భావాంతరంగాలను వివరిస్తున్నారు.

తరువాత సభకు విచ్చేసిన అతిథులందరినీ తెలుగు సాహితీవనం నిర్వాహక బృందం జ్ఞాపికలతో సన్మానించారు. ఆ తరువాత తెలుగు సాహితీ వనం కార్యవర్గమైన శాంతికృష్ణ , గోలి విజయ, తాడిమేటి సూర్య ప్రకాశరావు, శ్రీధర్ రెడ్డి బిల్లా, దాకరపు బాబూరావు గార్లను అతిథులు సన్మానించారు. అనంతరం తెలుగు సాహితీ వనం పోటీల్లో విజేతలైన కవులందరికీ వేదికపై ప్రశంసాపత్రాలను అందజేసి సన్మానించారు. సూర్యప్రకాశ రావు వందన సమర్పణతో సభ విజయవంతంగా ముగిసింది.

– శ్రీధర్ రెడ్డి బిల్లా,
కాలిఫోర్నియా

# గుంటూరు శేషేంద్ర శర్మ వర్ధంతి సభ



మాట్లాడుతున్న కెంగార మోహన్; వేదికపై ఈతకోట సుబ్బారావు, గోపీనాథ్

బహుభాషా సాహితీవేత్త, ఆధునిక తెలుగు సాహిత్యంలో నవ్య పథికుడు, యుగ కవి గుంటూరు శేషేంద్ర శర్మ 15వ వర్ధంతి సందర్భంగా 'సాహితీ స్రవంతి' శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో **30-05-2022**న నెల్లూరు టౌన్ హాల్ రీడింగ్ రూంలో 'శేషేంద్ర సాహిత్య సమాలోచన' పేరిట జరిగింది. సాహితీ స్రవంతి సహాయ కార్యదర్శి ఈతకోట సుబ్బారావు అధ్యక్షత వహించగా, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.గోపినాథ్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈతకోట సుబ్బారావు మాట్లాడుతూ 'శేషేంద్ర మరణం లేని కవి' అనీ, 'తెలుగు సాహిత్యలోకంలో ఆయన పాత్ర కవిత్వానికి దిక్సూచి వంటిది' అని పేర్కొన్నారు. ముఖ్య అతిథి, సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ ప్రధానోపన్యాసం చేసారు. 'శేషేంద్ర శైలి, పద విన్యాసం, కవితారీతి ఆధునిక కవులకు ఆదర్శం' అన్నారు. 'శేషేంద్రను చదవకుండా సాహిత్య రచన చేయడమంటే అది అసంపూర్ణమే. అందుకే ప్రతి రచయిత శేషేంద్ర సాహిత్యాన్ని తప్పక చదవాలి. ఆయన తన కవిత్వాన్ని ఆయుధంగా చేసి సామాజిక, ఆర్థిక దోపిడిపై యుద్ధం చేశారు. సామాన్యుడి పక్షాన నిలిచి తన గొంతెత్తారు' అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జరిగిన 'జన కవనం'లో 20 మంది కవులు పాల్గని సామాజికాంశాలపై తమ కవితలను వినిపించారు. ఈ సభలో సాహితీ స్రవంతి జిల్లా కమిటీ సభ్యులు బద్దిపూడి శీనయ్య, పార్వతీశం, కవులు, కవయిత్రులు అవ్వారు శ్రీధర్ బాబు, గోవిందరాజు సుభద్రాదేవి, నజ్మా షమ్మి, పద్మ సుధామణి, అరుణ కుమారి, సిహెచ్.వి.బృందావనరావు, ఇసనాక దయాకర్ రెడ్డి, డా.కాలేషా బాషా, ఇంద్రగంటి మధు, తిప్పావఝుల సుబ్రమణ్యం, దేవరపల్లి రమణయ్య, ప్రముఖ రచయితలు డా.గంగిశెట్టి శివకుమార్, బొగ్గవరపు రాధాకృష్ణమూర్తి, గుండాల నరేంద్రబాబు, జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎ.జయప్రకాష్ పాల్గొన్నారు.



# పెరుక రాజుకు జీవన సాఫల్య పురస్కారం

వివిధ భాషల్లో కవిగా, రచయితగా అనువాదకుడిగా, గేయకుడిగా సాహిత్యంలో చేస్తున్న విశేష కృషికి గుర్తింపుగానూ డా. పెరుక రాజుకు ప్రతిష్ఠాత్మకమైన 'తెలంగాణ ఆణిముత్యం' ప్రత్యేక పురస్కారం-2022 జీవన సాఫల్య పురస్కారాన్ని తెలంగాణ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, 5.6.2022వ తేదీన హైదరాబాద్‌లో శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రదానం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం నర్సింగాపూరు గ్రామానికి చెందిన డా. పెరుక రాజు వేలల్లో కవిత్వం, వందల్లో కథలు, అనువాదాలు చేశారు. 13 సాహితీ సంపుటాలు వెలువరించారు. ఇండియన్ ఆర్మీలో జూనియర్ అధికారి హోదాలో నీలగిరి కొండల్లో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రాజు రచించిన 'అవ్వ' కథల సంపుటిని శాసన మండలి చైర్మన్ ఆవిష్కరించారు. కాగా, ఈ ప్రతిష్ఠాత్మకమైన ఆణిముత్యం అవార్డును రాజు పుడమితల్లి బిడ్డలకు అంకితం చేశారు. ఆయన సుదీర్ఘ సాహితీ ప్రసంగం అందరినీ ఆలోచింపజేసింది. ఈ కార్యక్రమంలో సాహితీ వేదిక జాతీయ అధ్యక్షులు డా.సిహెచ్ బాల్ రెడ్డి, గురుదేవ్ జీ, ఇంజనీర్ జె సమీర్ కుమార్, పలువురు ఎమ్మెల్యే లు, ఎమ్మెల్సీలు, విద్యా వేత్తలు, విద్యార్థులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## 'మహబూబ్ నగర్ జిల్లా సమగ్ర స్వరూపం' గ్రంథావిష్కరణ



మహబూబ్ నగర్ జిల్లా సమగ్ర స్వరూపం గ్రంథావిష్కరణ దృశ్యం

పాలమూరు జిల్లా చరిత్ర చాలా గొప్పదని, దాని వైశిష్ట్యాన్ని భావితరాలకు అందించాలని తెలంగాణా రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, క్రీడా, సాంస్కృతిక, పర్యాటక, పురావస్తు శాఖా మంత్రి డాక్టర్ వి.శ్రీనివాస్ గౌడ్ అన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో జూలై 3 న మహబూబ్ నగర్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆయన 'మహబూబ్ నగర్ జిల్లా సమగ్ర స్వరూపం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ జిల్లాల చరిత్రను వెలుగులోకి తీసుకురావాలని నిర్ణయించడం ప్రశంసనీయమని, అందుకు పూనుకున్న ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, డా. జె. చెన్నయ్యలను అభినందించారు. సభ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి మాట్లాడుతూ సాంస్కృతిక శాఖ మంత్రిగా శ్రీనివాస్ గౌడ్ తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని వాడవాడలా ఘనంగా చాటుతున్నారన్నారు. అనంతరం మంత్రి మహబూబ్ నగర్ జిల్లా చరిత్రను రాసిన వ్యాసకర్తలను ఘనంగా సన్మానించారు. ఇంకా తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్, తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య మాట్లాడారు. అంతకుముందు పాలమూరు జిల్లా కవులచే కవిసమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు, ఎస్పీ ఆర్. వెంకటేశ్వర్లు, తెలంగాణ సంగీత, నాటక అకాడమీ తొలి చైర్మన్ బాద్మి శివకుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రహమాన్, మున్సిపల్ చైర్మన్ కె.సి.నర్సింహులు, వైస్ చైర్మన్ తాటి గణేష్, ముడా చైర్మన్ గంజి వెంకన్న, ప్రముఖ న్యాయవాది వి.మనోహర్ రెడ్డి, డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, కోట్ల వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సుధామ 'జీవనవేదం' ఆవిష్కరణ

ప్రముఖ కవి, రచయిత, కార్టూనిస్టు, కాలమిస్టు సుధామ 'వాయిస్ ఆఫ్ సీనియర్ సిటిజన్సు' మాసపత్రికలో మూడేళ్ళకు పైగా వయోధికుల కోసం రాసిన 'సీ'నియర్ కబుర్లు కాలమ్ వ్యాసాల సంపుటి 'జీవన వేదం' గ్రంథంగా జూన్ 5 ఆదివారం ఉదయం రవీంద్రభారతి పైడి జయరాజ్ ఆడిటోరియమ్‌లో 'కోకిలమ్' సంస్థ ఆధ్వర్యంలో జరిగిన పురాణం శ్రీనివాసశాస్త్రి కథల సభలో ఆవిష్కరించడం జరిగింది. ప్రముఖ రచయిత, కళావిమర్శకులు, జ్యోతి మాసపత్రిక పూర్వ సంపాదకులు, సాహితీవేత్త తల్లావఝ్ఝుల శివాజీ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రముఖ రచయిత్రి ఇంద్రగంటి జానకీబాల ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ సభలో ప్రముఖ కథారచయితలు వి.రాజారామమోహన్ రావు, దాదాహయాత్, ముక్కామల చక్రధర్, విశిష్ట పాత్రికేయులు గోపీనాథ్, రంగాచారి, కవులు వసీరా, సాంధ్యశ్రీ, పురాణం సుశీల ప్రభృతులు పాల్గొన్నారు.


ప్రముఖ రచయిత సుధామ రచించిన జీవనవేదం వ్యాస సంపుటిని ఆవిష్కరిస్తున్న దృశ్యం

# ప్రముఖ జర్నలిస్టు గుడిపూడి శ్రీహరి కన్నుమూత



ప్రముఖ సీనియర్ పాత్రికేయుడు గుడిపూడి శ్రీహరి జులై 5వ తేదీన కన్నుమూశారు. ఆయన వయసు 85 ఏళ్లు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు. గతేడాది నవంబర్‌లో శ్రీహరి భార్య లక్ష్మి మరణించారు. భార్య మరణానంతరం ఇంటికే పరిమితమైన ఆయన ఇంట్లో జారి పడటంతో తొంటి ఎముక విరిగింది. దీంతో నిమ్స్ ఆస్పత్రిలో సర్జరీ విజయవంతంగా పూర్తయింది. తరువాత ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. ఆయనకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

గుడిపూడి శ్రీహరి 1968లో 'ది హిందూ'కు కంట్రిబ్యూటర్‌గా పాత్రికేయ ప్రపంచంలోకి అడుగు పెట్టారు. అనంతరం ఈనాడు, ఫిల్మ్ ఫేర్ వంటి పత్రికలలో పనిచేశారు. హైదరాబాద్ ఆల్ ఇండియఆ రేడియోలోనూ న్యూస్ బ్రాడ్ కాస్టర్‌గా రాణించారు. సుమారు 55 ఏళ్లపాటు సినీ విశ్లేషకుడిగా, పాత్రికేయుడిగా చిత్ర పరిశ్రమకు సేవలందించారు. 1969 నుంచి ది హిందూ పత్రికలో రివ్యూలు రాయడం ప్రారంభించారు. అప్పటి నుంచి అనేక తెలుకు సినిమాలకు రివ్యూలు రాశారు. 1985లో ఉత్తమ బాలల చిత్రంగా అవార్డు అందుకున్న 'మాకూ స్వాతంత్ర్యం కావాలి' సినిమాకు శ్రీహరి మాటలు  రాశారు. 2013 సంవత్సరానికి గానూ ఆయనకు తెలుగు విశ్వవిద్యాలయం 'పత్రికా రచన'లో 'కీర్తి పురస్కారాన్ని' ప్రకటించింది. గుడిపూడి శ్రీహరి మృతిపట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. శ్రీహరి ఎక్కడా బ్యాలెన్స్ తప్పకుండా అతిగా పొగడకుండా, తిట్టకుండా సినిమా కథని పరిచయం చేస్తూనే లోటుపాట్లు చెప్పేవారు. సినిమా విడుదలైన వారం తర్వాత సమీక్షలు వచ్చేవి. శ్రీహరి సమీక్షలు ఎంత పక్కాగా వుండేవంటే ఆయన హిట్ అంటే హిట్, యావరేజ్ అంటే యావరేజ్. సినిమా చూసిన తర్వాత ప్రతి వాళ్లు సమీక్షకులే. స్నేహితులతో అభిప్రాయాల్ని చెప్పుకుంటారు. తమ అభిప్రాయాలు ఎంత వరకూ కరెక్టో శ్రీహరి సమీక్ష చదివి తెలుసుకునే వాళ్లు.

## ఎమ్మెస్సార్ జాతీయ స్థాయి కథల పోటీ ఫలితాలు



పల్లిపట్టు నాగరాజు

ఎమ్మెస్సార్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వారు ఇటీవల నిర్వహించిన ఎమ్మెస్సార్ జాతీయ స్థాయి కథల పోటీలో బహుమతి పొందిన కథల వివరాలను ప్రకటించారు. ప్రథమ బహుమతి :  పనిమంతుడు – కె. వి.మేఘనాథ రెడ్డి– పలమనేరు; ద్వితీయ బహుమతి : దోసైక దృక్కు – పాణ్యం దత్త శర్మ– హైదరాబాద్; తృతీయ బహుమతి  : నీటిబరువు – పద్మావతి రాంభక్త, విశాఖపట్నం. వారు గెలుపొందారు. ఐదు కథలకు ప్రోత్సాహక బహుమతులు ప్రకటించారు. పునర్జన్మ (శరత్ చంద్ర), జరభద్రం సార్! (సిహెచ్.నాగార్జున శర్మ), కాలచక్రం (గన్నవరపు నరసింహ మూర్తి), సముద్రం (కె.ప్రవల్లిక), కుబుసం (సింహ ప్రసాద్).

తెలుగు సాహిత్యంలో విశేషంగా కృషి చేస్తున్న సాహిత్యకారులకు ప్రతి సంవత్సరం ఇస్తున్నట్టే ఈ సంవత్సరం కూడా మలిశెట్టి సీతారామ్ స్మారక సాహితీ పురస్కారం 2021 కోసం చిత్తూరు జిల్లాకు చెందిన యువకవి పల్లిపట్టు నాగరాజు ఎంపికయ్యారు. న్యాయ నిర్ణేతలుగా ప్రముఖ సాహితీవేత్తలు డా.ఎం.హరికిషన్ (కర్నూలు), కె.పి.అశోక్ కుమార్ (హైదరాబాద్), ఎం.వి.రామిరెడ్డి (ఒంగోలు) వ్యవహరించారు. బహుమతి కథలతో బాటు మరికొన్ని ఎంపిక చేసిన కథలతో 'కథా ప్రపంచం 2021' పుస్తకం ప్రచురించబడుతుందని, ఆగస్టులో విజేతలకు బహుమతుల ప్రదానం, పుస్తకావిష్కరణ ఉంటాయని సంస్థ నిర్వాహకులు మలిశెట్టి శ్యాం ప్రసాద్ తెలిపారు. ఈ కథల పోటీ నిర్వాహకులుగా పలమనేరు బాలాజీ, పి.తులసి నాదం నాయుడు వ్యవహరించారు.

**– మలిశెట్టి శ్యామ్ ప్రసాద్, కార్యదర్శి, ఎమ్మెస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ**
**99850 13234**

# మన్నెం వీరుడు అల్లూరి



అల్లూరి సీతారామరాజు 1897 జులై 4వ తేదీన విశాఖ జిల్లా పాండ్రంకిలో జన్మించారు.
1922-24 మధ్య బ్రిటీషు వారికి వ్యతిరేకంగా గిరిజన ప్రజలతో కలిసి
మన్య పోరాటం నిర్వహించారు. 1924 మే 7వ తేదీన ప్రాణత్యాగం చేశారు.
ఇది అల్లూరి 125వ జయంతి సంవత్సరం.


చిత్రం : ఆర్. మల్లికార్జున రావు

SAHITYA PRASTHANAM ▪ SAMPUTI - 3 ▪ SANCHIKA - 10 ▪ KRISHNA ▪ July 2022
RNI NO.APTEL/2004/18396 ▪ Postal Regd. No.VJ/187/2020-22 PAGES : 68
Date of Posting : 1st & 2nd of Every Month ▪ Date of Publication : 27.06.2022


# ప్రజాశక్తి బుక్‌హౌస్ తాజా ప్రచురణలు

## సామాజిక విప్లవకారుడు పోతులూరి వీరబ్రహ్మం

సమగ్ర సాహిత్యం రచనలు




రూ. 1200/-

* వీరబ్రహ్మం నడిపిన ఉద్యమం చాలా విశాల దృక్పథంలో నడిచింది. ఉద్యమంలాగా ఆయన స్త్రీలన్నీ, సామాజిక అసమానతల్ని ద్వేషించారు. - జి.లక్ష్మీనరసయ్య
* వేమన, వీరబ్రహ్మంలు అసమానతల లోపిడీ వ్యవస్థని, కుల వ్యవస్థని, అంటరానితనాన్ని, మతాన్ని, మూఢాచారాలని, వేదాల్ని, యజ్ఞాల్ని, పౌరోహిత్యాన్ని మాత్రమే విమర్శించలేదు. అంతటితో ఆగలేదు. బ్రాహ్మణ ఆధిపత్యాన్ని ప్రశ్నించారు. దాన్ని బోధిస్తుంది. ఆ వాళ్ళు చేసిన గొప్పనేరం. - జి.కల్యాణరావు
* బ్రహ్మంగారి రచనలు 17వ శతాబ్దం నాటి రాజకీయ అస్థిరతకూ, ప్రజల కడగండ్లకూ పాలకుల మత సాంఘిక వైరుధ్యాలకూ తాత్విక భాష్యాలు. - ఎస్.గోపి
* వీరబ్రహ్మం కాలేది చెప్పినా దాన్ని ఆచరించి చూపడానికి వీలుగా కులమతాలకు అతీతంగా వివిధ వృత్తుల వారిని దగ్గరకు చేర్చుకున్నారు. - దార్ల వెంకటేశ్వరరావు
* బ్రహ్మంగారు చేసిన గురుబోధలు ఎంతో గట్టిగా ఉన్నా పామర జనం గుండెల్లోకి సూటిగా దూసుకుపోయే బాణాల వంటివి. - ఆరుద్ర




కాళికాంబా సప్తశతి
రూ. 100/-




పోతులూరి వీరబ్రహ్మం
సమగ్రలభ్యరచనలు
రూ. 200/-




వీరబ్రహ్మం పద్యాలు
రూ. 110/-



కర్మయోగి వీరబ్రహ్మం
రూ. 30/-




వీరబ్రహ్మం రచనలు
రూ. 70/-




విప్లవకవి యోగి వీరబ్రహ్మం
రూ. 120/-



తాత్వికత - కులాతీతత
పోతులూరి వీరబ్రహ్మం
రూ. 40/-



బహుముఖ ప్రజ్ఞాశాలి - బహుజనతాత్వికుడు
రూ. 40/-



వేమన - వీరబ్రహ్మం - ఒక పరిశీలన
రూ. 25/-



వీరబ్రహ్మం
కవిత్వం : కవిత్వాంశాలు
రూ. 45/-

20% ప్రత్యేక తగ్గింపుతో...

విజయవాడ : 9490099055
విశాఖపట్నం : 9490099058
గుంటూరు : 9490094430
ఏలూరు : 9440013188
ఒంగోలు : 9492292038
నెల్లూరు : 9490099279
కర్నూలు : 8500042738
అనంతపురం : 9554223317

Prajasakti Printers & Publishers.P(Ltd)
SBI A/c : 35712952033
IFSC Code : SBIN0001008
Governorpet Branch, Vijayawada

గూగుల్ పే, ఫోన్‌పే నెం : **9490099258**
రిజిస్టర్ పోస్టులో పంపుతాం

ప్రజాశక్తి బుక్‌హౌస్
9490099057

27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ - 2, ఫోన్ : 0866 - 2577533
**బ్రాంచీలు :** విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, కాకినాడ, ఏలూరు, విజయనగరం, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం